దేశంలో అత్యధికంగా చదవబడుతున్న తెలుగు మాసపత్రిక

జ్యోతి

04-1980

ఏప్రిల్ '80

రూ. 3/-




నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన

కొండేటి రామకృష్ణమూర్తి నవల

"మానవుడు"


కె.విశ్వనాథ్
పూర్ణోదయా ఆర్ట్ క్రియేషన్స్
శంకరాభరణం
ఈస్ట్మన్ కలర్
నిర్మాతలు
ఏడిద నాగేశ్వరరావు
ఆకాశం శ్రీరాములు
లక్ష్మీ ఫిలింస్


సత్యచిత్ర
కొత్తపేట రౌడీ
ఈస్ట్మన్ కలర్
నిర్మాతలు
సత్యనారాయణ, సూర్యనారాయణ
దర్శకత్వం
పి. సాంబశివరావు
లక్ష్మీ ఫిలింస్

సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

ఏప్రిల్ 1980

సంపుటి 18 | సంచిక 3

విషయసూచిక

ఈ నెల నవలానుబంధం

నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన నవల

మానవుడు

రచన : కంఠంనేని రాధాకృష్ణమూర్తి

ముఖచిత్రం : 'బుచ్చిబాబులో'లో నాగేశ్వరరావు

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్ : 423123
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 43 రూపాయలు



స్మరణం

మాలో ఒకరుగా వుంటూ, గత పదిసంవత్సరాలుగా 'జ్యోతి' కార్యాలయంలో ముఖ్యమైన తన బాధ్యతను నిర్విరామంగా నిర్వహిస్తూ వచ్చిన శ్రీ విఠల్‌రావు (30) ఫిబ్రవరి 28 న కీర్తిశేషులయ్యారు. మా దుఃఖాన్ని వ్యక్తం చేయడానికి మాటలు లేవు. 'జ్యోతి'కి విఠల్‌రావుగారు చేసిన సేవలను, వారి స్నేహ వాత్సల్యాలనూ స్మరించుకొంటూ, వారి కుటుంబ సభ్యులకు సజల నేత్రాలతో మా సానుభూతి తెలియజేసుకొంటున్నాము.

—జ్యోతి కుటుంబం

తొలిమాట

కృష్ణశాస్త్రి

'మూగవోయిన నా గళమునను కూడ, నిదురవోయిన సెలయేటి రొదలు గలవు!' ఎంతబాధతో, ఎంత దుఃఖంతో ద్రవించి తలిరుటాకులవంటి పదాలతో ఈ పద్యం అల్లుతున్నారో ఆయన! నిజమే. ఆ నాడాయన భౌతిక స్వరపేటిక మూగవోయినా, కవితాత్మ కంఠం కమనీయ గీతాలు ఆలపిస్తూనే వుంది. కలమే ఆయన కంఠం. కలలే ఆయన కంఠం. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అస్తమించారనడం శాశ్వత సత్యం కాదనిపిస్తోంది మాకు. చందమామ శాశ్వతంగా అస్తమించాడంటే యెలా నమ్మడం! ఆంధ్ర సాహిత్యం సాక్షిగా కృష్ణశాస్త్రి అమరుడు. ఆకులో ఆకై, పూవులో పూవై, కొమ్మ వూయలలూగుతూ, సుకుమారమైన గాలి వేళ్ళతో సెలయేటి సితారుమీద అలల సరిగమలు పలికించిన అపురూప కవితా సంగీతకారుడాయన. జీవితాన్ని అమితంగా ప్రేమించి, అనుక్షణమూ జీవితాన్ని జీవించి, జీవితాన్నే ధ్యానిస్తూ కన్నుమూసిన జీవిత ప్రేమికుడాయన. ఆయన వున్నచోట గాలికూడా ఆగిఆగి వీచేది. ఆయన కాలు మోపినచోట నేల మెత్తనై ఆయన అడుగులకు మడుగులొత్తేది. ఆయన కనిపిస్తే ఆకులూ, పూలూ పులకించి వూగిపోయేవి. షెల్లీ, కీట్స్, టెనిసన్, థామస్‌మూర్, రవీంద్రనాథ్‌టాగూర్ వంటి కవులప్రభావంతో తెలుగులో భావకవితా స్వాప్నిక జగత్తును ఆవిష్కరించిన కృష్ణశాస్త్రి, తెలుగు దేశం నాలుగు చెరగులా ఉన్మత్త మధుర పరిమళ పవనమై వీచి కృష్ణ పక్షం, ఊర్వశి, ప్రవాసం వంటి రమ్య కావ్యాలను సృష్టించారు. అపురూపమైన సుకుమార పదజాలం ఆయన కలం వాకిలి ముందు పిలుపు కోసం వేచివుండేది. కృష్ణశాస్త్రిగారిదొక భిన్న ప్రపంచం. ఆయనొక దివిసీమ దొర. అదిగో, ఆయన యింకా అక్కడేవుండి పాడుతున్నారు-'దిగిరాను దిగిరాను దివినుంచి భువికి.....!'

ప్రియమైన భారతజాతి ప్రజలకు స్విట్జర్లెండ్ నుంచి ఒక మిత్రుని వ్యక్తిగత సందేశం

మీ దేశాన్ని రెండుసార్లు వేర్వేరు సందర్భాలలో సందర్శించే అవకాశం నాకు కలిగింది. ఒక సందర్భంగా నేను, ఇద్దరు భారతీయ మిత్రులతో హిమాలయ పర్వతాలకు వెళ్ళేను. ఆ పరిసరాలలో నాకు స్వగృహంలో వున్నట్లే తోచినది. కారణం ఏమిటంటే స్విట్జర్లెండ్‌లో నేను పర్వత ప్రాంతాలలోనే నా జీవితంలో చాలా కాలం గడుపుతున్నాను.

నేను చేసే కలప దూలాల వ్యాపారం మూలంగా పెక్కు పర్వత ప్రాంతాలకు వెళ్ళే వాడిని. నా వ్యాపారం తొలిదశలో ఎత్తైన కొండలలోని అడవుల నుంచి, డబ్బు ఖర్చు ఎక్కువ కాకుండా విశిష్టంగా కలపను రవాణా చెయ్యవలసిన సమస్యల నెదుర్కొనవలసి వచ్చింది. కొన్ని సంవత్సరాల పరిశోధనలకు పిమ్మట స్పెషలైజు చెయ్యబడిన మెషిన్లు కేబుల్ వేసి ఉపయోగిస్తూ చివరకు ఒక స్కైలైన్ క్రేన్ రూపొందించాను. దానితో కలపకోసం కొండలమీది అడవులలో ప్రవేశించి అక్కడ చెట్లు కూల్చి, కలప దూలాలను సేకరించే అసాధ్యమైన పరిస్థితి ఇప్పుడు సులభమైనది. ఈ క్రేనుతో 330 అడుగుల వెడల్పు గలిగి ఒక మైలుకన్నా నిడివి కల అడవి ప్రాంతం నుంచి కలప సేకరించడం సుసాధ్యమైంది. కలప మోసుకురావడానికి ప్రత్యేకంగా ఒక క్యారేజి డిజైన్ చేయబడింది. ఒక సింగిల్ ఆపరేటింగ్ కేబుల్ ఒక్క స్కైలైన్ మాత్రమే అవసరమయ్యేవి. కలప దూలాల రవాణా మార్గానికి రెండువైపుల నుంచి పైకి పంపడానికి, క్రిందికి రప్పించడానికి కూడా వీలయ్యేది. క్రింద కనపరచిన చిత్రంలో స్కైలైన్ క్రేన్‌యొక్క ఒక భాగం చూడవచ్చును. ఈ సందర్భంలోనే ఎంతగానో ఉపకరించిన స్కైలైన్ క్రేన్లు యిప్పుడు ఇంజనీరింగ్ ప్రాజెక్టులకు కూడ భారతదేశంతో సహా 33 దేశాలలో ఉపయోగించబడుచున్నది.




ఈ సాంకేతిక సాహసిక చర్యలో నేను సంపాదించిన అన్ని విజయాలకు ఘనత, ఈ ప్రపంచాన్ని అందులోని అన్నిటిని సృష్టించిన ఆ దేవునికే యిస్తాను. ఆయన మహా మహిమాన్వితుడైన సృష్టికర్త అయినప్పటికి మన వ్యక్తిగత వ్యవహారాలలో శ్రద్ధాసక్తులు వహిస్తారు. దేవునిలో నాకు గల విశ్వాసం నేను చేసే ప్రతి పనిలోను వున్నది. వారానికి ఒకసారి చర్చికి వెళ్ళడంతో అది అపరిమితం కాలేదు. నేను ఎప్పుడైనా ప్రత్యేకంగా ఒక పని చెయ్యవలసి వస్తే కూడా నమ్రతతో ప్రార్థిస్తాను. ఆయన నా ప్రార్థనల నాలకిస్తాడు. నన్ను ఆశీర్వదిస్తాడు. అందుకే నా వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా వృద్ధి చెందుతూ వుంది.

స్విట్జర్లెండ్‌లో నేమి, ఇతర దేశాలలో నేమి, అనేకమంది ప్రజలు తాము క్రైస్తవులమని చెప్పుకుంటారు, వారు పేరుకు మాత్రమే క్రైస్తవులు. కాని నిజానికి వారు "క్రీస్తు లేని క్రైస్తవజీవులు" 1. వారెన్నడు జీసస్ క్రైస్తుని దేవుని కుమారునిగా అంగీకరించలేదు. తమ ఆత్మ రక్షకుడుగా పరిగణించలేదు. ఏమైనప్పటికి జీసస్ క్రీస్తుని మనవారు అంగీకరించిన చిత్తశుద్ధిగల క్రైస్తవులు ప్రయోజనాత్మకమైన సంతోషభరితమైన జీవితాలు గడుపుతూ వుండడం నేను గమనించాను. వారు దుర్భాషలాడరు కోపించరు కలహించరు చౌర్యం చెయ్యరు అబద్ధాలాడరు. 2. వారు క్రీస్తుచే సృజించబడినవారివలె దేవుని సహాయమార్గదర్శకత్వాలపైనే ఆధారపడి జీవిస్తారు. వారి మనస్సులలో శాంతి నిరంతరం తాండవిస్తుంది. దేవుని సమక్షంలోనే తమ జీవితమంతా శాశ్వతంగా గడిపివేయగలమన్న విశ్వాసంతోనే వారు ఇలా జీవిస్తున్నారని నేను ఆ తర్వాత గ్రహించాను. ఇదంతా చూసిన పిదప నా మటుకు నేను అటువంటి జీవితాన్నే అభిలషించాను. అందువలన నేను చేసిన పాపాలకు పశ్చాత్తాప పడ్డాను. నా హృదయంలో ప్రవేశించమని జీసస్ క్రీస్తును వేడుకున్నాను. 3, 4. ఆయన అలాగే చేశారు. అది దివ్యానుభూతి. అప్పటినుంచి నేను జీసస్‌తోనే నడిచాను. నా జీవితం ఇప్పుడు అత్యంతానందభరితం. నా హృదయంలో అనిర్వచనీయమైన శాంతి, నా తోటి వారితో నెమ్మది. ఈ విమూత్నానుభూతి కలిగినప్పటినుంచి ప్రజలు నిజమైన దేవుడినైనా ప్రార్థిస్తారు, అని లేదా వారు అనిత్యమైన ప్రాణము లేని దేవుడిని అనగా వ్యక్తి, డబ్బు, ఐహిక సుఖాలు, భాగ్యభోగాలు, జంతువులు, విగ్రహాలు, తాము స్వహస్తాలతో చేసుకొన్న వాటినైనా పూజిస్తారని గ్రహించాను. 5, 6. మానవులకు దేవుని అవసరం వుంది. అయితే వారి పాపములవలన వారు దేవుడికి దూరమైనారు. మానవులు పాప పంకిలంలో మునిగిపోయినపుడు భగవంతుడు వారికి సరియైన మార్గము చూపుట కొరకు స్వయంగా తానే సాక్షాత్కరించాడు. అందుకే జీసస్‌ను చట్టం అవసరాలు తీరే నిమిత్తం మరణించవలసిందని శాసించింది. మానవుని పాపాల నుండి రక్షించుటకొరకు ఆయన మరణించాడు. మనము, మన గురించి జీసస్ తన ప్రాణాలర్పించినాడని హృదయపూర్వకంగా విశ్వాసముంచి అతనిని మన పాపముల ప్రాయశ్చిత్తమునకై ప్రార్థించినచో అప్పుడు మన జీవితము సార్థకమవుతుంది. మరియు మన పేర్లు జీవిత గ్రంథంలో వ్రాయబడుతాయి. మనము పాప విముక్తులయినపుడు మన ప్రార్థనతో దేవునితో స్వయంగా మాట్లాడగలిగే అద్భుతావకాశం లభిస్తుంది. 8. మనకు సహాయం అవసరమైనపుడు తన సింహాసనం వద్దకు రావలసినదిగా దయతో ఆయన చెప్పే ఆహ్వానాన్ని మనం అందుకొంటున్నాము. 9. అసత్యమైన దేవుళ్ళను మన మెప్పుడైతే బహిష్కరించగలమో అపుడే యిది సుసాధ్యమవుతుంది. 10. మనం ఇతర అసత్యమైన దేవుళ్ళను కొలుస్తే ఆయన మనలను సహించలేరు. ఆయనకు మాత్సర్యం ఎక్కువ. ఆయన అన్య దేవుళ్ళను మనము ప్రార్థించడాన్ని కాని మరే దైవ సంబంధం కలిగి యుండడముగాని సహించలేరు. 11. పాపం నుంచి ముక్తికి దారిచూపే ఈ మార్గాన్ని గురించి యావత్ప్రపంచానికి తెలియజేయడం అవసరం. ప్రజలందరికి రేడియోద్వారా, పత్రికలద్వారా, టెలివిజను ద్వారా వినిపించవలసిన శుభ సమాచారమిది. జీసస్ క్రైస్తు ప్రభువు సందేశాన్ని వినే అవకాశం అందరికి కలిగించాలి. తన కుమారుడు జీసస్‌ద్వారా ప్రజల కాయన అందించే సందేశాన్ని గురించి తమకు తామే నిర్ణయించుకునే అవకాశం యివ్వాలి. 12. దేవుని గురించి మనకు వెల్లడియైన ఈ విషయాలన్నీ బైబిల్‌లో విపులీకరించబడినవి. ప్రాణముతో నుండు ఈ పుస్తకం 2000 భాషలలోనికి తర్జుమా చేయబడినది. బైబిల్ భగవంతుడు తనను గురించి మరియు మానవుల ముక్తి గురించి జరిగినవి, మరియు భవిష్యత్‌లో జరుగ నున్నవి తన ఆలోచనలను తెలిపినారు. 13. పవిత్ర ఆత్మ ప్రబోధం పొందినవారిచే అది వ్రాయబడినది. మన ప్రశ్నలకు, సందేహాలకు అందులో సమాధానాలున్నవి. మరియు మనము ప్రతిరోజు ఎదుర్కొను అనేక సమస్యలు పరిష్కరించబడి యున్నవి.

మొత్తంమీద బైబిల్‌లో వున్న ఒకే ధోరణి ముక్తికి భగవంతుడు చూపే మార్గం. ఈ ప్రపంచములో శిలువపై జీవులుకై అసువులు బాసిన దేవుని కుమారుడు జీసస్ క్రైస్తుతోనే అది ముగిసింది. మనం చెయ్యవలసినదంతా ఒకటే. ఆయన ఆహ్వానాన్ని అంగీకరించడం. లోగడ మనం పూజించిన దేవుళ్ళందరను వదిలివేయడం. మన పాపాలకు పశ్చాత్తాపపడడం, మన రక్షకుడుగా ఆయనను సంగ్రహించడం. ఆయన అపూర్వమైన, అద్భుత జీవితాన్ని మనం ఎదురు చూడవచ్చు. ఆయనతోపాటే స్వర్గంలో మనం శాంతియుతంగా వుండవచ్చును.

ఎవరైతే ఏసు ప్రభువును మనస్ఫూర్తిగా అంగీకరించెదరో అటువంటి నిజమైన క్రిస్టియనులతో ఎల్లప్పుడు భగవంతుని ప్రార్థించండి. కొలవండి. మీ సర్కారు గురించి, ఇతరుల గురించి ప్రార్థించండి. మరియు భగవంతుడు వారిని రక్షించుటలో సాక్షులై నిలవండి. ప్రియ



ఉత్తరాలు

పొరపాటే!

ఆర్.ఎస్. సాగర్‌గారు ఫిబ్రవరి 'జ్యోతి' ఉత్తరాల శీర్షికలో వ్రాసింది నిజమే. వారు చెప్పిన పుస్తకం నిన్ననే చదివాను. నా కథకు పాటందించిన ఒక మిత్రుడు ఇప్పటికీ ఆ పాట తన స్వంతమేనని బుకాయిస్తూ అందర్నీ గుడ్డిగా నమ్మకూడదని నిరూపిస్తున్నాడు. (అతని అయిష్టతకు కారణంగానే ఆ కథకు రచయితగా అతని పేరు జోడించడం జరగ లేదు) ఆర్. ఎస్. సాగర్‌గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాను.

—కె. చంద్రశేఖరరావు, వరంగల్.

'జయసుధ' ముఖచిత్రంతో వెలువడిన 'మార్చి' జ్యోతి సర్వాంగ సుందరంగ వుంది. నిరుద్యోగం బాధాకరం మాత్రమే కాని నిరాశా జనకం, అవమానపూరితం కాదనే చక్కని సందేశాన్ని 'మంజులనాదం' నవల వ్రాసిన రచయితగారికి, ప్రచురించిన మీకు కృతజ్ఞతలు. ప్రేమసింహాసనం, యుగాంతం సీరియల్స్ జోరుగా సాగుతున్నాయి. కథలలో 'తిరిగొచ్చిన గేదె', 'కురూపి', 'శ్లేష' చాల బాగున్నాయి.

—ఎన్. ప్రసాద్, విశాఖపట్నం.

జయసుధ ముఖచిత్రంతో వెలువడిన 'జ్యోతి'లో 'తిరిగొచ్చిన గేదె', 'మనం మనం ఒకటి' కథలు చాలా బాగున్నాయి. యండమూరి వీరేంద్రనాథ్ 'యుగాంతం' సీరియల్ కొత్తతరహాగా వుంది. కార్టూన్ల ఎంపికలో మీరుశ్రద్ధ తీసుకుంటున్నందుకు అభినందనలు.

—వల్లభనేని హనుమయ్యచౌదరి, వడాలి.

మేము "జ్యోతి"కి క్రొత్త పాఠకులం. "ప్రేమసింహాసనం", "మీరా" సీరియల్స్ చాలా బాగున్నాయి. ఈ నెల కథలన్నింటిలో "తిరిగి రాని క్షణాలు," "మనం మనం ఒకటి" "నీ వెలుగే నాకు చీకటి" కథలు మాకు బాగా నచ్చాయి, జయసుధ ముఖచిత్రం మమ్మల్ని బాగా ఆకర్షించింది. ముద్దంశెట్టిగారి నవలానుబంధం "మంజులనాదం" అత్యుత్తమంగా ఉంది.

—. చంద్రశేఖర దేశాయ్,

—కె. జగదీష్‌కుమార్, ఆదోని.

శ్రీశ్రీ అన్యాయం

పదబంధ ప్రహేళికలో శ్రీశ్రీగారు మళ్ళీ కొంచెం అన్యాయానికి ఒడిగడుతున్నారు. ఈనెల పజిల్‌లో "బకాసురుడిది తీరు" జవాబు బాస అని కొద్దిమందికి తప్తే తట్టవచ్చును కానీ తట్టాలని రూలులేదు. "వెళ్ళపిళ్ళవారు పీని బాస వేరు" అన్నప్పుడు శ్రీశ్రీ చేసిన వ్యాఖ్య గురించి తెలిసినవారికి మటుకు కొంచెం సులభంగా తడుతుంది. అలాగే "అయిదును పది చేయడం" అంటే "దండం" రెండు చేతులూ కల్పినప్పుడు రెండు చేతుల వేళ్ళు కలిసి పది అనే అర్థంలో ఇచ్చారు. ఇవి కొంచెం "ఫార్ ఫెచ్డ్" క్లూస్‌గా కన్పిస్తాయి.

—ఎన్. కే. రామారావు, నల్లగొండ.

సాంస్కృతిక విశేషాలు

ఇటీవల ఐ. ఐ. టి. మద్రాసు, తెలుగు సాంస్కృతిక సమితివారు డా॥ దారా రామ

రచయితలకు మనవి

జ్యోతిలో ప్రచురణ కోసం రచనలు పంపేవారు ఈ కింది విషయాలను గమనించవలసిందిగా కోరుతున్నాము.

రచనలు కాగితానికి ఒక వైపున, స్పష్టమైన దస్తూరిలో రాయాలి.

రచనలు తిప్పి పంపకోరేవారు తగిన పోస్టేజీ అంటించిన కవర్లు రచనలతో పాటే పంపాలి. స్టాంపులు విడిగా పంపినా, రచనలతో, కార్డులు ఇన్లాండ్ లెటర్లు జతచేసినా సమాధానాలు రాయడం సాధ్యం కాదు. రచనలు అంగీకరించబడితే ఆ విషయం మేమే తెలియజేస్తాము.

రచనలు, ఎడిటర్, జ్యోతి పేరనే పంపాలి. రచనల పరిశీలనకు, కనీసం రెండు మాసాల వ్యవధి అవసరమవుతుంది.

ఈ అంశాలను దృష్టిలో వుంచుకొని మాతో సహకరించవలసిందిగా కోరుతున్నాము.

—ఎడిటర్.

నాథశాస్త్రిగారి నాట్యావధాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. డా॥ చిన్నికృష్ణయ్య కార్యక్రమాన్ని నిర్వహించగా, పృచ్ఛకులుగా శ్రీ యమ్. యన్. రెడ్డి శ్రీ పి. బి. శ్రీనివాస్ శ్రీ జి. యన్. స్వామి, శ్రీ ఐ. జె. రావుగార్లు వ్యవహరించారు. అదే రోజున సినిమాకు బహుబతి పోటీని శ్రీ వి.పి.కె. రంగారావు నిర్వహించారు.

కళాసాగర్ కార్యక్రమాలు

మద్రాసు సాంస్కృతిక సంస్థ 'కళాసాగర్' ఫిబ్రవరినెల మొదటి రెండు వారాల్లోనూ భారీ సాంస్కృతిక కార్యక్రమాలను యేర్పాటు చేసింది. ఫిబ్రవరి 8 న, శంకరదాస్ హాలులో యేర్పాటైన "విరజాజి" నాటకంలో ప్రధాన పాత్రపోషణకు జంషెడ్‌పూర్‌నుంచి ఆ నాటక రచయిత, నటుడు శ్రీ ఆర్. వి. చెలం, ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ కమీషనర్ శ్రీ యల్. మాలకొండయ్య ప్రత్యేకంగా హైదరాబాద్ నుండి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఫిబ్రవరి 9 న చారిత్రాత్మక నాటకం "ధర్మజ్యోతి" హైదరాబాద్ లిటిల్ థియేటర్‌వారు ప్రదర్శించారు.

ఫిబ్రవరి 13 న శ్రీమతి సరోజినినాయుడు జయంతి సందర్భంగా కలైవానర్ అరంగంలో కళాసాగర్ యేర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రవీంద్రుని "చండాలిక" నృత్యనాటికను శ్రీ వెంపటి చిన్నసత్యం దర్శకత్వంలో కూచిపూడి ఆర్ట్ అకాడమీవారు ప్రదర్శించారు.

ఈ మనోహర నృత్యనాటికలో, సుప్రసిద్ధ నర్తకి శోభానాయుడుతోబాటు దాదాపు నలభై మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తమిళనాడు ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ సౌందరరాజన్ కళాసాగర్ తరపున శ్రీ వెంపటి చినసత్యంను పూలమాలాంకృతులను గావించి దుశ్శాలువను కప్పి సత్కరించారు.

రచయిత్రుల సభలు

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్వర్యమున మచిలీపట్నంలో త్వరలో ఆంధ్ర రచయిత్రుల 10 వ మహాసభలు జరుగనున్నాయి. యీ విషయాన్ని అకాడమీ కార్యవర్గ సభ్యుడు శ్రీ గుత్తికొండ సుబ్బారావు ఒక పత్రికా ప్రకటనలో తెలియజేస్తూ యీ సభల కన్వీనరుగా డాక్టరు ఊటుకూరి లక్ష్మికాంతమ్మగారు నియుక్తులైనట్లుగా తెలిపారు.

గత నెల 22వ తేదీన మచిలీపట్నంలో జరిగిన ఒక సమావేశములో మహాసభల నిర్వహణకుగాను స్పందన సాహితీ సమాఖ్య ఆధ్వర్యాన ఒక ఆహ్వాన సంఘం ఏర్పాటయినది. శ్రీమతి అక్కల సరస్వతీ బాబూరావు యీ ఆహ్వాన సంఘానికి కార్యదర్శి. □



'కళాసాగర్' వారు యిటీవల యేర్పాటు చేసిన 'చండాలిక' 'నృత్యనాటిక'లో రాజు, శోభానాయుడు

కళాశాల విద్యార్థుల కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

తీరని కోరిక

ఎమ్వీజీ కృష్ణమూర్తి బి. టెక్ (నాల్గవ సం॥)
ఏ. యు. ఇంజనీరింగ్ కాలేజి [illegible]ఖపట్నం.

కోరికలందరికి వుంటాయి.

అందులో తీరని కోరికలుకూడ కొన్ని వుంటాయి.

అలాగే రామ్మూర్తికి ఓ కోరికవుంది.

ఆ కోరికే రామ్మూర్తి పాలిట పెద్ద తీరని కోరికయింది.

రామ్మూర్తి ఓ చిన్న ఆఫీసులో కొంచెం పెద్ద ఆఫీసరు. రామ్మూర్తికి పెళ్ళి అయింది. యిద్దరు పిల్లలుకూడ వున్నారు. అయితే రామ్మూర్తి తీరని కోరిక నోబుల్ ప్రయిజ్ సంపాయించాలనీకాదు, చంద్రమండలంలోకి ఎగరాలనీకాదు. అయితే మరి రామ్మూర్తి కోరికేమిటి?

సినిమా చూడాలని!

కేవలం సినిమా చూడడమే, రామ్మూర్తి తీరని కోరికంటే మీరు నమ్మరు. కాని నిజం అదే.

రామ్మూర్తికి అయిదేళ్ళనుండి సినిమాకు వెళ్ళాలనివుంది.

అయిదేళ్ళలో రామ్మూర్తి సినిమాకే వెళ్ళ లేదా? అని మీకు అనుమానం రావచ్చు.

రామ్మూర్తి సినిమాకు వెళ్ళాడు. కాని పెళ్ళాంతో వెళ్ళాలని అతని కోరిక. పెళ్ళయిన వాడు అయిదేళ్ళలో పెళ్ళాంతో కల్సి ఒక్క సిన్మాకి వెళ్ళలేదా అని మీకు మళ్ళీ అనుమానం రావచ్చు.

రామ్మూర్తి పెళ్ళాంతో చాలాసార్లు వెళ్ళాడు కాని తమ పెళ్ళిరోజునాడు పెళ్ళాంతో కల్సి రామ్మూర్తికి సినిమాకి వెళ్ళాలని వుంది. అదే అతని తీరని కోరిక.

రామ్మూర్తి తీరని కోరిక తెల్సుకుని మీరు ఆశ్చర్యపడవచ్చు. కాని నిజం అదే.

రామ్మూర్తికి పెళ్ళయి అయిదేళ్ళయినా, తన చిన్న కోరికను తీర్చుకోలేకపోయాడు.

మొదటి సంవత్సరం పెళ్ళిరోజునాడు పెళ్ళాంకి తలపోటొచ్చింది. రెండో సంవత్సరం పెళ్ళిరోజునాడే మామగారు పోయారని టెలిగ్రామ్ వచ్చింది. మూడో సంవత్సరం అదే రోజున పెద్దకొడుక్కి జ్వరమొచ్చింది. నాల్గో సంవత్సరం కరకుగా అతని పెళ్ళిరోజునే నగరంలో కర్ఫ్యూ పెట్టారు. అలా నాలుగేళ్ళూ రామ్మూర్తికి తన కోరిక తీర్చుకునే అవకాశం లేకపోయింది. అందుకే అతనికది తీరనికోరిక అన్పించింది.

యిది రామ్మూర్తికి పెళ్ళయిన అయిదో సంవత్సరం. ఈ రోజు అతని మేరేజ్ డే.

అసలు వారం రోజుల ముందే రామ్మూర్తి తమ పెళ్ళిరోజునాడు ఏంచేయాలో, ఎలా చేయాలో ప్రోగ్రాం వేసుకున్నాడు. అయితే అనుకోకుండా నిన్నరాత్రి రామ్మూర్తి యింటికి పిల్లా, పీచుతో కల్సి మొత్తం పదిమంది చుట్టాలు వచ్చారు. వాళ్ళను చూడగానే రామ్మూర్తికి పైప్రాణాలు పైనే పోయాయి. వెధవ దిక్కుమాలిన ఘుటా ఒక్కరోజు ఆగి రాకూడదు అని రాత్రంతా వాళ్ళను మనసులోనే తిట్టుకున్నాడు, తన ప్రోగ్రాంని పాడు చేసినందుకు.

రామ్మూర్తి వచ్చిన చుట్టాలతో కల్సి సినిమాకు వెళ్ళకూడదా?

వెళ్ళవచ్చు. కాని రామ్మూర్తి కోరిక అది కాదు గదా! కేవలం తను, భార్య మాత్రమే వెళ్ళాలి. చేసేదేం లేక, వాళ్ళందర్నీ మళ్ళీ తిట్టుకుంటూ ఉదయాన్నే ఆఫీసుకు వచ్చేశాడు రామ్మూర్తి.

రామ్మూర్తి ఆఫీసుకు వచ్చిం దగ్గర్నుంచి అందర్నీ దంచేస్తున్నాడు. 'ఆ ఫైలేది, ఈ లెటర్ ఇంకా ఎందుకు పంపించలేదు' అంటూ ఎగిరిపోతున్నాడు. ఒక్కమాటలో చెప్పా

లంచే రామ్మూర్తి ఈ రోజు ఆఫీసుకు వచ్చి పులై పోయాడు. రామ్మూర్తి ఆవేశానికి కారణం ఎవరికీ తెలియలేదు, ఆఫీసులో. ఆఖరుకి సువర్ణకి కూడా.

సువర్ణ ఆ ఆఫీసులో టైపిస్టు.

చదువుకునే రోజుల్లో రామ్మూర్తి సువర్ణను ప్రేమించాడు. పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. కాని రామ్మూర్తి తన నిర్ణయం తెలిపేటప్పటికి సువర్ణకి పెళ్ళి నిశ్చయమైపోయింది. ఆ తర్వాత రామ్మూర్తి పై చదువులు చదువుకోడం, ఆఫీసరయి సువర్ణ టైపిస్టుగా వున్న ఆఫీసుకే రావడం జరిగాయి.

అందువల్ల రామ్మూర్తి తన విషయాలన్నీ సువర్ణతో చెప్పేవాడు. సువర్ణ కూడా ఆఫీసరు తన 'ఫ్రెండే' అని 'ఈజీ'గా తీసుకోక, ఆఫీసు అవర్సులో తన పని చేసుకుని, లంచ్ అవర్లో మాత్రం రామ్మూర్తి దగ్గరకు వచ్చి కబుర్లు చెప్పేది.

అయితే నిన్ననే రామ్మూర్తి చెప్పాడు సువర్ణతో తను రేపు శలవు పెడుతున్నానని. అందుక్కారణం సువర్ణకు తెలుసు. అయినా అది కూడా చెప్పాడు రామ్మూర్తి. కాని అలా శలవు పెడతానని చెప్పిన మనిషి యిలా ఆఫీసుకు వచ్చేయటం, అందరిమీద పులై పోవడం సువర్ణకు ఆశ్చర్యాన్ని కల్గించాయి.

అందుకే లంచ్ అవర్లో ఆ మాటే సువర్ణ రామ్మూర్తిని అడిగింది 'అదేమిటి మూర్తీ ఈ రోజు శలవుపెడతానని చెప్పి, ఆఫీసుకు వచ్చేశావేం?' అని.

రామ్మూర్తి మాట్లాడలేదు.

మళ్ళీ సువర్ణే అంది 'హాయిగా పెళ్ళిరోజు పూట పగలంతా యింటిదగ్గరే హేపీగా వుండి, రాత్రి ఏ సినిమాకో వెళ్ళక, ఆఫీసుకు వచ్చావేమిటి?'

'మొదట అలాగే అనుకున్నాను. కాని వీలవలేదు' రామ్మూర్తి చెప్పాడు.

'అదేం' సువర్ణ ఉత్సాహంగా అంది.

రామ్మూర్తి చాలాసేపు ఏ మాటా చెప్పడమా, మానడమా అని ఆలోచించాడు. చివరికి 'తన సువర్ణే కదా! ఎన్నిసార్లు పార్కుల్లో కూర్చుని కబుర్లు చెప్పుకోలేదు! ఎన్నెన్ని విషయాలు మాటలాడుకోలేదు తామిద్దరూ! అలాంటప్పుడు ఈ విషయం చెప్పడంలో తప్పేముంది' అని నిర్ణయించుకుని,

తన తీరని కోరిక సంగతి, నిన్న బంధువులు యింటికి రావటం, తన మూడ్స్ పాడవడం అన్నీ చెప్పేశాడు రామ్మూర్తి.

రామ్మూర్తి మాటలు విని సువర్ణ తెగ నవ్వింది. ఆఖరకు అంది 'మూర్తీ, మీ ఆవిడతో ఎలాగూ సినిమాకు వెళ్ళలేక పోయావు. కనీసం నాతోనన్నా వస్తావా యివాళ' అని.

రామ్మూర్తి ఆలోచనలో పడ్డాడు. చదువుకునే రోజుల్లో చాలాసార్లు తను సువర్ణతో కల్సి సినిమాలకు వెళ్ళాడు. అప్పటికింకా సువర్ణకి పెళ్ళి కాలేదు కాబట్టి అది వేరే సంగతి. ఇప్పుడు పెళ్ళయి, భర్తవున్న సువర్ణతో తను సినిమాకు వెళ్తే బాగుంటుందా? అని అనుకున్నాడు చాలాసేపు.

ఆలోచించి ఆలోచించి, తెలిసి తెలియనట్టుగా అన్నాడు 'నీ కివాళ వీలుంటుందా' అని.

రామ్మూర్తి అందీ అందగా ఆ మాట అన్నా, సువర్ణకు మాత్రం అర్థమైపోయింది. అందుకే అంది 'యివాళంతా నాకు తీరికే. ఎందుకంటే మా ఆయన కేంప్ వెళ్ళారు. ఇంట్లో ఒక్కర్తిని వుండాలంటే పరమ బోర్. అదీ కాకుండా ఈ రోజే నా ఫేవరేట్ మూవీ 'అలుమగలు' దుర్గా టాకీసులో రిలీజయింది. దానికి వెళ్దాం. ఏమంటావు!' అని.

'అలాగే నీ యిష్టం' అన్నాడు రామ్మూర్తి.

'కాని ఒక్క మాట. ఈ రోజు మాత్రం మన సినిమా ప్రోగ్రాంకి ఒక్క పైసా కూడా నువ్వు ఖర్చుపెట్టడానికి వీల్లేదు. తెల్సిందా?'

'అదేం' రామ్మూర్తి అన్నాడు.

'నీ మేరేజ్ డే సందర్భంగా ఈ రోజు ఈ చిన్నపార్టీ నేనివ్వాలనుకుంటున్నా' నవ్వుతూ అంది సువర్ణ.

రామ్మూర్తి కూడ సన్నగా నవ్వేశాడు.

రామ్మూర్తి మధ్యాహ్నమంతా వుషారుగానే వున్నాడు, 'తన కోరిక తీరకపోయినా కనీసం సినిమాకైనా వెళ్ళగల్గుతున్నందుకు.'

మధ్యాహ్నం మూడు గంటలయింది.

సువర్ణ స్ప్రింగుడోర్సు తెరుచుకుని రామ్మూర్తి దగ్గరకు వచ్చింది. 'మూర్తీ యింట్లో కొంచెం పనివుంది. పెర్మిషన్ కావాలి.'

'ఓ. కె' అన్నాడు రామ్మూర్తి.

'ఆ బైదిబై, సినిమాకు టిక్కెట్లు తెప్పించాను. సినిమాకు నేను రావడం కొంచెం లేటు అవుతుందేమో. అందుకే ఈ టిక్కెట్టు నీ దగ్గరే వుంచు. నేను మాత్రం మూవీ ప్రారంభమయేసరికి వచ్చేస్తాలే. నువ్వు కూడా వచ్చెయ్. మరిచిపోకేం' అని రామ్మూర్తికో టిక్కెట్టు యిచ్చి—యింటికి వెళ్ళిపోయింది సువర్ణ.

సాయంత్రం ఆరయింది. రామ్మూర్తి ఇంటికి వెళ్ళకుండా, అప్పటివరకు ఆఫీసులోనే గడిపేశాడు. తలా గట్రా దువ్వుకుని, నీటుగా తయారై, రామ్మూర్తి సగం సంతోషంతోనే థియేటరుకు చేరాడు ఆరున్నర అయేసరికి. కాని అప్పటికే జనాలంతా థియేటరులోకి పోయారు. న్యూస్‌రీలు మొదలెట్టారు. రామ్మూర్తి గబగబా తన టికెట్టు నంబర్ చూసుకుని థియేటర్‌లోకి వెళ్ళాడు. తనసీటు ఖాళీగవుంది. ప్రక్కసీట్లో మాత్రం యెవరో ఆడమనిషి కూర్చుంది కాని ఆవిడ మాత్రం సువర్ణ కాదని తేలిపోయింది. మరయితే సువర్ణ ఏమయినట్టు???

'ఏమయితేనేం, ముందు తను కూర్చోక పోతే వెనకవాళ్ళు తిడతారు' అనుకుని రామ్మూర్తి తన సీటువేపుకు నడిచాడు. రామ్మూర్తి తన సీటులో కూర్చోబోతుండగా 'యింతాలస్యం చేశారేం? యింకా మీరొస్తారో రారో అని కంగారుపడుతున్నాను. అయినా యిదేం పనండీ. ఉదయమే చెప్పచ్చుగా, ఫస్టుషోకి సినిమాకి వెళ్దామని. సువర్ణగారొచ్చి నాల్గుగంటలకు చెప్పారు 'మీరు సినిమాకి రమ్మన్నారని.' అప్పట్నుంచి ఎంత గబగబా తెమిలినా, యిక్కడకొచ్చేటప్పటికి ఆరుంపావు అయింది. తీరా యిక్కడికి వచ్చేసరికి మీరు కనబడలేదు....' అంటూ ప్రక్కనున్న ఆవిడ ఏదో చెప్తోంది.

ఆ ప్రక్కనున్నావిడ యెవరో కాదు. రామ్మూర్తి పెళ్ళాం. ఆశ్చర్యంతో తన సీట్లో కూలబ[illegible] రామ్మూర్తికి, ముందు సీటులో [illegible]న, నవ్వుతూ తనవైపే చూస్తున్న సువర్ణ, ఆమె భర్త కనబడ్డారు. □



21 **సీరియల్**

సుధీర్ తండ్రి హరినారాయణ, పోయిన రోజు నాడు, బంధువుల్ని మిత్రుల్ని భోజనాలకి పిలవటం అలవాటు। పూజలుచేసి, పండితుల్ని సత్కరించటం, యింటి నౌకర్లకి బట్టలు యివ్వటం ఆ యింటి ఆచారం।

సుధీర్ ప్రతి సంవత్సరంలాగానే, యీసారి కూడా యేర్పాట్లు ఘనంగానే కావించాడు. రేపటిరోజున ఆ కార్యక్రమం అనగా ఆ రోజు రాత్రి తల్లికి ఫోన్‌చేసి చెప్పాడు. ఆ రోజున స్వప్నని పెళ్ళి చేసుకుని యింటికి తీసుకువచ్చినవాడు, ఆవిడ అన్నగారి యింటికి వెళ్ళిపోయినప్పుడు సుధీర్‌తో అంది 'నువ్వు నా మనసు యెంత గాయపరచావో తెలియదు। నీ పెళ్ళి అనేది కేవలం నీ ఆనందం అని అనుకున్నావే గాని, ఆ వేడుకకోసం నేను ఎన్ని రోజులనుంచి ఎదురు చూస్తున్నానో గ్రహించలేక పోయావు। నా జీవితానికి వున్న ఒకే ఒక కలని నేల రాచావు. పెళ్ళి విషయంలో నీ స్వార్థం చూచుకున్నావే తప్ప అమ్మ ఆనందం గురించి ఆలోచించలేదు. సరే జరిగినదానికి నిన్ను నేనేమీ అనడంలేదు. నువ్వు నా గురించి ఆలోచించలేదెందుకు అని అడగటానికి కూడా నాకు సిగ్గుగా వుంది. అది నా దురదృష్టం అనుకున్నాను। నన్ను సంప్రదించకుండా నా ఆలోచనలతో, యిష్టాయిష్టాలతో, సంబంధం లేనట్లుగా, లెఖ్ఖచేయనట్లుగా ఆ అమ్మాయిని నువ్వు యింటికి తీసుకువచ్చావు। నాకు నచ్చని వ్యక్తులతో నేను ఎంత దూరంగా వుంటానో నీకు తెలిసీ నువ్వు యీ పని చేసా

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్‌చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందును సుధీర్‌పై కోపగించుకొంది విమల. స్వప్నని ఓదార్చి, పెళ్ళి చేసుకొంటానని చెప్పి, తన కౌగిలిలోకి తీసుకొని ముద్దాడినట్లు కలగన్నాడు సుధీర్. మెలకువ వచ్చినా స్వప్నని తాకిన అనుభూతిని మాత్రం మరువలేకపోయాడు. తల్లి బలవంతాన, విమలకు సారీ చెప్పేందుకు బయలుదేరాడు సుధీర్. ఆపదలో వున్న స్వప్నను తా నాదుకోవలసిన పరిస్థితులను మామయ్యకు వివరించి, తర్వాత విమలతో ముచ్చట్లాడి ఆమె కోపాన్ని పోగొట్ట గలిగాడు సుధీర్. సుధీర్ ప్రోత్సాహంతో బి. ఎ. పరీక్షకు కట్టింది స్వప్న. తనకు తెలియకుండానే సుధీర్‌ని అభిమానించ సాగింది. పరీక్ష లయ్యాయి. సుధీర్ మేనమామ కూతురు విమల స్వప్నని అవమానించింది. క్రైస్తవసన్యాసినిగా మారిపోవాలన్న స్వప్న నిర్ణయాన్ని మార్చి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. అహలమ్మ ఈ విషయంలో తన అయిష్టతని సుధీర్‌కి తెలియజేసింది.

వంటే నన్ను నేనే నమ్మలేనంతగా ఆశ్చర్యపోతున్నాను. ఆ అమ్మాయిని అలా తీసుకురావటం నన్ను వెళ్ళిపోమని చెప్పటమేగా!"

"అమ్మా!" సుధీర్ నోటినుండి ఆక్రందనలా వచ్చింది.

"నేను యిల్లును వదిలి వచ్చేశాను! నీ ఆనందానికి అడ్డురావడం అనేది నేను కలలోకూడా చేయని పని! నేను ప్రస్తుతం మామయ్యదగ్గర వుంటాను. తర్వాత, నా శేష జీవితం ఎక్కడ గడపాలో, నేనెక్కడ వుండాలో, అంతా ఆ భగవంతుడికే వదలివేస్తున్నాను! యిక నా జీవితం ఎలా వుంటుందో నాకే తెలియడంలేదు. ఎన్నో మైళ్ళు నడవవలసివుంటే, నడుం విరిగిన వ్యక్తిలా అయాను నేను!"

"అమ్మా! నన్ను—నన్ను క్షమించు-" అస్పష్టంగా అన్నాడతను.

"క్షమించటమా! ఆ మాట నాముందు యెత్తటానికి కూడా నీకు అర్హతలేదు. పెళ్ళి అంటే, నీ ఒక్కడి ఆనందమే అనుకున్నావు. అందులో నాకు భాగం లేదను కున్నావు! స్వసుఖాపేక్షతో, అమ్మకి జీవితానికి వున్న ఒకే ఒక ఆనందం హరిస్తు న్నానన్న అన్న సంగతి మర్చిపోయావు! మీ నాన్న పోయినప్పటికంటే విపరీతమైన బాధ కలుగుతోంది నాకు! ఆయన పోయినప్పుడు నా జీవితంలో చిమ్మచీకట్లు కమ్మిన మాట నిజమే. కానీ ఆ చీకట్లో నువ్వు చిరుదీపంలా కనిపించావు. అప్పుడు నాలో శక్తి వుంది! పట్టుదల వుంది. అందుకే పళ్ళ బిగువున యీ జీవితం యిలా ఒంటెద్దు కాడి మోపినట్టుగా యీదుకు రాగలిగాను. నువ్వు పెద్దవాడివి అయితే, నీ నీడలో, నా తనువు తెల్లవారిపోతుంది అని యెదురుచూసాను. కానీ నువ్వు నాకే నీడలేకుండా చేసావు!"

సుధీర్ మౌనంగా నిలబడిపోయాడు. తను ఆ సమయంలో ఒక్కచిన్న మాట అన్నా ఆవిడ వ్యథ రెట్టింపు అవుతుందని అతనికి తెలిసింది!

"ఇక నువ్వు వెళ్లు! చూడు. నువ్వు యిక నా కంటికి కనిపించవద్దు! నేను యెలావున్నాను అనే ఆలోచనే చేయవద్దు! నువ్వు నీ భార్యతో సుఖంగా సంతోషంగా వుండు. నేను యీ వూరిలో యెక్కువ రోజులు వుండి, నీకు అపవాదులు తీసుకురాను!"


"అమ్మా—"

"అమ్మ! అమ్మ అనే పదానికి నీకసలు విలువ తెలుసా? నేను అందరిలా నిన్ను పెంచలేదని మహా ఆతిశయపడ్డాను! నా పెంపకంలో నీకో వ్యక్తిత్వం వచ్చిందని మురిసిపోయాను! ఏమీలేదు! నేను అందరి తల్లులకంటే యింకా హీనం అయాను! నువ్వు తప్పుచేసావని నేను అనటంలేదురా? నీమీద నేను పెట్టుకున్న ఆశ, అత్యాశ అయిందే అని కృంగిపోతున్నాను. అది నా తప్పే! స్వయంకృతాపరాధమే! మనిషి చేసిన తప్పులేమిటో మర్చిపోయి ఫలితాలు అనుభవించాల్సివచ్చినప్పుడు కృంగిపోతాడు! వెళ్ళు-"

సుధీర్ తటపటాయింపుగా చూసాడు. ఆవిడ దృఢనిశ్చయంతో అంది. "ఇక నీ మాటలేవీ నన్ను మభ్యపెట్టలేవు! వెళ్లు! నా కింకా చెప్పాలని ప్రయత్నించకు! చూడు-నా కింకా ఆస్థిపాస్తులు వేటిమీదా ప్రలోభం లేదు. నీకేమయినా,కావాల్సివుంటే, కాగితాలు పంపు, సంతకాలు పెట్టి పంపుతాను!"

సుధీర్‌ని ఆవిడ ఇక మాట్లాడనివ్వలేదు. లోపలికి వెళ్ళిపోయి తలుపులు వేసుకుంది.

"ఊ! చాలా ఘనకార్యం చేసావుగా. ఇక వెళ్లు! ఒరేయ్ పెళ్ళి అనగానే అయిపోలేదురా! అది నిలబడగలగాలిగా! అప్పుడు ఆ పెళ్ళి అయినట్టు ఛీ.ఛీ. ఎవరినోట విన్నా యిదే మాట! నలుగురులోకి వెళ్ళలేకపోతున్నాను! తలెత్తుకోలేక



పోతున్నాం! అలాటి తల్లి కడుపున బుట్టి యిలాటి అరాచకపు పని యెలా చేసావురా! నీకు సిగ్గు లేదుట్రా!—"

సుధీర్ మౌనంగా వచ్చేసాడు. మేనమామ అపుడు వచ్చి వెంటనే తీసుకు వెళ్ళినా, మర్నాడు సాయంత్రం తను వెళితే, తల్లి తనవెంట వస్తుందని అతను ఆశించాడు. తల్లి చెప్పిన నిర్ణయాలు విని అతను నిర్విణ్ణుడయ్యాడు. అతను ఖంగారు పడ్డాడు. తల్లికి అసంతృప్తి కలుగుతుందని అనుకున్నాడేగాని, యింత గాయపరుస్తున్నానని అతను వూహించలేకపోయాడు. అతను యింటికి వచ్చాడు. అతని మనసంతా యేమిటో పోగొట్టుకున్నట్లుగా వుంది. మాటిమాటికీ తల్లి మాటలే గుర్తుకు వస్తున్నాయి "నీ పెళ్ళి అనేది కేవలం నీ ఆనందం అని అనుకున్నావేగానీ, ఆ వేడుకకోసం నేను యెంత యెదురు చూస్తున్నానో గ్రహించలేదు. ఆ అమ్మాయిని అలా తీసుకు రావటం నన్ను వెళ్ళిపోమని చెప్పటమేగా!"

"మైగాడ్!" అతడు నిర్విణ్ణుడవుతున్నాడు.

తల్లి యిక యీ యింటికి రాదు అనే మాట అతనికి బాగా అర్థం అయిపోయింది. తల్లిని బాధపెట్టాడు. చెప్పలేనంతగా గాయపరిచాడు. ఆవిడని సేదదీర్చటం యెలా! 'అమ్మా! స్వప్న అంటే నాకిష్టం వున్నమాట నిజమే! కానీ నీమీద వున్న గౌరవానికి, స్వప్నమీద వున్న యిష్టానికి సంబంధం లేదు. ఇవి కుడిచెయ్యి, ఎడమచెయ్యి అన్నంత వేరయిన విషయాలు! స్వప్నని నేను పెళ్ళిచేసుకోవటంలో, నేను నిన్ను కాస్త కూడా కించపరచలేదనే అనుకుంటున్నాను!' అతను ఆవేదనగా అనుకున్నాడు.

"నోర్ముయ్! స్వప్నని పెళ్ళి చేసుకోవటంలో ఆవిడని యెందుకు బాధపెట్టలేదు! ఆవిడకి చెప్పకుండా పెళ్ళి చేసుకోవటం నేరం కాదంటావా?" అంతరాత్మ అతన్ని నిలదీస్తుంటే, అతను జవాబు చెప్పలేకపోయాడు.


అతను యింటికి వచ్చి బట్టలు మార్చుకోవటానికి కూడా సత్తువలేని వాడిలా మంచంమీద పడుకుండిపోయాడు. స్వప్న రెండు మూడు సార్లు ఆ గదిలోకి వచ్చింది. అతను బాధగా పడుకున్న ఆ తీరు చూసి, మనసు రెపరెపలాడింది. ఎప్పుడూ హుషారుగా వుండే అతనికి ఏమయింది. ఎందుకు బాధగా వున్నాడు. స్వప్నకి అతనికి దగ్గరగా వెళ్ళాలనిపించింది! అతన్ని యెత్తి గుండెలకి అదుముకుని, 'ఏమిటి నీ బాధ నాకు చెప్పవూ? నేను యెవరిని నీ అర్ధాంగిని కాదా! అర్ధాంగి అంటే అర్ధ శరీరం అంటారే! మనసులో అర్ధభాగం అయినా, అర్ధం అవాలి కదా! లేకపోతే యెలా చెప్పు?' అని అడగాలని అనిపించింది.

అతని మంచం దగ్గరగా వచ్చింది. అతను అడుగుల చప్పుడు విని కూడా తలెత్తలేదు. స్వప్న అక్కడ టేబిల్‌మీద వున్న పుస్తకాలు సర్ది శబ్దం చేసింది. అప్పటికీ అతను తల యెత్తనేలేదు. అంటే! తన వునికి అతనికి అవసరం లేదన్న మాటేగా. అసలే అతను బాధపడుతున్నాడు. తనకి చెప్పగలిగేది అయితే, వెంటనే స్వప్నా అని పిలిచి చెప్పి వుండేవాడుగా! చెప్పటానికి వీలులేనిది కాబోలు! స్వప్న అడుగులు శబ్దంగాకుండా, దూరంగా వెళ్ళి నిలబడింది. కిటికీ పరదా పట్టుకుని తోటలోకి చూడసాగింది. అక్కడవున్న పిల్లలు ఆడుతున్నారు, కేరింతలు కొడుతున్నారు. వాళ్ళ ముఖాలు యెంత ఆనందంగా వున్నాయి! మనుష్యులు పెద్దవాళ్ళయితేమాత్రం యేం? అలా నిష్కల్మషంగా వుండచ్చుగా. ఊహూ! కాదు మనుష్యులు పెద్దవటం నేర్చుకోగానే, మనసులని చీకటి గుయ్యారాలు చేసుకుంటారు! అక్కడ ఒంటరితనంతో విలవిలలాడ్తారు. ఒంటరితనం అనేదే, మనిషి తనకు తాను తెలియకుండానే వేసుకునే ఘోరాతిఘోరమైన శిక్ష!

స్వప్న అలా ఎంతసేపు నిలబడిందో!

అతను కొద్దిసేపటికి అటు యిటు కదిలాడు! లేచి కూర్చున్నాడు. మెడని అటు యిటు తిప్పి తలని విదిలించాడు. స్వప్న అతన్ని చూస్తోంది! సుధీర్ గదిలో చీకట్లు కమ్ముకుంటూండడంతో, కిటికీదగ్గర పరదాపట్టుకుని నిలబడిన స్వప్నని గమనించలేదు. అతను మంచంమీదనుంచి లేచాడు. వెళ్ళి ఫోన్ చేసాడు. వాళ్ళ మామయ్య యిల్లు కాబోలు. 'నేను సుధీర్ మాట్లాడుతున్నాను అమ్మని పిలు'' అన్నాడు. ఐదు నిముషాల తర్వాత ఫోన్లోనుంచి అవతల గొంతు విన్పిస్తునేవుంది. "ఆవిడ పడుకుంది. మాట్లాడేదేదీ లేదని చెప్పమంది."

అతను పెట్టేసాడు. ఒక్క నిముషం టేబిల్ దగ్గర అలాగే నిలబడిపోయాడు. తర్వాత కుర్చీలో కూర్చుని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చుకున్నాడు. తర్వాత 'మైగాడ్,



అంటూ టేబిల్‌మీద ఒక్క గుద్దు గుద్దాడు.

తర్వాత లేచాడు. లేచి 'స్వప్నా, స్వప్నా! యిల్లు దద్దరిల్లిపోయేలా అరిచి', నట్టుగా పిలిచాడు. అరుస్తూ గదిమధ్యగా వచ్చిన అతను హఠాత్తుగా ఆగిపోయాడు.

స్వప్న ఎక్కడా లేదు! అక్కడే వుంది. ఆ గదిలోనే కిటికీ పట్టుకుని బొమ్మలా నిలబడివుంది.

'నువ్వు-నువ్వు-యిక్కడే వున్నావా!' అతను తెల్లబోతూ, తడబడుతున్నట్టుగా అడిగాడు.

స్వప్న మౌనంగా చూస్తోంది! నలిగిన అతని ముఖం చెదిరిన జుట్టు చూస్తుంటే స్వప్న మనసులో విషాదం పేరుకో సాగింది! అతను బాధపడుతున్నాడు. ఆ బాధ ఎవరిమూలంగా కలిగింది? తన మూలంగా!

'అదేమిటి? యిక్కడే వున్నావా?'

స్వప్న మాట్లాడలేదు.

'అలా నిలబడ్డావేం!'

స్వప్న జవాబు చెప్పలేదు.

"మాట్లాడవేమిటి?" అతను కోపంగా, విసురుగా, స్వప్న దగ్గరకి వచ్చాడు. విసురుగా వచ్చిన అతను చకితుడైనట్లు ఆగాడు.

ఇప్పుడు మీరు అతని పళ్లను పిప్పిపళ్లు కాకుండా చెయ్యవచ్చును.



వాడండి సిగ్నల్ 2

పళ్లను గట్టిపరచి దంత క్షయాన్ని నివారించేందుకు దీనిలో అత్యంత ప్రభావంగల ఫ్లోరైడ్ ఫార్ములా ఉంది.

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

లింటాస్-SG2. 1A-1710TL

పంటినొప్పివల్ల కలిగేది కేవలం బాధ మాత్రమే కాదు. దంతక్షయానికి అది సంకేతం కూడా. అశ్రద్ధ చేస్తే దంతక్షయం మరింతగా జరిగి పిప్పి పళ్ళు అయిపోతాయి.



నోటిలో ఊరే ఆమ్లాలు పళ్లలోకి చొచ్చుకుపోయి దంతక్షయాన్ని కలిగించకుండా మామూలు టూత్ పేస్టులు ఆపలేవు.



సిగ్నల్ 2లో అత్యంత ప్రభావంగల ఫ్లోరైడ్ ఫార్ములా ఉంది. ఇది నోటిలోని ఆమ్లాలు పళ్లలోకి చొచ్చుకుపోయి దంతక్షయం కలిగించకుండా అరికడుతుంది.

పిప్పి పళ్ళను నిరోధించే టూత్ పేస్ట్

పరిస్థితి విషమించక ముందే మీ కుటుంబంలో వారంతా వాడండి!
సిగ్నల్ 2—దంతక్షయాన్ని నిరోధించడంలో నిరూపించబడిన టూత్ పేస్ట్. దీనిలోని ప్రత్యేకమైన ఫ్లోరైడ్ ఫార్ములా పళ్ళతో కలిసి వాటిని గట్టిపరుస్తుంది, పళ్ళకు హాని కలిగించే నోటి ఆమ్లాలను నిరోధించేందుకు మరింత శక్తినిస్తుంది—పిప్పి పళ్ళు కాకుండా కాపాడుతుంది. దంతక్షయాన్ని అరికట్టడంలో దీనికి మించిన టూత్ పేస్టు లేదు. మేం చెప్పిందే మీరు నమ్మక్కర్లేదు. మీ దంత వైద్యుని కూడా అడగండి.



ఫ్లోరైడ్‌తో సిగ్నల్ 2

కుటుంబంలో వారికి పిప్పి పళ్ళు రాకుండా నిరోధిస్తుంది.



లింటాస్_SG2. 1B-1710 TL

స్వప్న అతనివైపే చూస్తోంది. స్వప్న కళ్ళలో నీరు వూరుతోంది.

"ఏమిటి? ఏమయింది?" అన్నాడు ఖంగారుగా.

ఏం కాలేదు అన్నట్లుగా తల తిప్పింది.

"మరి ఎందుకలా వున్నావు."

"ఏం లేదు."

"అలా ఎప్పుడు, ఒంటరిగా, దిగులుగా నిలబడకు. ఎందుకు దిగులుపడ్తున్నావో చెప్పు."

"మిమ్మల్ని చూసి—"

"నన్ను చూసా?" అతను ఆశ్చర్యపోయాడు.

"అవును. నా మూలంగా, మీ రెంత పోగొట్టుకున్నారో, అర్థం అవుతుంటే, నిజంగా బాధవేస్తోంది."

"యేయ్. ఏం మాటలవి."

"వున్నమాటవేగా. అమ్మని తీసుకువస్తానని వెళ్ళారు. తీసుకు రాలేదు. ఫోన్ చేసినా ఆవిడ పలకటంలేదు—"

"మైగాడ్. యింతక్రితంనుంచీ, యిక్కడే వున్నావా ఏమిటి?" అతను భుజాలు పట్టుకున్నాడు "చూడు పిచ్చి పిచ్చి ఆలోచనల్తో, నీ బుర్ర పాడుచేసుకోకు స్వప్నా. నాకు ఆనందం కావాలి. ఎంతో తెలుసా. చెప్పుకోనంత. నువ్వు ఇచ్చే ఆ ఆనందంలో నేను పూచిక పుల్లలా కొట్టుకుపోవాలి. సరేనా." స్వప్నని దగ్గరకు తీసుకోబోయిన అతను, హఠాత్తుగా స్వప్న గుండెల్లో తల తలదాచుకున్నాడు. "స్వప్నా మనిషికి యింత బాధ కలుగుతుందని నాకు తెలియదు. ఈ రోజు అమ్మ చూపిన తిరస్కారంతో నాకు జీవితం గిరగిరా తిరుగుతున్నట్లే వుంది. అమ్మ నన్ను అర్థం చేసుకోలేదు." అన్నాడు.

స్వప్న నిశ్శబ్దంగా అతన్ని పట్టుకుని నిలబడింది. అతనికి బాధ కలిగింది. దానికి తనే కారణం. స్వప్న యీ ఆలోచన భరించలేకపోతోంది.

22

హరినారాయణగారి సంవత్సరీకం రానే వచ్చింది. సుధీర్‌కి భయం, తీరా అన్ని ఏర్పాట్లు చేసిన తర్వాత ఎవ్వరూ రారేమోనని. కానీ అది కేవలం, అపోహేనని అతనికి త్వరలోనే తెలిసింది. పిల్చిన అందరూ వచ్చారు. అందులో చాలామందికి స్వప్నని అతను తల్లికి చెప్పకుండా చేసుకున్నాడనే తెలుసుగాని, స్వప్న ఎవరో ఏమిటో తెలియదు. తెలిసినవాళ్ళు కొంతమంది, 'ఆ. మనకెందుకు లెద్దూ. అతను

మన లాయరు. అతని సామర్థ్యంతో మనకి చాలా అవసరంవుంది. ఆ అమ్మాయి కోసం అతన్ని వదులుకోవటం తెలివి తక్కువ.' అని స్వార్థంతో సరిపెట్టుకున్నారు.

ఆ రోజు యింట్లో పూజలు జరుగుతాయి. అన్నదానం జరుగుతుంది. బంధుమిత్రులకి విందుభోజనాలు ఏర్పాటు అవుతాయి. సుధీర్ దేనికీ లోపం చేయలేదు. అన్ని శ్రద్ధగా ఏర్పాట్లు చేసాడు. స్వప్న అన్నింటిలో అతనికి తోడ్పడుతోంది.

రాత్రి అయింది.

వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు. వచ్చినవాళ్ళలో తెలివిగలవాళ్ళు అహల్యమ్మగారి గురించి అడగలేదు. తెలివితక్కువవాళ్ళు, "మీ అమ్మగారు కన్పించటం లేదే. వారెక్కడ?" అని అడిగాడు.

"అమ్మకి ఒంట్లో బాగాలేదా. మామయ్య దగ్గరవుంది." అని చెప్పాడు.

"వారూ వచ్చినట్టులేదే."

"పనుందిట" చప్పున అతను అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

స్వప్న యింటి ఏర్పాట్లన్నీ చూసింది. ఆ చూసే నెపంతో, ఎక్కువగా, నలుగురిలోకి రాలేదు. ఒకవిధంగా, తన గదిలోనే వుండిపోయిందని చెప్పాలి.

పూజా కార్యాక్రమం అయి, బ్రాహ్మణులు భోజనంచేసి వెళ్ళేవరకూ స్వప్న గుండెలు పీచుపీచుమంటున్నాయి। తన చేయి పడిందని,మైల తాకిందని,వాళ్ళు ఎక్కడ భోజనాలు చేయకుండా లేచి పోతారోనని భయపడింది। అహల్యమ్మగారు చాలా నిష్టా పరురాలు. ఆవిడ ఇంట్లో పూజలు చేసినంత శ్రద్ధగా, యింకెక్కడా మేముకూడా చేయమని, బ్రాహ్మణులు అంటారు। ఏర్పాట్లు ఎంతో బ్రహ్మాండంగా వున్నా ఆవిడ లేని లోటు లోటుగానే వుందని వచ్చిన వాళ్ళంతా అసంతృప్తిపడ్డారు. వచ్చిన బంధువుల్లో కొంతమంది సుధీర్‌చేత పిలిపించుకుని మరీ స్వప్న ని తమకి పరిచయం చేసుకున్నారు। 'మీరు, మేమూ బంధువులం అవుతాం। మీ అత్తగారు ఎంతసేపు, గుళ్లు, గోపురాలు। యింకోళ్ళ యింటికేరాదు। కాస్త నువ్వయినా వస్తుండు' అన్నారు.

స్వప్న వాళ్ళందరితో ఎంతో అణకువగా మాట్లాడింది। ఆ అమ్మాయిని చూస్తూ 'తల్లికి ఎందుకు యిష్టంలేదు। చిదిపిదీపం పెట్టుకోవచ్చున్నట్టుంది' అంటూ ప్రశంసించారు. "సుధీర్ తల్లికి ఎదురు తిరగటమా? ఇది ప్రపంచంలో ఎనిమిదో వింత। ఆ పెళ్ళి జరిగిందంటే, అతని గొప్ప అయావుండదు। ఆ అమ్మాయి తెలివితేటలు అయి వుంటాయి" అన్నారు కొంతమంది.

వచ్చిన వాళ్ళు తననిచూసి గుసగుసలాడటం కన్పిస్తూనే వుంది కానీ, స్వప్న అది గమనించనట్లే, ప్రవర్తించింది।

ఎలాగయితేనేం, ఆ దినం, ఎలాటి ఆటంకాలు, గొడవలూ లేకుండా జరిగిపోయింది।

వచ్చిన వాళ్ళందరూ వెళ్ళిపోయారు। నౌకర్లు యిల్లు శుభ్రం చేశాసారు। వంట వాళ్ళు సామాను అప్పచెప్పి వెళ్ళిపోయారు।


యింట్లో ప్రొద్దుటినుండి, ఒకటే కబుర్లు, సందడి, కోలాహలంగా వున్నా, సుధీర్ వాళ్ళతో బలవంతగా పైకి ఆనందంతో, మాట్లాడుతున్నా, లోలోపల అతని మనసంతా, దిగులుగా లోటుగానే వుంది। తల్లి రాలేదు। తల్లికి వుత్తరం వ్రాసి పంపాడు. ఈ ఒక్క రోజయినా రమ్మనమని। ఆవిడ రాలేదు।

ఆవిడ యీ రోజు రాకుండా వుండలేదని, అతని గాఢ నమ్మకం। కానీ అది కూడా వమ్మయిపోయింది।

స్వప్న అతని దగ్గరకి వచ్చింది. తలమీద చేయివేస్తూ అంది. 'కొద్దిగా అన్నం తిందువుగాని రా।'

"వద్దు। నాకు ఆకలిలేదు।"

"ఉదయం నుంచీ నువ్వు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు" అతను మాట్లాడలేదు.



స్వప్నకి కూడా చాలా దిగులుగా వుంది. అతను తనని పెళ్ళిచేసుకున్నాడు. ఆశ్రయం కల్పించాడు। కోటగోడలాటి రక్షణ ప్రసాదించాడు. అతనికి తన మూలంగా లభించేదేమిటి। తల్లి ప్రేమ దూరమైంది. నలుగురిలో అవమానం ఎదురవుతోంది। స్వప్నకి ఎందుకో కోపం వచ్చింది।అహల్యమ్మగారిమీద,అతన్ని హేళనచేసే మిత్రులమీద కించపరుస్తున్న బంధువులమీద, అందరిమీద చెప్పుకోనంత కోపం వచ్చింది. నేనేం తప్పుచేసాను అని అరవాలనిపిస్తోంది. యిక జీవితాంతం యింతేనేమో। యిద్దరి మధ్యా యీ అఘాతం పూడనే పూడదేమో। మోహన్। చచ్చి దయ్యమై యీ విధంగా క్షణం క్షణం తనని పీక్కుతింటున్నాడు. అతని కోరలనుండి ఆనాడు, ఆ బలమైన దానితో బాది, తప్పించుకున్నానని అనుకుంది। ఎంత చిత్రం। తను అతని కోరల నుండి విడిపించుకుందా లేదా? లేదు। జీవితాంతంతం అతనిలా వేధించేట్టే వున్నాడు. తనకి యిక విముక్తి లేదేమో।

స్వప్నకి ఏడుపు వచ్చేసింది। కానీ లోలోపల బిగపట్టుకుని ఆపుకుంది। ఏడుపు అనేది వస్తే తను ఒంటరిగా ఏడవాలి। అది సుధీర్‌కి తెలియకూడదు। సుధీర్ ముందు తను యిప్పుడు కళ్ళనీళ్ళు పెట్టుకోకూడదు. అధైర్యపడినట్టు కనిపించకూడదు.

లేకపోతే, అతనికి యిది యింకో రకమైన శిక్ష అవుతుంది।

(సశేషం)

వసంతం వాడిపోయింది!

దేవులపల్లి కృష్ణశాస్త్రికి శ్రీశ్రీ నివాళి

అద్దం బద్దలైంది, రోదసి రోదించింది, షెల్లీ మళ్ళీ మరణించాడు, వసంతం వాడిపోయింది!

కృష్ణశాస్త్రిగారు చనిపోయిన రోజున జిన్నూరులో ఉన్నాను. అచ్చటి నిరీశ్వరాశ్రమం వార్షిక సభలో పాల్గొనడానికి శాస్త్రిగారు చనిపోయిన సమయంలో రైలుబండిలో ఉన్నాను. ఇంకా ఆశ్రమంలో యిలా కాలు పెట్టానో లేదో నన్ను చూడడానికి వచ్చిన ఒక కుర్రాడు "ఉదయం ప్రాంతీయ వార్తలు విన్నారా?" అని అడిగేడు.

ఏదో విపరీతం జరిగి ఉంటుందని అనుమానిస్తూనే, "ఏం సంగతి?" అన్నాను. "కృష్ణశాస్త్రీగారు హైదరాబాదులో చనిపోయా" రన్నాడు. కృష్ణశాస్త్రిగారేమిటి, హైద్రాబాదులో మరణించడ మేమిటి? "ఆయన ఉంటున్నది మద్రాసులోనే కదా?" అన్నాను. "ఆ? అదే. అదే. హైద్రాబాదు వార్తల్లో విన్నాను" అన్నాడతను తొట్రుపాటుతో. అయిదు నిముషాల దాకా నేనేమీ మాట్లాడలేదు "వెళ్ళొస్తా"నని ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు. నేనేదో చెబుతానను కున్నాడు. కాని నేను మౌనంగా ఉండిపోయేసరికి నిరుత్సాహంగా వెళ్ళిపోయాడు.



దేవులపల్లి కృష్ణశాస్త్రి

ఈ మధ్యనే మాట్లాడుతూ శాస్త్రిగారు తాను నూరేళ్ళు బతకబోతున్నా నన్నారు (మాట్లాడడ మంటే ఆయన రాసింది మరొకరు చదవడ మన్న మాట. ఆయన చివరి సంవత్సరాలన్నీ మూగతనంతోనే గడచిపోయాయి). ఇరవయ్యో శతాబ్దానికి అంపకం పెట్టిన తర్వాతనే ఆయన మరణిస్తాడని నేనూ గట్టిగా నమ్మేను. కాని నా నమ్మకం వమ్మయిపోయింది.

నా చిన్నతనంలో కృష్ణశాస్త్రిగారు కవిగా నన్ను ఆకర్షించారు, తర్వాత, తర్వాత వ్యక్తిగా ఆకట్టుకొన్నారు. నేను పద్యాలు రాస్తూ వచ్చిన తొలి సంవత్సరాలలో నామీద ఇద్దరి ప్రభావం తీవ్రంగా పని చేసేది. ఇద్దరిలో ఒకరు కృష్ణశాస్త్రి. ఇంకొకరు విశ్వనాథ. ఈ ప్రభావాల నుండి బయటపడడానికి పదేళ్ళు పట్టినట్టు ఒక చోట రాశాను. ఎంతగా సొంత గొంతుకను నేను వెదుక్కోవడానికి ప్రయత్నించినా ఈ యిద్దరిలో యెవరిదో ఒకరి ముద్ర నుంచి తప్పించుకోవడానికి వీలుపడేది కాదు. గ్రాంధిక భాషలో గణబద్ధ ఛందస్సులలో పద్యాలు రాసే ప్రతీ యువ కవీ వీరి ప్రభావానికి లోబడ్డవాడే. వ్యావహారికంలో, మాత్రా ఛందస్సులలో రచన సాగించడంతో నాదీ అంటూ ఇక సొంత గొంతుకను స్పష్టంగా వినిపించగలిగాను. అప్పుడే భావ కవిత్వ ధోరణిని కూడా వదలిపెట్టివేశాను.

భావకవిత్వానికి రాయప్రోలువారిని ఆద్యులుగా అంగీకరిస్తూనే ఆ కవితా భవనస్య మూల స్తంభాలలో ముఖ్యునిగా కృష్ణశాస్త్రి గారిని పేర్కొనక తప్పదు. ఈ ప్రపంచాన్ని మరచిపోవాలనుకునేవాళ్ళంతా కృష్ణశాస్త్రి కవితలను చదివితీరవలసిందే! "నా నివాసమ్ము తొలుత గంధర్వలోక మధుర సుషమా సుధాగాన మంజువాటి" అని ఎప్పుడో ఆయన తన చిరునామాను మన కందజేశారు.

ఊర్వశిని ఆయన సృష్టించలేదు. కాని ఆయనంతగా ఆ దేవతను పురూరవుడు కూడా ప్రేమించి ఉండడనుకుంటాను.

సినిమా పాటలకు సాహిత్య గౌరవం సాధించిన కొద్దిమంది కవులలో కృష్ణశాస్త్రిగారొకరు. శబ్ద మాధుర్యం అంటే యేమిటో ఆయన కవితలు చదివితేనే తెలుస్తుంది. ఆయన మంచి గాయకుడు కూడా అన్న సంగతి ఈ తరాలవారిలో చాలామందికి తెలియదనుకుంటాను. తనకీ, ఇతర కవులకీ రచనల్ని శాస్త్రిగారు చదువుతుండగా విన్న భాగ్యవంతులలో నేనూ ఒకణ్ణి. ఒక గ్రామఫోను రికార్డుగానైనా ఆయన కంఠశ్వరాన్ని దాచుకోలేక పోవడం నిజంగానే మన దురదృష్టం.

మద్రాసు
28-2-80

శ్రీశ్రీ

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి సంస్మరణ సభ

శ్రీ ఈడ్పుగంటి లక్ష్మణరావుగారు సినీపరిశ్రమలో తమకున్న చిరకాల పరిచయాన్ని పురస్కరించుకుని శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి సంస్మరణ సభ విజయవాడ విజయా టాకీసులో 28-2-80 ఉదయం ఏర్పాటు చేశారు.

ప్రముఖ సినీజర్నలిస్టు, విమర్శకులు శ్రీ ఇంటూరి వెంకటేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు. వారు శ్రీ కృష్ణశాస్త్రి తెలుగు సాహిత్య రంగానికి, సినీ పరిశ్రమకు రచయితగా, సాహిత్యవేత్తగా, సాంఘిక సంస్కర్తగా చేసిన సేవను కొనియాడారు.

ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు, పాత్రికేయులు, పలువురు పురప్రముఖులు పాల్గొన్న ఈ సభలో శ్రీ కృష్ణశాస్త్రి మరణంపట్ల సభవారు మౌనాన్ని పాటించి తమ సానుభూతిని వ్యక్తంచేస్తూ ఈ క్రింది తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

తీర్మానం: భావ కవితోద్యమానికి ప్రాణప్రతిష్ఠ సలిపి, తెలుగు సాహిత్య ప్రపంచంలో నవయుగ వైతాళికుడుగా విస్తుతికెక్కినవారు, తెలుగు సినిమా గేయ రచనలో అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన మధుర కవితకు మార్గదర్శకులు అయిన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి మరణంపట్ల తమ గాఢ సంతాపాన్ని వెలిబుచ్చుతూ, వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చవలసిందిగా సర్వాంతర్యామిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ హృదయపూర్వక సానుభూతిని అందజేస్తూ, ఆ మహనీయుని స్మారకార్థంగా "దేవులపల్లి కృష్ణశాస్త్రి స్మారక బహుమానం" పేరుతో ఒక బహుమతిని ప్రవేశపెట్టి, దీనిని ఏటేటా ఒక ఉత్తమ తెలుగు సినిమా గేయరచయితకు నంది బహుమతుల ప్రధానోత్సవ సందర్భంలో యివ్వవలసిందిగా ఈ మహాసభవారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని వినయపూర్వకంగా అర్థిస్తున్నారు.

శ్రీ లక్ష్మణరావుగారు వందన సమర్పణ చేశారు.

ఉచితం !!   FREE !!!

ఉన్నత మార్గం

అడవి బాతులు కొన్ని ఆకాశమార్గాన ఉత్తర ప్రాంతాలకు ఎగిరిపోతున్నాయి. అవి అలా ప్రయాణం చేస్తుంటే క్రిందనున్న కొన్ని ఊరబాతులు వాటి దృష్టి నాకర్షించాయి. అందులో ఒక అడవిబాతు తన గుంపును వదలి క్రిందకు దిగి ఊర బాతులతో కలసి కొంతసేపు గడిపి, ఎగిరిపోయింది. మరుసటిరోజుకూడ వచ్చి ఇంకా ఎక్కువ కాలం వాటితో గడిపి ఆహారం కూడా ఆరగించింది. కాపుయొక్క పెరటిలో ఏ భయం లేకుండా సంచరించవచ్చుననే కోరికతో ఆ ఆడివిబాతు వేసవి అంతా ఊరబాతులతోనే గడిపింది. వేసవి గడచి, ఆకు రాలే కాలంలో దక్షిణ ప్రదేశాలకు తరలి వెళ్ళే తన స్నేహితుల పిలుపు విని వాటితోపాటు పైకెగరాలని ప్రయత్నించినపుడు ఆ పని దానికి కష్టంగా తోచింది. ఇంతకాలం చీకూ, చింతా లేకుండా కడుపునిండా మేత తిన్నందువల్ల దాని శరీరం బరువెక్కి అది ఎగిరే శక్తిని కోల్పోయింది.

చలికాలం గడిచి తిరిగి వసంతం ప్రారంభమవగానే తిరిగి తన పాత స్నేహితులను చూచింది. రెక్కలు విదిల్చి, కళ్ళు చిట్లించింది గాని ఏమాత్రం పైకెగిరే ప్రయత్నం చేయక ఊరుకుంది. ఇంకా కొద్దికాలం గడిచాక తల పైకెత్తి తన స్నేహితులకు చూచేది గాని, పైకెగరటానికి ఆసక్తి చూపేది కాదు.

ఉన్నతమైన ఆశయాలతో ఉన్నత శిఖరాగ్రములో దేవునితో సహవసించే దేవుని బిడ్డా! నీ తిన్నని మార్గమును విడిచి, నీ ఉన్నత ఆశయాలను వదలి, సర్వోన్నతుడైన దేవుని సన్నిధి నుండి దూరంగా తొలగిపోయి ఆ దివ్యప్రయాణీకులకు దూరంగా క్రింద అగాధపు లోయల్లో కొంతసేపు గడిపి, ఆనందించి, తిరిగి ఉన్నత శిఖరాల నందుకొంటా ననుకోవటం ఎంత వెర్రితనం! ఉన్నతమైన వాటి నుంచి నీ దృష్టిని మరల్చి క్రింద చూపులు చూచినప్పుడు నీ పతనం తప్పదు.

చదలవాడ చంద్రమతీదేవి

ఉచితం !!	ఉచితం !!!
దైవస్వరూపుడైన ఏసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన కమనీయ బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా పొందదలచుకుంటే మీ చిరునామా ఈ రోజే మాకు తెల్పండి. పోస్టు ఖర్చులు మేమే భరించి ఉచితంగా వెంటనే మీకు పుస్తకం పంపుతాము.	ఇదీ అడ్రస్: డా॥ ఎస్. జాన్ డేవిడ్, ఫార్ కార్నర్స్ పోస్టుబాక్సు 315, విజయవాడ-2. FAR CORNERS

Gospel Message Inserted by Far Corners

1980 లో మన రాష్ట్రం

స్వతంత్రదేశం సహస్ర నేత్రాలతో యెదురుచూసిన అపూర్వ రిపబ్లిక్ దినోత్సవం ఇది. మన ప్రియతమ ప్రధానమంత్రి సమర్ధవంతమైన నాయకత్వంలో వినూత్న శక్తితో పేదరికం నిర్మూలనకు సుస్థిరత్వ సాధనకు, స్వయంసమృద్ధికి శరవేగపు కృషి జరుగుతుందనడంలో సందేహంలేదు. ప్రధానమంత్రి శ్రీమతి గాంధీ పార్లమెంటులో మన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం మనకు గర్వకారణం.

అన్ని రంగాలలో ఆంధ్రప్రదేశ్ సాధించిన అద్భుత ప్రగతిని ఈ చరిత్రాత్మక సమయాన యెంతో ఆనందంతో మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

గణనీయ స్థాయిలో వ్యవసాయక వుత్పత్తిని హెచ్చించడానికి ప్రకృతి సంపదను మన రాష్ట్రం అద్వితీయంగా వినియోగించింది. అన్ని రంగాలలో సమగ్రమైన అభివృద్ధి జరగాలన్న లక్ష్యంతో అసాధారణ రీతిలో మనం పారిశ్రామిక, సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు జరిపాం.

ఈ రోజు మనం బ్రహ్మాండమైన అభ్యుదయ ప్రణాళికను అమలు జరుపుతున్నాం. ఈ ప్రణాళిక బృహత్తర స్వరూపానికి బడ్జెటు పెట్టుబడులు మాత్రమే కొలమానం కావు; ఇతర రంగాల వనరులను ఉపయోగించుకోగలిగిన మన శక్తి కూడా ఇందుకు నిదర్శనం. కనీ వినీ ఎరుగని పద్ధతిలో పారిశ్రామిక ప్రగతి కార్యక్రమం పురోగమిస్తున్నది. దేశంలోని అన్ని ప్రాంతాల పెట్టుబడిదారులు మన రాష్ట్ర పారిశ్రామిక రంగంలో ప్రవేశించడానికి వుత్సాహపడుతున్నారు. శీఘ్రగతిని కొనసాగుతున్న పారిశ్రామిక ప్రగతి ఉద్యోగ అవకాశాల విస్తరణ, సాంకేతిక నైపుణ్యపు అభివృద్ధి మనం అందిస్తున్న సేవలకు, సౌకర్యాలకు సంకేతాలు. ఎన్నో సంవత్సరాల కృషి ఫలితంగా చేకూరిన నీటి పారుదల సౌకర్యాలు ఈ రోజు అత్యధికంగా ఉపయోగంలోకి వస్తున్నాయి. భారీ పెట్టుబడులతో సేద్యపు అభివృద్ధి జరుగుతున్నది. వ్యవసాయ కార్యక్రమాలు విస్తరిస్తున్నాయి.

భూముల పంపిణీ అత్యధికంగా జరిగింది. సన్నకారు రైతులు, చిన్న రైతులు తమకు లభించిన భూములలో ఫలప్రదమైన వ్యవసాయం చేసుకోడానికి అవసరమైన ఋణాలను సంపాదించుకోగలిగిన శక్తి కూడా వారికి ఇతోధికంగా కల్పించబడింది. కోళ్ళ పెంపకం, పాడిపరిశ్రమ అపూర్వంగా విస్తరించిన కారణంవల్ల అనుమానంలేని తగినంత ఆదాయానికి అవకాశం కల్పిస్తున్న స్వయం ఉపాధి సౌకర్యాలు పెరిగాయి. పోషకాహార పదార్థాలు తగినన్ని లభించడానికి కూడ యిప్పుడు అవకాశం యేర్పడింది.

1700 మెగవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయగల ఉత్పాదకశక్తిని కల్పించడంద్వారా, ప్రతీ గ్రామాన్నీ విద్యుత్ తోరణంగా మార్చే బృహత్ పథకాన్ని చేపట్టడం ద్వారా మనం విద్యుచ్ఛక్తి పథకాల అమలును శరవేగంతో ముందుకు తీసుకుపోతున్నాం.

గ్రామాలకు యాంత్రిక రవాణా సౌకర్యాలు కల్పించే మన కృషి ఫలితాలు ప్రసాదించడం ప్రారంభమయింది. రోడ్డుమార్గాల అభివృద్ధి, వాహనాలతో గ్రామాలకు రవాణా సౌకర్యం పల్లె ప్రాంతాలలో నూతన శక ప్రారంభానికి దోహదం చేయడమే కాకుండా ప్రయోజనకరమైన ఉపాధి సౌకర్యాలకు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రప్రథమంగా, ప్రాతిపదిక స్థాయిలోనే పాఠశాల విద్యను ఆధునికం కావించే కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తున్నాం. అభ్యుదయ ప్రాథమిక విద్యా సంస్థ కార్యక్రమం ప్రయోగ దశ దాటి ఒక విజయంగా రూపు దాల్చింది.

సామాజిక సంక్షేమం సంతరించుకున్న ప్రాముఖ్యం ఫలితంగా కుటుంబ అవసరాలకు అనుగుణంగా బలహీనవర్గాల అభ్యున్నతి కార్యక్రమం కొత్త రూపు ధరించింది. పేద కుటుంబాల విద్యార్థులకు ఆకర్షణీయమైన స్కాలర్‌షిప్పులు లభిస్తున్నాయి. ఈ విద్యార్థులు త్వరగా ఉద్యోగార్హత పొందటానికి వీలుగా వారి అవసరాలను ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతున్నది. 'ప్రతి కుటుంబానికి ఒక నివాస గృహం' అన్న లక్ష్యంతో ఇళ్ళ స్థలాల కేటాయింపుకు గృహ నిర్మాణ పథకాలకు పెద్దయెత్తున నిధులు సమకూర్చడం జరుగుతున్నది. గడచిన ఒక్క సంవత్సరంలోనే 2,50,000 గృహాలు నిర్మించబడ్డాయి. నిర్ణీత వ్యవధిలో చేపట్టిన బృహత్తర గృహ నిర్మాణ పథకానికి ఇదొక నిదర్శనం.

ఆర్థిక సహాయం అందజేయడంలో, కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడే పథకాలను అమలుచేయడంలో బలహీనవర్గాల కోసం ఉద్దేశించిన మన కార్పొరేషన్లు ఆదర్శవంతంగా పని చేస్తున్నాయి. సర్వతోముఖ అభివృద్ధి సాధిస్తున్న అనేక కార్యక్రమాలలో ఇవి కొన్నిమాత్రమే.

ఆంధ్రప్రదేశ్ యిక యెంతమాత్రమూ శుష్కవాగ్దానాల రాష్ట్రం కాదు

ఆంధ్రప్రదేశ్ యిప్పుడు దిగ్విజయాలు సాధించిన రాష్ట్రం!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

డైరెక్టర్, సమాచార పౌరసంబంధ శాఖ

Issued by D.I.P.R.

మి నీ క ధ

మరో పెళ్ళి కథ

కె. వి. ఎల్. నరసింహశాస్త్రి

ఎత్తయిన అరుగుమీదు చుట్టూతా ఉన్న టేబుల్ వెనక కూర్చుని వున్నాడాయన.

పైన పంకా తిరుగుతున్నా మొఖమంతా చెమట! పొలాలూ, స్థలాలూ, వాటి క్రయ విక్రయాలూ, ఆయన సమ్మతి ముద్రతోనే ఖరారు అపుతాయి. అంతేకాదు, పెద్దవాళ్ళ నెదిరించినవాళ్ళు, ఆర్భాటాలూ యిష్టంలేనివాళ్ళు అక్కడే ఒకటౌతారు. ఈయన వాళ్ళ పెళ్ళికి సమ్మతి ముద్ర వేస్తాడు.

ఇప్పుడు ఆయన ఎదురుగా ఓ అమ్మాయి, ఓ అబ్బాయి నిలబడి వున్నారు. వాళ్ళ వెనగ్గా ఓ అరడజనుమంది యువతీ యువకులున్నారు. వాళ్ళ చేతుల్లో దండలున్నాయి.

ఆ అమ్మాయి ముఖంలో ఏదో ఆందోళన! కళ్ళల్లో ఏదో పట్టుదల!

అవును మరి, తను ప్రేమించిన ఆ అబ్బాయిని పెళ్ళి చేసుకుంటానంటే తండ్రి ఏమన్నాడు? వీల్లేదన్నాడు. వర్ణసంకరం కావటం ఒప్పుకోనన్నాడు. కంఠంలో ప్రాణం ఉండగా జరగదన్నాడు. ఎవర్నో తెస్తానన్నాడు. ఎంతో ఆస్తి అన్నాడు. తనకి ఐశ్వర్యమా కావాల్సింది? కాదు. మనసు నర్పించిన వాడితో పెళ్ళి!....

అసలు తన తండ్రి యెన్నో వర్ణాంతర వివాహాలకు పెద్దగా వ్యవహరించాడు. వాళ్ళు ఏర్పాటు చేసిన విందుల్లో పాల్గొని ఉపన్యాసాలు దంచాడు. ఇలాంటివెన్నో జరిగితే గాని జాతి జాగృతం కాదన్నాడు.

మరి తన కూతురు?

ఉహూఁ.

అందుకే తెగించింది. ఇరవై రెండేళ్ళ తను, కోరినవాడిని పెళ్ళి చేసుకోవటానికి ఏ న్యాయ స్థానమూ అడ్డు చెప్పదు. ఏ రిజిస్ట్రారుకీ రూల్సు అడ్డం రావు.

పైన సర్కారువారి ముద్రగల కాగితాల మీద రొటీన్‌గా యేదో రాసేసి, గుమాస్తా ఆయనముందు పెట్టాడు. అదేదో ముఖ్యమైన ప్రభుత్వ తాఖీదులా అక్షరం పొల్లుపోకుండా చదివాడు. మళ్ళీ చదివాడు. మళ్ళీ....

తలెత్తాడాయన.

"ఉభయులకీ యిష్టమేనా....?" అని అడిగాడు.

వాళ్ళు తల ఊపారు.

సంతకాలు యెక్కడ పెట్టాలో గుమాస్తా చూపాడు.

ఎంతో ఆనందంగా సంతకాలు పెట్టారు వాళ్ళు. వెనకాల ఉన్న యువతీ యువకులు సాక్షి సంతకాలు పెట్టారు. ఒకరికొకరు దండలు వేసుకున్నారు.


ఎంతో ప్రేమగా తన ప్రియుడివైపు చూసింది ఆ అమ్మాయి. ఆ చూపులో వారికే తప్ప యెవరికీ అర్థంగాని యెన్నెన్నో మధుర భావాలు! తను గెలిచింది!!

ఏనాడో మనస్సుల్లో ఒక్కటైపోయినవాళ్ళు, ఈనాడు ప్రభుత్వ సహాయంతో, లోకం దృష్టిలో ఒక్కటైపోయారు.

ఆయనకు కృతజ్ఞతలు చెప్పి, ఫ్యాన్‌కి మామూలు ఇచ్చి వాళ్ళంతా వెళ్ళిపోయారు.

ఆయన యెన్నో జంటల్ని కలిపాడు. వాళ్ళల్లో కనిపించే పట్టుదల, ప్రేమ, అనురాగం....అన్నీ చూశాడు.

రుమాలతో చెమట తుడుచుకుంటూ కళ్ళొత్తుకున్నాడు—అవును మరి, కాళ్ళు కడగటాలు, కాశీకి వెళ్ళొద్దనటాలు, విందులు, కట్నాలు....ఇవేవీ లేకుండా కూతురు పెళ్ళి చేశాడాయె!! □



ఇల్లు

దాసరి సుబ్బారావు


వెంకట్రామయ్యగారు-గొప్పవారని అందరూ అంటారు ఆస్థి విషయికంగా. అందుకే ఆయన యింట్లో అడుగు పెట్టేటపుడు కొంచెం యిబ్బందిగా అనిపిస్తుంది. కాని వాళ్ళ వూరు వెళ్ళినపుడు ఆయనను కలుసుకోలేదంటే ఆయనకు నేను నిర్లక్ష్యం చేశానన్న అభిప్రాయం కలగొచ్చు. ఒకసారి కనిపిస్తే యీ గొడవలన్నీ వుండవుగదాని కలుసుకొంటూనే వుంటాను. వెళ్ళిన దగ్గర్నుంచీ ఏదో ఒక విషయం—స్వంతాన్ని గురించి—మోకాలు కదలలేదనో, అలా కదలక పోవటాన్ని గురించిన ప్రత్యేకత గురించో మాట్లాడటం పట్ల తనకున్న అసహ్యాన్ని గురించో ఎదుటివాడిలోని ప్రత్యేకతల్ని గురించి పట్టించుకోని వాళ్ళను గురించో, అమెరికాలోని తన అబ్బాయి గురించో — మాట్లాడతారు, బహుశ నేను ఒప్పుకొనే లక్షణం ఉన్నవాడిననే ధీమా కొద్దీ కాబోలు. ఇబ్బంది అన్న నా మాటకు యీసరికి అర్థం మీకు బోధపడి వుండవచ్చు. అక్కడకు వెళితే నాకు జరిగే మర్యాదలు రకరకాలైన భావాలు కలిగిస్తాయి. ఎంతో త్యాగంచేస్తేగాని నా యింట్లో నేను ఇంకొకరికి అటువంటి మర్యాదలు జరపలేను. ఖరీదైన ఆ పింగాణీ పళ్ళాలేమీ, కప్పులేమీ, చెంచాలేమీ. అటువంటప్పుడే నాకు నేను బీద వాణ్నయినందుకు మనసులో బాధ కలుగు

తుంది. మర్యాదలు జరపలేను: సరే పోలిక అనేది మహా చెడు విషయమని నాకు తెలుసు. కాని మనిషి మనసుకు దాని ఆలోచనలు లేకుండా పోవు. రకరకాల సందార్భాల్లో అది ప్రవర్తించే తీరును గురించి ఎంతవరకు చెప్ప గలం? వెంకట్రామయ్యగారి మర్యాదలందు కునేపుడు మొహమాటంలో మునిగి వున్న ప్పటికీ నాలో వున్న ఆలోచనలు నిక్కచ్చిగా చెప్పేస్తే మీకు ఆశ్చర్యం కలగవచ్చు. ఆయన యీ మర్యాదలన్నీ చేయటం తన గొప్పతనాన్ని ప్రదర్శించుకోవటానికే నేమో: నా వంటి వాళ్ళు ఏదో వూహించుకొంటూ వాళ్ళకి మర్యాద యివ్వకపోతే అటువంటి వాళ్ళు (అంటే కేవలం డబ్బు వున్నవాళ్ళు) నిజానికి గొప్పవాళ్ళేం కాదు: ఏదో ఆయనకు వున్నది కనుక యిలా నిరాయాసంగా టీ, టిఫెన్లు లాటివి యిచ్చెయ్యగలరు. ఇటువంటి డాంబికాలు పోయే ప్రయత్నంచేసి నా లాటి వాళ్ళు కుంగిపోకూడదు. ఇంత అనుకున్నా మళ్ళీ ఆయనద్వారా పొందిన ఆ టీ టిఫెన్లలో ఆయన హృదయంకూడా కలిసివుందేమోనన్న ఆలోచన నాకే తెలియకుండా కళ్ళ నీళ్ళ పర్యంతం చేస్తుంది. ఆయన్ను దగ్గరగా ఆలో చించుకోవటానికి ప్రయత్నం చేస్తాను. మళ్ళీ, మళ్ళీ, ఎంత యిబ్బంది పొందవలసివచ్చినా కలుస్తూనే వుంటాను. ఫలానా అంతాయనతో పరిచయముందని చెప్పుకోవాలన్న ఉబలాటం కూడా నాలో వుందనే అనుకొంటున్నాను. ఆయన తన ప్రత్యేక విషయాలను గురించి చెప్పటం ఆపరు. నేను తలకాయలాంటిది వూపటం ఆపను. సంఘ మర్యాద కాబోలు. నిజానికి యీ రకమైన గొప్పవాళ్ళంతా తమను గురించి చెప్పుకుంటూనే ఉంటారు కాబోలు. స్వంతాన్ని గురించి చెప్పి, ఎదుటివాడితో ఎంత ఎక్కువగా అవుననిపించ గలిగితే అంత గొప్ప క్రింద లెక్కేమో:

వెంకట్రామయ్యగారు మాట్లాడుతూనే వున్నారు. నాకు విసగటగానే వుంది. ఒకసారి ఆయనను ఎదిరించి, అలా యింక పట్టించుకోకుండా వెళ్ళిపోగలిగితే బాగుండును గదా: కాని ఆయనను, ఆయన డబ్బును నేను తేలికచేసిన నాడు, నన్నూ, నా డబ్బులేని తేలికతనాన్ని ఆయన నలుగుర్లో బరువుగా ప్రచారంచేయ గలరు. అందుకే లోకంలో సర్దుకుపోతే ఏం పోయె? ప్రశాంతంగా నవ్వుతున్నట్లుగా కని పిస్తున్న ఆయన మీసాలు నేను ఆయనను గురించి యిలా ఆలోచిస్తున్నా ననుకొంటే ఏమవుతాయో? ఆయన బహుశా కోతిలాగ చిందులు వేస్తారు. లేదా పెంకులెగిరిపోయేలాగ గట్టిగా అరచి, పొమ్మంటారు.

వెంకట్రామయ్యగారిది పెంకుటిల్లే. అంత ఆస్తిపరుడంటారు గదా పెంకుటింట్లో ఆయన ఎందుకుంటారు? పెద్ద మేడ ఒకటి ఎందుకుండ గూడదు? బహుశా ఆయన అందరూ అను కునేంత ఆస్థిపరుడు కాదేమో. ఆయనకొక మేడ కూడా వుంటే నాకీ క్షణంలో యిలా గుబులుగా, బాధగా వుండేది కాదు. లేక నిరా డంబరత్వమేమో. అయితేనేం యింటి నిండా ఆశ్చర్యం కలిగించే ఎన్నెన్నో వస్తువు లుంటాయి. ఎక్కువగా అమెరికాదేశానివిట. ఒక్కోసారి ఆ పెంకుటిల్లు కూడా నాకు ఒక పెద్ద మేడకంటె ఎక్కువగా కనిపిస్తుంది. అదో రకమైన గంభీరత. ప్రస్ఫుటంగా (నాకనిపించే) వెలితిలేనితనం.

అకస్మాత్తుగా వెంకట్రామయ్యగారు యిళ్ళను గురించి బృహదున్నత ఉపన్యాసం మొదలుపెట్టారు: "ఇల్లు యిరకాటం, ఆలి మర్కటం కావాలన్నారు పెద్దలు. ఇల్లు కట్టి చూడు, పెళ్ళిచేసి చూడు అనికూడా అన్నారు. ఎక్కడో అమెరికాలో కూర్చుని మా వాడు 'యిల్లు కట్టించండి' అని ఒక యింజనీరు గీసిన పటం పంపాడు. అంతటితో స్వరాః? ఈ చుట్టుప్రక్కల అటువంటిది ఉండగూడదని మా వాడి పంతం. (కొద్దిగా చిరునవ్వు) దాని కేమో రంగులు వెయ్యటానికి అయిదువేల రూపాయలు ఖర్చు తేల్చారు ఎంత పొదుపుగా ఉందామన్నా; సరే. తతంగమంతా కానిచ్చి చివరలో కక్కుర్తి పడటమెందుకు లెమ్మని



వూరుకున్నా. అయిదువేలతో పది సంసారాలు గడిపే భారతదేశంలో—నా కయితే యిష్టం లేదు. కాని రాత అలా వున్నపుడు ఏం చెయ్య గలం? ఒకసారి చూస్తారా? రండి దగ్గరే, వెళదాం," వెంకట్రామయ్యగారు భుజంమీద కండువా వేసుకొని బయల్దేరారు: నేనూ వెంట పడ్డాను.

కక్కుర్తిలో ఒక మేడ. కానీ అమెరికా యింజనీరు. ఆయనకు మేడ వుంటే వుండ నివ్వండి. నన్ను చూడమని ప్రాణం తీయడ మెందుకు? ఈ యిల్లు చాలలేదు కాబోలు అయ్యగారికి. మేడలో ఎలా వుండగలడో? నవ్వొస్తుంది. నాకూ ఒక మేడ వుంటే? ఎలా వస్తుంది? ఛ ఛ. వెధవ బ్రతుకు. వెంకట్రామయ్యగారి భవనం చేరుకున్నాం. నన్ను మర్యాదగా ఆ భవనం చూపించటానికి స్వయంగా ఆయన తీసుకొచ్చారు: నాలో కొద్దిగా గర్వం మెదిలింది.

బయటనుంచీ పైపైకి కనిపిస్తున్న బ్రహ్మాండమైన మేడ. గేటులోంచి లోపలికి వెళ్ళగానే కనిపించే పెరుగుతున్న అశోక మొక్కల కెదురుగా లోపల యింకెంత గొప్పగా వుం టుందో ననిపించే మేడ. రంగులు కూడా పూర్తయ్యాక యింకెంత గొప్పగా వుంటుందో ననిపించే లోపలి భాగం. అంతా తిప్పారు, యింటి బయటా, లోపలా. నాలోని ఆలోచనలు ఆగిపోయి, ఆశ్చర్యం పెరిగిపో సాగింది. "ఎలా వుంది?" అకస్మాత్తుగా వినిపించిన ప్రశ్న. గర్వంగా నవ్వుతున్న వెంకట్రామయ్య గారి రూపం. నకు సిగ్గేసింది. సమాధానం చెప్పటానికి మొహమాటంలో మాటలు దొరకలేదు.

"బాగుంది" అనేసి వూరుకొన్నాను. ఆ మాటలకి ఆయన తేలికగా అనిపించి బాధ పడతారేమోనని భయంవేసింది గానీ, ఆయన నవ్వుతూనే వుండేసరికి తిరిగి సర్దుకోగలిగాను.

"ఎంత ఖర్చయ్యిందండీ" ఉండబట్టలేక, నా భయాన్ని ఉపశమింప జేసుకోవటానికి, ఆయన గొప్పతనం గ్రహించానన్న ఉద్దేశ్యం ఆయనలో కలగటానికి, అడిగేశాను. "మూడు లక్షలయ్యిందండీ. అంత కర్చవుతుందను కొంటే మొదలెట్టేవాణ్నిగాను. కర్చుమీద కర్చు. అంతులేదు. నేను గనక ఎలాగో సర్దుకురాగలిగాను గానీ ఇంకొకడూ, ఇంకోడూ అయితే యింకేముంది," ఇంటికేసి చూసు కుంటూ, వెంకట్రామయ్య.

"నిజంగానే దేనికైనా డబ్బు కావాలి. నే చూసినంతలో యిటువంటి బిల్డింగు యింత వరకూ యీ చుట్టుపక్కల ఎక్కడా లేదండీ. చాలా బాగుంది. చాలాకాలం ఉంటుంది" నేను, గబగ్గా.

ఆయన కళ్ళలో మెరుపులు. నాకు అసంతృప్తి. ఎలాగైతేనేం యింకా యింకా పొగట్టం అసాధ్యమైన పరిస్థితిలో సెలవు పుచ్చుకుని నా వూరు బయలుదేరాను.

ఇంటికి చేరగానే యింటి చుట్టూ గబ గబా తిరిగేశాను. ప్రహరీ గోడల స్థానే వెదురు కంపదడులు, కప్పుమీద తాటాకు కప్పించటానికయ్యే ఖర్చు, ఊగుళ్ళాడే తలుపులూ, కానీ ఏం చెయ్యాలన్నది ప్రశ్న. ప్రశ్నకు సమాధానం దొరక్కపోతే ఎక్కడికో చోటికి పారిపోవటమే. నా సరైన స్నేహితుడు గోపాలకృష్ణ. అతని దగ్గరకు వెళ్ళాను. నేను వూరినుంచి ఎపుడొచ్చానో అడిగి తెలుసుకున్నాడు. యాదృచ్ఛికంగా కానీయండి, మరోలా కానీయండి. ఒక్కొక్కసారి మనం ఎంత ప్రయత్నం చేసినా సంఘటనలు ఎదురు తిరుగుతాయి. ఇల్లు అన్నది ప్రత్యేకం నా దృష్టికి రావటం యిప్పట్లో నేను సహించలేను. ఆ పదాన్ని తప్పించుకోవటానికి నేను ప్రయత్నంచేస్తున్నా కానీ గోపాలుడే మొదలెట్టాడు-

"వెంటిలేషన్ సరిగా తగలడదు. రాత్రుళ్ళంతా దొంగలుపడ్డట్టు ఎలుకల పరుగులు. వర్షాకాలమొస్తే పైనుంచి ఒకటే ధార. 'బాగు చేయించరా బాబూ' అని ఓనర్‌ని బ్రతిమాలితే 'ఉంటే వుండు లేదా పొమ్మనే సమాధానం. దరిద్రంగా చచ్చేలెట్రిన్, బాత్‌రూంలూ, ఇంటి ముసలమ్మ గొడవలూ. వారేయ్! ఈ అద్దె కొంపల్లో వుండటమన్నది ఎంత నరకమో నీకు తెలీదు. వూరి గుడిసె అయినా స్వంత యింట్లో వున్న ఆనందం యిలా దొరకదురా నాయనా. ఈ యింట్లో మాత్రం ఖచ్చితంగా వుండలేను. కుదిరిన వెంటనే యిల్లు మారిపోతాను. ఇంతకంటె ఘోరమైనా సరే. వుద్యోగమే బదిలీ చేయించుకుంటాను."

స్వంత యిల్లు! నాకు విపరీతమైన చిరాకు, వికటంగా, విషాదంగా నవ్వాలనే కోర్కె వచ్చాయి. వీడు కూడా యింటి విషయంలో బాధపడుతున్నాడన్న తృప్తి. వాణ్ని ఓదార్చి, నన్ను సముదాయించుకోవాలన్న ఆలోచన. ప్రతి ఒక్కరికీ యిల్లు ఒక సమస్య కాబోలు. మరి సమాధాన మేమిటి? ప్రశ్నలోనే సమాధానం వుంటుందని ఎక్కడో విన్న గుర్తు. ముందర సమస్య నర్థం చేసుకోవాలి. గోపాలుడికి ఏవేవో మాటలు, నా స్వంతమన్నట్లుగా కాకపోయినా, అందరికీ యింటి విషయంలో వుండే కష్టాలు విడమర్చి చెప్పాను. చూస్తే మరొక యిల్లు చూడమనే చెప్పాను. మన కష్టం ఎదుటివాడు తీర్చకపోయినా, వింటేనే అదొక రకమైన తృప్తి. గోపాలకృష్ణ కూడా అప్పటికి సమాధానపడ్డాడు. ఇద్దరం కలిసి హోటల్‌కి బయలుదేరాం. కొద్దిసేపటికిగానీ సర్వరు కుర్రవాడు రాలేదు. వచ్చి నిలబడ్డాడు. రెండు టీ పట్టుకురమ్మని చెప్పాం. కొద్దిసేపటికి తీసుకొచ్చాడు. వాడి కళ్ళనిండా నీళ్ళు. గ్లాసులు చేతికందించి, కళ్ళు తుడుచుకున్నాడు.

"ఏమైంది?" వెంటనే అడిగాను నేను.

లోపలి వైపుకు చూసి చెప్పాడు—"గురవయ్యగారు పుల్లాబెట్టి కొట్టేరు" అని మాసినవాడి చొక్కా పైకి తీసి వాతలు చూపించాడు. మోకాళ్ళ మీది వాడి పుళ్ళు యింకా అసహ్యకరంగా అలాగే వున్నాయి. వాడి మొహం కూడా నల్లగా, లావుగా చూడటానికేమిటోగ్గా వుంటుంది గానీ, ఎక్కువగా నవ్వుతూ కనిపించే, వచ్చీ రాని తెలుగులో మాట్లాడే ఆ కుర్రవాడంటే మాకు కొంచెం అభిమానంగా వుండేది.

"ఎందుకు" మళ్ళీ అడిగాను.

"ఇంటికెళ్ళటానికి పోనివ్వమనీ అడిగానూ, దానితో ఆయన కొట్టారు" లోనికి చూస్తూ.

గురవయ్యమీద విపరీతమైన కోపం వచ్చింది. పదిహేనేళ్ళు నిండని ఆ కుర్రవాడు బ్రతుకుతెరువు కోసం కేరళ నుంచీ వచ్చాడే. వాడు యింటికిపోయి తల్లిదండ్రుల్ని చూసుకోవటానికి యెందుకు వెళ్ళనివ్వడు?

"ఇంటికెళ్ళటానికి డబ్బులున్నయ్యా"నేను.

"గురవయ్యాగారికాడే వున్నాయి. నాకు వచ్చే పైసలు మళ్ళీ వెళ్ళటానికి యిస్తానని చెప్పి వుంచారు. ఇపుడు అడిగితే కొట్టారు." కోపంగా ఆ కుర్రవాడు.

"ఆ డబ్బు వస్తే వెళతావా?" నేను.

"ఎందుకూ వెళ్ళను?"

"అడిగి తీసుకొని యిమ్మంటావా?" నేను.

"అమ్మో! మళ్ళీ కొట్టటం చేస్తారు. వద్దూ లెండి!" కుర్రాడు.

గోపాలకృష్ణ అలాగే వింటున్నాడు. నాకూ ఏమిటోగా వుంది. ఈ చిక్కు విడి యీ కుర్రవాడు, హాయిగా యింటికి చేరితే బాగుండు కదా అని బాధ వేసింది. సహాయం చెయ్యటం కుదరదు. వద్దంటున్నాడు. గురవయ్యతో నాలాటివాడు పెట్టుకోవటం తగదు, అనవసరం. ఇంటికి వెళితే తిరిగి వస్తాడా యీ కుర్రవాడు? అదే అడిగాను.

"ఎందుకు వస్తాను? ఏమో మరి. మా నాన్న మళ్ళీ కొట్టితే ఇంకా యెక్కడికైనా వెళ్ళి వుంటాను. ఇక్కడ రాను," కుర్రవాడు లోపల్నుంచీ మనిషిరావటం చూసి లోపలకు వెళ్ళిపోయాడు. నాకు మనసులో దేవినట్లుగా వుంది. లోకమంటే తెలియకుండానే తల్లిదండ్రుల్ని వదిలి, బ్రతుకుతెరువుకోసం ఒక యిల్లు అనేది లేకుండా, ఎక్కడకుబడితే అక్కడకు మూట సర్దుకొని పోవటానికి సిద్ధపడే యీ కుర్రవాడు! ఏమిటిది, ఏమిటిది? ఏం కావాలి నీకు? ఎవరికి? ఎందుకు? రామయ్యగారి మేడా? గోపాలుడి అద్దెకొంపా? ఎగిరిపోయిన తాటాకులా? బ్రతుకులా? టీ గ్లాసు వణికింది. నోరు కాలింది. ఎంత ఆలోచించినా తట్టని సమాధానం మెదడులోకి దానంతటదే తోసుకువస్తున్నట్లుంది. సంఘం. మనిషి. డబ్బు. బ్రతుకుతెరువు. ఆశ. పోలిక. నిరాశ. తపన. అసహ్యం. ఛీఛీ. కొట్టుకుపో. చచ్చిపోతే? ఆనందంలో బాధ. బాధలో ఆనందం. కేరళలో ఏ పొలంలోనో పనిచేస్తుండే తండ్రి. లేదా త్రాగి పండుకొనే తండ్రి ఇల్లు ఏదంటే ఆకాశం వంక చూపి నవ్వే ఎగతాళి Nothing is is in what is and also conversely.తడికెలస్తానే ప్రహరీగోడలు. మేడలస్తానే పునాదిరాళ్ళు. వర్షంలో సోఫా సెట్టు. వూబిలో వెంకట్రామయ్య. పాపం....అయ్యో. అదంతేనోయ్. నువ్వే గొప్పవాడివికావు. బాధపడిలాభంలేదు. కేరళకుర్రోడు. కేరళలో వెంకట్రామయ్య మేడ. వెంకట్రామయ్య మేడలో కేరళ కుర్రోడు. ఎవరికీ భయమనవసరం. నేనున్నా. నేనంటే సంఘం. సంఘమంటే మనమంతా—అనుకుంటే, తెలుసుకుంటే. గురవయ్య హోటల్లో వెంకట్రామయ్య కొడుకు.

"గోపాల్ ఇందాకట్నుంచీ యింటిని గురించి ఏకరువుపెట్టావ్. ఇపుడా కుర్రాడ్ని చూశాక నీకేమనిపిస్తోంది?" నేనడిగాను. 'ప్చ్' అని వూరుకున్నాడు. గోపాల్‌తో ఏదో చెప్పాలనిపిస్తోంది నాకు.

"ఎవరి బాధలు వాళ్ళవి. ప్రొద్దున్న కొత్తగా కట్టిన ఒక మేడ చూసి వచ్చిందగ్గర్నుంచీ యిల్లంటే ఏమిటని ఆలోచిస్తున్నా. మళ్ళీ నీవు కూడా నీ యింట్లో నీవు పడవలసివస్తున్న బాధలు చెప్పుకోవచ్చావ్. కాని యిందులో ఫలానావాడికి మేడ వుంది, నాకు లేదే అని బాధపడటంలోకాని, నీ బాధలో కాని నిజమైన కారణం ఎంతవరకు వుందంటావ్?"

"ఏదో పాపం! ఏం చెప్పగలం," గోపాలకృష్ణ జాలిగా.

"ఇంటినిగురించి ఒక విషయం చెపుతున్నా౽. మానవుడు సంతృప్తిలేనివాడు. లేనిదాని కోసం ప్రాకులాడటం, లేనిది ఉన్నట్లుగా నటించటం చేస్తూనేవుంటాడు. ఎవరో యెందుకు? నా ఇల్లు బాగుండాలని కోరుకోవటం యితరుల్ని మెప్పించటానికేగానీ నాకోసం కాదు. ఎక్కడైనా ఎవడైనా యింతే. ఆఖరికి సర్దుబాటు ప్రయత్నం మనిషికి తప్పనిసరి. ఇంటిని గురించి సమస్య ప్రతి ఒక్కరికీ వుండి తీరేదే. కానీ ఆయిల్లే ఒక సమస్య కాకూడదు ఎన్నిచోట్ల ఎంతకాలం తిరిగినా మనం తిరిగిరాక తప్పనిచోటు యిల్లు. ఆ యింట్లో సుఖపడటానికి ప్రయత్నం చెయ్యాలిగానీ కష్టాలు కావాలని తెచ్చి పెట్టుకొంటే ఎలా?" నేను.

తరువాత నేను యింటికి చాలా హాయిగా త్వరగా వెళ్ళగలిగాను. □



మళ్ళీ ఎప్పుడో! ఎక్కడో!

"పెళ్ళాం పుట్టింటికెళితే మగవాడికి కావలసినంత రిలీఫ్—" ఈజీఛెయిర్‌లో కూర్చుని అనుకున్నాడు రాంబాబు....వాళ్ళ మామగారి దగ్గర్నుంచి లెటర్ వచ్చింది. "అమ్మాయిని పంపించండి....పది రోజులు ఉంచుకుని పంపిస్తాం—" అన్నదే దాని సారాంశం. ఎగిరి గంతేశాడు రాంబాబు. ప్రమోషన్ ఆర్డర్స్ చూసుకొన్నంత సంబరపడిపోయాడు.

మధ్యాహ్నం లంచ్‌కి యింటికి వెళ్ళివెళ్ళగానే లెటర్ చూపించి, "ఏమిటి నీ వుద్దేశ్యం?" అన్నట్టుగా భార్య ముఖంలోకి చూశాడు.

"నాకూ మా.అమ్మను చూడాలనుంది. రేపు జీతాలు రాగానే వెళతాను" అంది....

"వెళతానంటావ్. నీకేం? ఆ పది రోజులు నేనెంత అవస్థపడాలో....నీకు దూరంగా వుండటం మరీ కష్టం...." అన్నాడు రాంబాబు.

"అబ్బో! ఏం మాటలు....మీకేం హాయిగా కాలక్షేపం చేస్తారు" అన్నది.

"అంతే! నీకంతా వేళాకోళంగా ఉంటుంది" అన్నాడు.

ఆ రోజు ఉదయం భార్యను, నలుగురి పిల్లల్ని రైలెక్కించి వచ్చాడు రాంబాబు.... తలంటుకున్నట్లుగా వుంది ప్రాణం....పిల్లల గొడవలలో రోజూ సతమతమయ్యేవాడు. చదివిన చదువుకు తగని వుద్యోగం. గుమస్తాగిరి. చాలీచాలని కొంప....కొంప! అదే గది! అదయినా నానా అవస్తలు పడితే దొరికింది. గొర్రె తోకలాంటి జీతం—జీవితం. వీటన్నిటికీ తోడు భార్యామణి విసుగులు, ఛికాకులు, కోపాలు—ఆమె సాధారణ కోర్కెలు తీర్చలేని తను....ఇవన్నీ....ఎన్నో....!

సినిమా చూడక ఎన్నాళ్ళయింది (ఎన్నేళ్ళయింది). పెళ్ళయినకొత్తలో ఏం చూశాడో. అంతే. యేదయినా పిక్చర్‌కు వెళ్ళాలి. ఈ రొటీన్ లైఫ్‌నుండి కొంత తప్పుకుందాం.... ఆలోచనలనుండి తేరుకొని నీట్‌గా తయారయి, యింటికి (అదే గదికి) తాళంవేసి ఈల. వేసుకుంటూ బయలుదేరాడు రాంబాబు.

రాంబాబు హుషారు చూసి పక్కింటి తాయారమ్మ ముక్కుమీద వేలేసుకుంది.

*　　*　　*

రాంబాబు హాలులోకి వెళ్ళి కూర్చోగానే పిక్చర్ మొదలయింది. హుషారుగా సాగుతోంది. అది ఒక లవ్ స్టోరీ.హీరోయిన్ను చూస్తుంటే రాంబాబుకు తేజోమయి గుర్తుకొచ్చింది.... డిగ్రీ వెలగబెట్టే రోజుల్లో తను లవ్‌లో పడ్డాడు. వాళ్ళ యింట్లో ఒక రూమ్ అద్దెకు తీసుకొని వుంటుండేవాడు. అప్పుడు తేజోమయి ఇంటర్ చదువుతుండేది. అప్పుడప్పుడు తన రూంకు వచ్చి అర్థం కాని లెసన్స్ చెప్పించుకుపోతూ వుండేది. నెలవరోజుల్లో తనతో కనీసం గంటయినా కాలక్షేపం చేయకుండా వుండేది కాదు. మొదట్లో ఆమెపట్ల ఎటువంటి అభిప్రాయం లేదు తనకు. రానురాను ఇద్దరి మధ్యా అవగాహన యెక్కువయింది. పండగ పబ్బాలకు వాళ్ళింట్లోనే భోజనం. తేజోమయితో ప్రతిరోజూ ఒక గంటయినా మాట్లాడందే తోచని పరిస్థితి యేర్పడింది. వాళ్ళ నాన్నగారి పర్మిషన్‌తో సినిమాలకు కూడా వెళుతుండే వాళ్ళు. తను 'మంచివాడు' అనే విశ్వాసం కుదిరింది వాళ్ళల్లో. తనతో యెక్కడికయినా యెటువంటి అభ్యంతరం లేకుండా పంపేవాళ్ళు. ఇద్దరి మధ్య యీ చనువు ప్రేమరూపు దిద్దుకుంది. వీలుచిక్కినప్పుడల్లా యిద్దరూ యెదురెదురుగా కూర్చుని యేవేవో మాట్లాడుకుంటూ, కళ్ళల్లోకి అదేపనిగా చూసుకుంటూ కదిలే కాలాన్ని గమనించకుండా గడిపేవాళ్ళు....

ఆ రోజు ఉగాది....

ఉదయమే తలస్నానం ముగించి ప్రోగ్రాం గురించి ఆలోచిస్తూ కూర్చున్నాడు రాంబాబు. ....ఇంతలో చేతిలో గిన్నెతో ప్రవేశించింది తేజోమయి....కన్నార్పకుండా కొన్ని క్షణాలు అలాగే చూస్తుండిపోయాడు రాంబాబు.... తలంటుకుని వదులుగా జడ వేసుకుంది.ముఖాన కుంకుమబొట్టు. చారడేసి కళ్ళకు కాటుక దిద్దుకుంది. మామిడి చిగురు రంగు పట్టు పరికిణీ అదే కలర్ జాకెట్, తెల్లటి వోణీ....గువ్వలాగ వుంది తేజోమయి....పాలపొంగులాంటి వయసు అదే పనిగ పమిట చాటు నుంచి తొంగి చూస్తోంది....

"ఏదో వూహా లోకంలో వున్నట్టున్నారు" అంటూ పలకరించింది.

"ఆఁ....అబ్బే....యేంలేదు."

"వేయి పట్టండి—ఉగాది పచ్చడి."

తీసుకున్నాడు రాంబాబు.

"ఈరోజు నిన్ను ఇలా చూస్తుంటే ఏమనిపిస్తోందో తెలుసా?" తేజోమయిని చూస్తూ అన్నాడు రాంబాబు.


"ఊఁ. ఏమనిపిస్తోంది!"

"అమాంతం వాటేసుకొని ఆ బుల్లి పెదాలను తడిచేయాలనిపిస్తోంది."

"అబ్బో!....ఆశే!"

"ఆశను నిజం చేయలేవా?" అంటూ ఆమె చేతిని పట్టుకున్నాడు రాంబాబు.

"ఏమిటది....ఎవరయినా చూస్తారు" భయపడుతూ, బిడియపడుతూ, చేతి స్పర్శకు



స్పందిస్తూ వణికే పెదాలతో అంది.

"ఎవరికీ కనిపించం....ఇటు ప్రక్కకు రా", అంటూ తలుపు చాటుకు తీసుకొని, ఆమెను దగరగా లాక్కొని, ఆ చక్కని బుల్లి పెదాలకు తన పెదాలను చేర్చాడు....

ఆ స్పర్శకు ఆమె శరీరం పులకరించింది.

అణువణువూ స్పందించింది.

కనులు అరమోడ్పులయాయి.

ఒళ్ళంతా మత్తు ఆవరించింది.

అతని తలను మరింత దగ్గరగా లాక్కొని అతనితో పోటీపడింది....

సినిమా చూస్తున్నంతసేపూ రాంబాబుకు తేజోమయే గుర్తుకు వచ్చింది. ఆమె ఆలోచనలతోనే ఇల్లు చేరాడు.

*　　*　　*

రాంబాబు ఆఫీసునుండి వచ్చేసరికి ఆరు దాటింది. వచ్చీరాగానే కాస్త టీ పెట్టుకుని తాగాడు. అదే స్టవ్‌మీద అన్నం పడేసి, పెళ్ళినాటి ఆల్బం తీసుకొని తిరగేస్తూ కుర్చీలో కూర్చున్నాడు....

బిందూ (భార్య) పెళ్ళిఫొటోల్లో యెంత బాగుందో....ముఖ్యంగా ఆ కళ్ళు. ఎంత చక్కటి కళ్ళు. ఆ కళ్ళు చూసి కదూ తను చేసుకుంది....

పెళ్ళయిన మొదటి సంవత్సరం యెంత హాయిగా గడిచిపోయిందో....అప్పుడు యీ లోకంలో తనూ, బిందూ తప్ప యింకెవరూ లేరనిపించేది. ఎంతో వినయంగా, అణకువగా సంచరించేది. ఎప్పుడూ ముఖంలో చిరునవ్వు. మరి యిప్పుడో!....ప్రతి చిన్న విషయానికీ విసుక్కుంటుంది. సంసారం చేస్తూ ఇన్నాళ్ళయింది—కొంపలో ఏమీ అమర్చుకోలేకపోయాం—అంటూ గొణుగుతుంది....ప్రతి దానికి బాధపడుతుంది. తను యెంతగానో లాలించి, బుజ్జగించి పరిస్థితులు వివరిస్తాడు. కాని ఆమె ధోరణి ఆమెదే! తను మాత్రం యేం చేయగలడు—ఆమె కోరేవి గొంతెమ్మ కోర్కెలు కాకున్నా, అవి తీర్చే మార్గం తనకు కనిపించ లేదు....నలుగురి పిల్లలకు పాల డబ్బాలు పోసి పెంచేసరికి తల ప్రాణం తోక్కొచ్చింది. ఏదో విధంగా డబ్బులు అప్పుగా పుట్టినా పాలడబ్బాలు దొరికేవికావు. బోలెడంత డబ్బు పోసి బ్లాకులో అతి కష్టం మీద సంపాదించగలిగేవాడు. ఆ బాధ పగవాడికక్కూడ వద్దు....

తనకు దురభ్యాసాలేమీ లేవు. సంపాదించేదంతా సంసారానికే పెడుతున్నాడు! తన కనేవి వేరే స్వంత ఖర్చులు లేనేలేవు. తన జీవితంలో

ప్రవేశించిన 'బిందూ' జీవితం సుఖమయం చేయాలని తనకుండదా?....అయినా పరిస్థితులు ఏ సరదాకు అవకాశం యివ్వలేదు. ఆమె అతి చిన్న కోరికలు కూడ తను తీర్చలేక పోయేవాడు. తన ఆర్థిక పరిస్థితులు అలాంటివి. అంతేకాని తన భార్యా పిల్లలు సుఖపడి పోతుంటే తను చూడలేక కాదు....ఆర్థిక యిబ్బందుల గురించి, పరిస్థితుల గురించి చెప్పాడు. అయినా మానసికంగా బాధపడుతూ, యెదుటివాళ్ళకు కూడ మనశ్శాంతి లేకుండా చేస్తుంది....ప్రతిరోజూ యింట్లో ఏదో రకంగా కలతలు....కలహాలు....తను యెంతగా నచ్చె చెప్పినా ఆమె వరవడి మార్చుకోదు....

అప్పుడు అనిపిస్తుంది........జీవితంలో ఆమెకు, ఆమె భావాలకు తగిన వ్యక్తి భర్తగా లభించి వుంటే బావుండేదేమోనని....సుఖపడి వుండేది. ఆమె కోరుకునే చిన్న చిన్న కోరికలతోపాటు పెద్దవికూడ తీర్చుకు నుండేది....

అన్నం మాడువాసన తగిలేసరికి ఆలోచనల నుండి తేరుకుని స్టవ్ దగ్గరకు పరుగెత్తాడు రాంబాబు. అన్నం బాగా మాడింది. ఆర్పేశాడు. కూర చేసుకో బుద్ధికాలేదు....స్నానం చేసొచ్చి అన్నం ముందు కూర్చున్నాడు....వెళ్ళేముందు 'బిందూ' పచ్చళ్ళు చేసిపెట్టి మరీ వెళ్ళింది...."వేళకు భోజనం చేయండి. ఒట్టి పచ్చళ్ళతోనే భోజనం ముగించకండి.ఆరోగ్యం జాగ్రత్త...." అంటూ యెంతగానో చెప్పి వెళ్ళింది...."పిచ్చిపిల్ల....ఈ ఆర్థిక ఇబ్బందులనేవి లేకుంటే బిందూ యెంతో మంచి పిల్ల...." అనుకొంటూ భోజనాల కుపక్రమించాడు.

* * *

ఆఫీసు పనిమీద హైద్రాబాద్ వెళ్ళాల్సి వచ్చింది రాంబాబుకి. పని చూసుకొని అలాగే వచ్చేటప్పుడు బిందూను, పిల్లల్ని తీసుకు రావచ్చు—అప్పుడే బిందూ వెళ్ళి పదిరోజులు దాటింది—అనుకుంటూ బ్రీఫ్‌కేస్ సర్దుకుని బయలుదేరాడు.

రాంబాబు ప్లాట్‌ఫాం మీదకు వచ్చేసరికి యింకా ట్రైన్ రాలేదు. గంటన్నర లేటని ఎనౌన్స్ చేశారు. 'అబ్బ! గంటన్నరే' అనుకొన్నాడు. ఓ స్థంభాన్నానుకొని వచ్చే పోయే జనాన్ని చూస్తుండిపోయాడు.

కొద్ది దూరంలో బెంచీమీద నవదంపతులు కూర్చుని వున్నారు. పసుపుబట్టలు—కాళ్ళకు పారాణి యింకా అలాగే వుండిపోయింది. చుట్టూ వాళ్ళ బంధువులు కామోసు. నవ్వుతూ యేదో మాట్లాడుకొంటున్నారు. బహుశా పెళ్ళయి అమ్మాయిని తీసుకుని వెళుతున్నారులా వుంది....

వాళ్ళను చూస్తుంటే రాంబాబుకు గతం కళ్ళ ముందు కదిలింది....

పరిస్థితులు అనుకూలించే వుంటే తేజోమయి తనది కావల్సింది....వాళ్ళకు లేకలేక కలిగిన పిల్ల తేజోమయి. ఒక్కతే! ఎంతో గారాబంగా పెరిగింది....మనసులు కలసిన తాము యిద్దరూ ఒక్కటవుదా మనుకున్నారు. తీరా అంతా అనుకున్న తరువాత జాతకాలు కలువలేదట....ఏడాది తిరక్కుండానే తేజోమయి భర్తృవిహీన అవుతుందని చెప్పారుట. ....అంతే పెళ్ళి తప్పిపోయింది....

అసలు విషయం తరువాత తెలిసింది, వాళ్ళ నాన్నగారికి పెద్ద వుద్యోగం, వెనుక ఆస్థి వున్న కుర్రాడ్ని తేజోమయికి తేవాలని వుండేదిట....అలాగే చేశాడుకూడ. అప్పట్లో తనకింకా వుద్యోగమే లేదు. జాతకాల నాటకం ఆడి పెళ్ళిని తెలివిగా తప్పించాడు....ఇదంతా తేజోమయి ద్వారా తరువాత తెలిసింది.

తేజోమయి పెళ్ళికి తను వెళ్ళలేక పోయాడు....వాళ్ళకు దగ్గర బంధువు, తనకు స్నేహితుడు అయిన ఒకతనిచేత ప్రెజెంటేషన్ మాత్రం పంపగలిగాడు....

ఆ తర్వాత మళ్ళీ వాళ్ళ వూర్లో తేజోమయిని అనుకోకుండా చూశాడు. పురిటికి పుట్టింటి కొచ్చిందట. చక్కగా పలుకరించి వాళ్ళింటికి తీసుకువెళ్ళి మర్యాద చేసింది....అంతే మళ్ళీ యిప్పటివరకూ యెక్కడా తేజోమయి తటస్థపడలేదు....ఎలా వుందో....!

ఆలోచనలతో అరగంట గడిచిపోయింది.

"ఏమయినా మాగ్‌జైన్స్ తీసుకుందాం" అనుకుంటూ బుక్‌స్టాల్‌వేపు నడిచాడు రాంబాబు.

మాగ్‌జైన్స్ పరిశీలిస్తున్న అతని కళ్ళు ఒక్కసారి ఆనందాశ్చర్యాలతో విప్పారినై. క్షణకాలం యిది నిజమా! అనిపించింది. విచిత్రం!,ఒకొక్కపుడు మనం ఎవరి గురించయితే ఆలోచిస్తూంటామో వాళ్ళే ప్రత్యక్షమవుతుంటారు....తేజోమయి! అటు వేపుగా నిల్చుని యేవో మ్యాగ్‌జైన్స్ తీసుకొంటోంది. ....యిద్దరి కళ్ళూ ఒకేసారి కలుసుకొన్నాయ్....

దగ్గరయి కళ్ళతోనే మాట్లాడుకున్నారు.

"ఇది కలా! నిజమా!" తేరుకొని అన్నాడు రాంబాబు.

"అదే సందిగ్ధంలో వున్నా...." అంటూ నవ్వింది.

"కులాసా?"

"ఆఁ....ఇలాగే."

ఇద్దరూ యేవేవో వెంట వెంట మాట్లాడుకోవాలని—

మాటలు రాని స్థితి—మౌనంగా సంభాషించారు....

"కాఫీ తాగొద్దాం పద."

"అలాగే!"

ఇద్దరూ రెస్టారెంట్‌లో ఓ మూలగా కూర్చున్నారు.

"అయితే ప్రస్తుతం మీరుండే దెక్కడ?" కాఫీ సిప్ చేస్తూ అడిగాడు రాంబాబు.

"వైజాగ్‌లో....ఈమధ్యనే మా వారికి బొంబాయి నుండి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది."

"అయితే మరి యిక్కడ...."

"పూర్తిగా చెప్పనీ....మా అమ్మగార్కి ఒంట్లో బాలేకపోతే చూసొస్తూ, ఇక్కడ ఓ స్నేహితురాలుంటే దిగాను. తీరా ఎంక్వయిరీ చేస్తే ఆమె టూర్‌లోవున్నట్టు తెలిసింది....తిరిగి వైజాగ్ వెళ్ళాలిప్పుడు...." అంటూ ఆగింది.

కాఫీ తాగటం పూర్తయింది.

కాసేపు యిద్దరూ మౌనంగా వుండిపోయారు.

"పిల్లలెంతమంది?" అడిగింది.

"దానికేం భాగ్యం—నలుగురు—మరి నీకో."

"ముగ్గురు."

తేజోమయిని పరిశీలనగా చూశాడు రాంబాబు.

కొద్దిగా వొళ్ళు చేసింది. నిండుగ, గంభీరంగ వుంది.

"ఇప్పుడు నువ్వేం చేస్తున్నావ్?"

"అదే! ఎదుగూ బొదుగూ లేని జీవితం—గుమస్తాగిరి."

"మీ భార్యామణి—పేరు హిమబిందు కదూ!—ఎలా వుంది?"

"ఆమెకేం బాగానే వుంది—ఆమెకే మనం బాగోలేం...."

"ఏం అలా అంటున్నావ్...." అంటూ క్షణం ఆగి,

"రాంబాబు—ఒక్క విషయం అడుగుతాను. సూటిగా సమాధానం చెబుతావు కదూ! ....మీ సంసారిక జీవితం సుఖంగా సాగటం లేదా?" అంది ముందుకు వంగి.

రాంబాబు తేజోమయి కళ్ళలోకి చూశాడు....

"తేజోమయి!........నా గురించి........నా సంసార విషయాలు యింతవరకూ ఎవరికీ చెప్పుకోలేదు....కాని యీ క్షణం నీ కన్నీ విప్పి చెప్పుకోవాలనిపిస్తోంది...." అంటూ రాంబాబు హిమబిందు మనస్తత్వం. గురించి, తన స్వవిషయాలు అన్నీ విడమర్చి చెప్పుకున్నాడు.

అంతా విని తేజోమయి నిట్టూర్చింది.

కొన్ని క్షణాలు ఎవరూ మాట్లాడుకోలేదు.

"నా వ్యక్తిగత విషయాలు చెప్పి నీకు బోర్ కలిగించానేమో........" అన్నాడు రాంబాబు.

"ఛ!....అలా అనుకోకు....బోర్ కాదను

కుంటే నా జీవితం గురించి కూడా వింటావు కదూ!...."

ఆసక్తిగా ముందుకు వంగాడు రాంబాబు.

నుదుటికి పట్టిన చిరుచెమటను కర్చీఫ్‌తో తుడుచుకొంటూ;

"చక్కటి యిల్లు, కారు, అంతస్థు, అన్నీ ఉన్నాయి....ఏది కావాలన్నా, ఏది కోరుకొన్నా తెచ్చిపెట్టే అందమయిన భర్త లభించాడు. నాకు లేనిదంటూ ఏదీలేదు—ఒక్క మనశ్శాంతి తప్ప...."

అంటూ క్షణం ఆగింది తేజోమయి.

రాంబాబు ఆమె ముఖంలోకి చూస్తూండిపోయాడు.

"చూడు రాంబాబూ.... భార్య తన భర్తను గురించి ఇలా బహిరంగంగా చెబుతున్నందుకు నన్ను మరోలా అర్థం చేసుకోకు....నువ్వన్నట్లు ఈ క్షణంలో నా బాధను నీతో పంచుకోవాలనుంది....ఆయనకు దురలవాట్లు రెండే రెండు....ఒకటి: తాగుడు....రెండు: వ్యభిచారం....ఆ దురలవాట్లను మాన్పించాలని నేనెంతగానో కృషి చేశాను....

నా ప్రయత్నాలన్నీ వృధా అయ్యాయి.... అనురాగంగా, ఆప్యాయంగా చూసుకుంటాడు. ....కాని ఎప్పుడు ఆ దురలవాట్ల ప్రస్తావన ఎత్తినా, తెచ్చినా, విసుక్కుంటాడు—కసురుకొంటాడు....తన అలవాట్లకు అడ్డు తగలొద్దంటాడు....నాకు యీ జీవితంమీద విరక్తి కలిగిన క్షణాలుకూడా లేకపోలేదు...."

రాంబాబుకు ఆ క్షణంలో ఒక సందర్భంలో భార్య అన్న మాటలు గుర్తుకు వచ్చాయి; "....అనురాగం, ఆప్యాయతలు చూపుతూ భార్య అడిగే కోర్కెలన్నీ తీర్చే భర్తకు ఎటువంటి దురలవాట్లున్నా యెడ్జస్టయిపోవచ్చు...."

తేజోమయి తన జీవితం గురించి చాలా చెప్పింది.

"ప్రతి బ్రతుకులో ఏదో ఒక వెలితి!...." గొణుక్కున్నాడు రాంబాబు.

తేజోమయి అలసిపోయినట్లు కనిపించింది.

ఇంతలో ట్రైన్ ప్లాట్‌ఫాంమీదకు వచ్చిందని ఎనౌన్స్‌మెంట్.

అది రాంబాబు వెళ్ళాల్సిన ట్రైన్. ఇద్దరూ ఆ ఎనౌన్స్‌మెంట్ విన్నారు. కాని యెవరూ అక్కడ్నుంచి లేచేందుకు సిద్ధంగా లేరు. కనీసం యింకా కొంతసేపు ఒకరి గురించి మరొకరు చెప్పుకోవాలని, మాట్లాడుకోవాలని వారి మనసుల్లో వుంది....ఏదో బరువు తమ గుండెలనుండి దించుకొంటున్నట్లుగా ఫీలవుతున్నారు....

కొంత నిశ్శబ్దం తరువాత తేజోమయి అంది.

"జాతకాలంటూ మనల్ని ఒకరికొకరం కాకుండా చేశాడు మా నాన్న....జాతకాల పిచ్చిలో, భ్రమలో పడొద్దని ఆనాడు నువ్వెంత చెప్పినా, నేను ఒక విధంగా భయపడే నా జీవితాన్ని పాడుచేసుకొన్నా ననిపిస్తోంది....

ఒకర్నొకరు అర్థం చేసుకొని, ప... కలసిన మన జీవితాలుకూడ ముడిపడి యిప్పు డీ సమస్యలు వుండే... కదూ!...." అంటూ రాంబాబువేపు ...ంది తేజోమయి.

ఆమెకు వెంటనే యేమీ జవాబివ్వలేదు రాంబాబు.

కొన్ని క్షణాల తరువాత అన్నాడు, "చూడు తేజోమయి! మన జీవితాలు ఒకటయి ఉండినా ఇప్పుడు మన కెదురయిన సమస్యలు కాకుండా మరింకే సమస్యలయినా ఎదురయి ఉండేవేమో!....అనుకూల దాంపత్యం—అనేది నిజంగా ఒక గొప్ప అదృష్టం!....

నిజం చెప్పాలంటే....మనం జీవితంలో ఒకటి కాలేదని నేను బాధపడటం లేదు.... మనం ప్రేయసీ ప్రియులుగా విడిపోటమే హాయినీ, తృప్తినీ యిస్తోంది...."

తేజోమయి రాంబాబు కళ్ళలోకి చూసింది.

కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయింది.

"నిజం రాంబాబు. నువ్వన్నదాంట్లో చాలా నిజం వున్నది!....అప్పటి ఆ మధుర స్మృతులకు, ఆ తియ్యటి జ్ఞాపకాలకు చావనేది లేదు. ....ఈ బ్రతుకుల్లో అప్పుడప్పుడు అవి గుర్తు చేసుకుంటూ మననం చేసుకుంటూ బ్రతికేయగలం!...."

ట్రైన్ కదిలింది.

"మళ్ళీ ఎప్పుడో!....ఎక్కడో!...." ఇద్దరి మనసుల్లోనూ అనిపించింది. □

సీరియల్



వచ్చిన నాలుగు రోజులకే ప్రయాణమయిన కొడుకుని చూసి శాంతమ్మగారు తెల్లబోయింది. ఆవిడ ఎన్నివిధాల అడిగినా "పని కాలేదు—చాలా రోజులయిందని వచ్చేశా, మళ్ళో తొందరగా వచ్చేస్తాను" అని మాత్రం చెప్పేడు శేఖరం.

(4)

"మరి వుత్తరాలు అలా ఎందుకు రాశావు? ఇంక నా పనులన్నీ అయిపోయాయి ఎక్కడికీ వెళ్ళను. నేను వచ్చేవరకూ మందు శ్రద్ధగా వాడు. నేను వచ్చేకా అన్నీ నేనే చూసుకుంటా నంటూ" బాధగా అందావిడ.

"పని కానప్పుడు ఏం చేయనమ్మా! నీ దగ్గరనుండి కావాలని పారిపోతానా?" అన్నాడు శేఖరం నచ్చచెప్తున్నట్టుగా.

"కావాలని పారిపోతే మాత్రం—నేను ఆపగలనా, బాబూ!"

రాఘవరెడ్డికూడా ఎన్నో విధాల అడిగాడు "ఇప్పుడు నీకు అర్జంటు పనులేమున్నాయి? అమ్మగారు నన్ను తిట్టుకుంటారు ఆఖరికి ఇతను ఇంటపట్టున వుంటే నా కొడుకుని పూర్తమ్మట తిప్పుతున్నాడని. ఆ పనేదో నాకు చెప్పు? నీకు స్నేహితుడయినవాడు నాకూ స్నేహితుడే—లేక ఏదయినా రహస్యమా?"

శేఖరం ఏం సమాధానం చెప్పలేదు.

డాక్టర్ మాధురికూడా తెల్లబోయి అడిగింది "అంత వెంటనే వెళ్ళిపోతున్నారేం" అని. "మళ్ళీ వారం పదిరోజుల్లో వచ్చేస్తాను" అని చెప్పాడు.

"ఈసారి వచ్చినప్పుడు మా నాన్నగారిని ఎలాగయినా వప్పించి తీసుకురండి" అంది మాధురీదేవి.

"మీరు చెప్తే రానివారు నేను చెప్తే వస్తారా!" అన్నాడు శేఖరం.

"ఆయన వినటం అంటూ వుంటే అది మీ మాటే! మీరు చెప్తేనే వస్తారు. మిమ్మల్ని ఆయన సొంత కొడుకులా భావిస్తారు."

"సరేలెండి. చెప్తాను" అన్నాడు శేఖరం.

పేదవాడిని చేసుకోవడమే గాకుండా పల్లెటూరిలో ప్రాక్టీసు పెట్టిందని గోపాలరావుగారికి మాధురిమీద కోపం. పెద్ద వయసులో ఒక్కరూ ఏం వుంటారు మా దగ్గరకి వచ్చి నిశ్చింతగా వుండమని భార్యాభర్తలిద్దరూ చెప్పేరు. ఆయన భీష్మించుకుని కూర్చున్నారు. ఆయన శేఖరాన్ని అల్లుణ్ణి చేసుకుని వ్యాపార బాధ్యతల్ని అతనికి అప్పజెప్పి నిశ్చింతగా వుండాలనుకున్నారు.

అనుకున్నది ఏదీ కాలేదు. వ్యాపారం ఎవరిమీద పెట్టడానికి ధైర్యం చాలట్లేదు. పైగా కూతురు హైదరాబాదులోనే ప్రాక్టీసు పెట్టలేదని కోపం ఒకటి.

శాంతమ్మగారు మీరా దగ్గర చెప్పుకుని కూడా బాధపడింది. మీరాకి తల్లీ కొడుకు మాట్లాడు కుంటున్నవన్నీ—వినపడుతూనే వున్నాయి.

శేఖరం వెళ్ళేముందు రాఘవరెడ్డి వచ్చేడు.


"తను వుండనప్పుడు ఈ ఫోను ఎవరికి? నేను మాట్లాడలేను" అంది శాంతమ్మగారు కొడుకు వెళ్ళిపోతున్నాడని కష్టంగా.

"ఇంత నేను రానట్టే మాట్లాడుతున్నా వేమిటమ్మా!" అన్నాడు నవ్వుతూ.

"శేఖరం ముక్కుకి తాడు బిగించాలమ్మా! అప్పుడు మనం వెళ్ళమని గెంటినా కదలడు" అన్నాడు రాఘవరెడ్డి.

"అలాంటి పని నువ్వే చేయాలి బాబూ! మీ రిద్దరూ అన్నదమ్ముల్లా మసులుకుంటున్నారు. నాకు దగ్గరగా వుంటానని చెప్పిన మాటలన్నీ మర్చిపోయాడు. నేను యాత్రలనుంచి వచ్చినప్పటి నుండీ చెప్తున్నాను పాప పెళ్ళి, నీ పెళ్ళి ఒకసారే చేస్తానని. ఎన్ని సంబంధాలు వచ్చినా మాట్లాడానికే వెళ్ళకపోతే!" నిష్ఠూరంగా అందావిడ.

"ఉండు! వచ్చి మీ ఇంట్లో చెప్తాను. ఊరికే తగువులు పెడుతున్నావని" బెదిరింపుగా అన్నాడు శేఖరం.



వెళ్ళేటప్పుడు మీరాకి చెబ్దామా—వద్దా అని కాస్సేపు అనుకున్నాడు. మళ్ళీ చెప్పకుండానే వెళ్ళిపోయాడు. 'అరుణ వచ్చేవరకూ తను చాలా జాగ్రత్తగా వుండాలి. అరుణ వస్తే కొన్ని సంగతులన్నా తెలుస్తాయి' అనుకున్నాడు.

శేఖరం వచ్చినప్పటినుంచీ—"తను శాంతమ్మగారిల్లని జేరింది" అని మొండితనంగా—తప్పనిసరిగా మనసుకి సర్ది చెప్పుకున్నా—ఆ రోజునుండీ ఆ ఇంట్లో ఏం తీసుకోవటానికి మనసు ఎదురు తిరుగుతోంది.

శేఖరం వున్న నాలుగు రోజులూ శాంతమ్మగారు అంత గ్రహించలేదు కాని తర్వాత ఆవిడని నమ్మించలేక పోయింది.

"ఏం మీరా! కాఫీ తాగావా?" అని అడిగింది శాంతమ్మగారు.

"నేను వచ్చేముందే తీసుకుని వచ్చేనమ్మా!" అంది మీరా.

శాంతమ్మగారు నమ్మలేదు. మొదట్లోకూడా మీరా కాఫీ అదీ తీసుకోకపోతే శాంతమ్మగారే బలవంతం చేసింది.

ఇప్పుడు మీరా వచ్చేముందే తీసుకొచ్చేనంటే ఊరుకోలేదు. "మీరా! పొద్దున్నగా వస్తావు. ఎంత పొద్దుపోయినా అన్నం తిని వెళ్ళమంటే ఏవేవో చెప్తావు—కాఫీ నీళ్ళకేమిటి? నువ్వలా ఉసూరుమంటూ తిరుగుతే నాకు బాగుండదు—నచ్చదు కూడా" అంది.

కాస్త కాస్తగా కూడదీసుకుంటున్న ఉత్సాహం కాస్తా శేఖరం రాకతో వూడ్చిపెట్టుకు పోయినట్టయింది మీరాలో. ఇక్కడకి రావటం యిష్టంలేదు. రాకుండా వుండటానికి వీలులేదు. దాంతో కుంగదీసినట్టయిపోయింది మీరా.

మీరా చాలా నిరుత్సాహంగా నీరసంగా కనపడడంతో అది తల్లి అనారోగ్యమే కారణం అనీ ఈ పని కాస్తా మీరా మానేస్తే—ఈ వచ్చే నాలుగు డబ్బులూ రాకపోతే మీరా, మీరా తల్లీ ఇంకా ఇబ్బంది పడతారనీ—మీరా ఆలస్యంగా వచ్చినా తనకేం ఫరవాలేదనే, మీరానే సంకోచ

పడకుండా వుండమని పదేపదే చెప్తూ మీరాని ఇంకా స్త ఆదరముగా చూడసాగింది శాంతమ్మ గారు. మళ్ళీ ఈ మధ్య మీరాతో అందావిడ "మీ అమ్మగారిని ఎలాగయినా వప్పించి ఇక్కడకి తీసుకురా, మీరా!" అని.

"మీరిన్ని సార్లు చెప్పాలామ్మా! అమ్మ ఒప్పుకోదు" అంది మీరా.

వారం పదిరోజులు గడిచిపోయినాయి.

ఒకరోజు మధ్యాన్నం మూడు గంటలకి — శాంతమ్మగారికి భగవద్గీత చదివి వినిపిస్తోంది మీరా.

ఇంటిముందు టాక్సీ ఆగడం ఆ ఇద్దరూ గమనించలేదు.

గంగులు బాగ్ పట్టుకుని హాల్లో కొచ్చేడు. శాంతమ్మగారు గంగుల్ని ఎదో అడగబోయేంతలో శేఖరం లోపలకి వచ్చేడు.

బట్టలు నలిగి—క్రాపు చెరిగిపోయి—మనిషి చాలా అలసటగా కనిపించేడు.

శేఖరాన్ని చూస్తూనే మీరా లోపలకి వెళ్ళిపోయింది.

మీరాని చూసేసరికి శేఖరంలో అలసట సగం తగ్గిపోయింది.

'మీరా ఇక్కడే వుంది' తల్లిని ఏదో విధంగా ఒప్పించి మీరా రావటం మానేస్తుందేమోనని అతను భయపడ్డాడు.

"అదేమిట్రా బాబూ! అలా అయినావు! ఇంక వాళ్ళ పనులు వీళ్ళ పనులూ అంటూ ఇలా ఆరోగ్యం పాడయేలా తిరిగితే నేను వూరుకోను" ఖచ్చితంగా చెప్పింది శాంతమ్మగారు. శేఖరం నవ్వి వూరుకున్నాడు.

తర్వాత శాంతమ్మగారు లోపలకే వచ్చి మీరాని ముందు తొందరగా టీ పెట్టమని చెప్పి వెళ్ళింది. మీరా టీ తయారుచేసింది. శాంతమ్మగారు అక్కడకొచ్చింది. మీరా టీ కప్పు ఆవిడ కిచ్చేసి అప్పటికి గండం తప్పినట్టు తేలిగ్గా వూపిరి పీల్చుకుంది.

ఆవిడ టీ కప్పు అందుకుంటూ "తొందరగా వుప్మా చేయి మీరా! జీడిపప్పు కాస్త ఎక్కువవేసి చేయి" అని చెప్పి వెళ్ళిపోయింది.

'ఈవిడకి కొడుకు వున్నప్పుడు ఇంకెవరూ—ఎలా వున్నా కనపడరేమో! ఒట్టప్పుడు తను కాస్త ఎలాగో వుంటే తొంభై ఆరాలు తీస్తుంది.'

పది నిముషాల్లో ఉప్మా తయారుచేసి, టేబుల్ మీద పెట్టేసి బందీగా వంటగదిలోనే వుండిపోయింది. శేఖరాన్ని తీసుకుని శాంతమ్మగారు వచ్చినా మీరా అక్కడనుండ కదల్లేదు.

'ఆవిడే పెడుతుంది. పిలిస్తే అప్పుడే వెళ్ళచ్చు' అనుకుంది.

శాంతమ్మగారు గిన్నెలో ఉప్మా ప్లేటులో పెట్టింది. అక్కడే వున్న జగ్గులో మంచినీళ్ళు గ్లాసులో పోసి ఇచ్చింది. "టీ పెట్టమంటావా?" అని అడిగింది.

శేఖరం వెంటనే "ఊఁ" అన్నాడు. ఒకసారి దగ్గరగా మీరాని చూడాలని వుందతనికి. ఇప్పుడు తల్లి ఇక్కడే కూర్చుంది కాబట్టి మీరానే టీ తీసుకొస్తుందని ఇప్పుడతనికి టీ అక్కర లేకపోయినా కావాలన్నాడు. అతను రాగానే వెంటనే మీరా లేచి వెళ్ళిపోయింది. అప్పుడు మీరాని వెనకనించే చూశాడు. అప్పటికే మీరా గుమ్మం దాటిపోతోంది.

శాంతమ్మగారు మీరాకి ఇక్కడనుంచే చెప్పింది టీ పెట్టమని.

శేఖరం టిఫిను తినడం పూర్తయింది. తల్లి ఏదో కబుర్లు చెప్తోంటే వింటూ కూర్చున్నాడు. మాట్లాడుతున్న శాంతమ్మగారు "అయిందా మీరా!" అని అడిగింది.

మీరానుండి జవాబు రాలేదుగాని, మరో నిముషానికి టీ కప్పుతో అక్కడకి వచ్చింది. తల్లి తనకేసే చూస్తూ మాట్లాడుతుండడంవల్ల శేఖరానికి మీరాకేసి చూడ్డానికి ధైర్యం చాలలేదు. కాని, మీరా టీకప్పు టేబుల్‌మీద పెడ్తోంటే రెప్పపాటు కాలం కళ్ళు తిప్పి మీరాని చూశాడు. నేల నంటుకున్న చూపులు—ముడుచుకున్న మొహం—

మీరా శాంతమ్మగారు చెప్పిన ప్రకారం వంటచేసి—అన్నీ సర్ది పెట్టి—రోజూకన్న తొందరగా ఇంటికి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి భోజనం చేస్తున్నప్పుడు తల్లితో అన్నాడు శేఖరం. "అరుణ వచ్చేకా—ఏదేనా పని వున్నా చేసినా ఈవిడ యిలా యింత తొందరగా వెళ్ళిపోతే నీకు అవస్థకాదమ్మా!"

"ఏం చేయను మరి! ఎలాగో సర్దుకోవాలి. ఆ జానకి పిన్ని సరిగ్గా చేసే మనిషిలా కనపడ లేదురా! వచ్చినప్పటినించీ ఇంటినీ—ఇంట్లో వస్తువుల్నీ కళ్ళు మిటకరించుకుని చూడ్డమే! మీరాని యిక్కడకే వచ్చేయమన్నాను తల్లిని తీసుకుని. మీరా ఒప్పుకోలేదు."

"ఏం."

"తల్లి ఒప్పుకోదుట."

కాస్సేపాగి అన్నాడు శేఖరం. "పోనీ నువ్వు చెప్పి చూడాల్సింది....ఆవిడ అనారోగ్యం మనిషంటున్నావుగా!"

"మీరా చెప్పిందిగా! తల్లికి యిక్కడ ఆయాగా జేరినట్లు చెప్పిందట."

ఇంక శేఖరం మాట్లాడలేదు.

నాలుగురోజులు గడిచాయి. ఈ నాలుగురోజుల్లో మీరాతో యేం మాట్లాడ్డానికి శేఖరం ప్రయత్నించలేదు. మీరా అలా యింట్లో తిరుగుతోంటే అతని మనసుకి శాంతిగా—తృప్తిగా వుంది.

శేఖరం వచ్చినప్పటినుంచీ మీరా సాయంత్రం తొందరగా యింటికెళ్ళిపోతోంది. ఆ రోజు కూడా అన్నీ సర్ది పెట్టి శాంతమ్మగారితో చెప్పి వెళ్ళిపోదామని ఆవిడకోసం చూసింది. ఆవిడ ఇలాంటప్పుడు పడుకోదు. అయినా చూద్దామని ఆవిడ పడుకొనే గదికేసి నడిచింది.

శాంతమ్మగారు మంచంమీద పడుకునుంది. మంచానికి దగ్గరగా స్టూలుమీద శేఖరం కూర్చున్నాడు. కొద్దిగా ముందుకి వంగి తల్లినేదో అడుగుతున్నాడు.

మీరాకి పరిస్థితి అర్థమయిపోయింది. 'ఇప్పుడు తను వెళ్ళిపోతే ఏంబాగుంటుంది' గుమ్మం వరకూ వచ్చి ఆగిపోయింది మీరా. లోపలకి వెళ్ళడానికి యిష్టంలేదు, చూసి వెనక్కి వెళ్ళిపోతే బాగుండదని మనస్కరించకా అక్కడే ఆగిపోయింది.

పాదాల సవ్వడికి—గాజుల చిరు శబ్దానికి అతను కొద్దిగా మెడ తిప్పి చూశాడు. మీరా నిలబడి వుంది.

అతను యిలాంటి అవకాశం వదలదలుచుకోలేదు. పూర్తిగా యిటు తిరక్కుండానే "కొద్దిగా నీళ్ళు కావాలి" అన్నాడు.

మీరా గబగబా వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చింది. ఆ పక్కనే వున్న మరో స్టూలుమీద పెట్టబోతోంటే మధ్యలో శేఖరం అందుకొన్నాడు.

మీరా రెండడుగులు వెనక్కివేసి నిలబడింది.

శేఖరం తల్లిచేత మంచినీళ్ళు తాగించేడు.

మీరా శాంతమ్మగార్ని "ఎలా వుంద"ని అడగాలనుకుంది. నోటమ్మట మాట పెగల్లేదు. ఒక అయిదు నిముషాలు అక్కడ నుంచుని మీరా యివతలకి వచ్చి హాల్లో నిలబడింది. ఇలాంటప్పుడు ఆవిడ హార్లిక్స్ తాగుతుంది. ఇప్పుడు తాగుతుందో లేదో మీరాకి తెలియలేదు. పోనీ నీళ్ళుపెట్టి వుంచుదామని ఒకడుగు వేసింది. గదిలోంచి శేఖరం గొంతు వినిపించింది. "హార్లిక్స్ తాగుతావామ్మా!" అని.

ఆవిడ యేదో అంది. అది సరిగ్గా మీరాకి వినపడలేదు. "కొద్దిగా తాగమ్మా" అంటున్నాడు శేఖరం. ఎందుకేనా మంచిదని మీరా స్టవ్‌మీద నీళ్ళు పడేసింది.

తెర్లుతున్న నీళ్ళగిన్నె కిందకి దించింది మీరా. వేడినీళ్ళు ఫ్లాస్కులో పోద్దామని ఫ్లాస్కు తీస్తోంటే శేఖరం వచ్చేడు.

అతను గుమ్మం దగ్గరే ఆగిపోయి "అమ్మకి హార్లిక్స్ కావాలి" అన్నాడు.

అతని మాటకి జవాబుగా మీరా హార్లిక్స్ సీసా, గ్లూకోజ్ సీసా తీసింది.

"నీళ్ళు కాగివున్నాయా?" మీరాని పరీక్షగా చూస్తూ అడిగాడు.

ఆవిర్లు కక్కుతున్న వేన్నీళ్ళగిన్నె యెదురుగా కనిపిస్తూనే వుంది. మీరా మాట్లాడలేదు. గ్లాసులు తీసుకుని హార్లిక్స్ కలపసాగింది. శేఖరం చూస్తూ అక్కడే నిలబడ్డాడు.

కలిపిన హార్లిక్స్ మీరా చల్లారబోస్తోంది.

అతను తీసుకెళ్తాడో—తను తీసుకెళ్ళాలో మీరాకి అర్థం కాలేదు. మీరా మనసులోని భావం గ్రహించినవాడిలా శేఖరం అక్కడనించి వెళ్ళిపోయాడు.

మీరా హార్లిక్స్ తీసుకొచ్చేసరికి శేఖరం అక్కడే వున్నాడు.

మీరా గ్లాసు స్టూలుమీద పెట్టేసి ఇవతలకి వచ్చేసింది.

* * *

హాల్లో ఫోను మోగుతోంది. ఎంతసేపటికీ యెవరూ తీయలేదు. మీరా గబగబా వచ్చింది. అప్పుడే శేఖరం అక్కడికి వచ్చేడు. మీరా ఆగిపోయింది.

మీరా తిరిగి వెళ్ళబోతోంటే శేఖరం రిసీవరు తీసుకొంటూ అన్నాడు—"నాకు టీ కావాలి...."

మీరాకి రోషం—బాధా కలిగినా 'తను యీ యింట్లో పనిమనిషి—వాళ్ళేం పని చెప్పినా చేయాలి' మనసుని సరిపెట్టుకుంది. మీరాలో యీ భావం అదివరకెన్నడూ కలిగేది కాదు. మొట్టమొదటిరోజుమాత్రం కాస్త మథనపడింది. సంకోచపడింది. మళ్ళీ ఆ భావం మీరా దరిదాపులకి రాలేదు. దానికి కారణం శాంతమ్మగారి ఆదరాభిమానాలే!

శేఖరం వచ్చినప్పటినుంచీ—అతనికోసం యేదేనా చేసేటప్పుడు—స్వయంగా తన చేతులతో అతనికి వడ్డిస్తున్నప్పుడు ఈ భావం కస్సుమని లేస్తుంది—

మీరా టీ పెట్టి ఫ్లాస్కులో పోసి టేబుల్‌మీద పెడుతోంటే పిల్చినట్టే వచ్చేడు శేఖరం.

మీరా కప్పూ, సాసరూ తీసుకొచ్చి కప్పులో టీ పోసింది.

మీరా చేస్తోంటే మౌనంగా చూస్తూ నిలబడ్డ శేఖరం మీరా వెనక్కి తిరిగి వెళ్ళబోతోంటే "మీరా!" పిల్చేడు.

ఎక్కడనించో వినిపించినట్లు రెప్పపాటుకాలం ఉలికిపడింది మీరా. క్షణం ఆలాగే నిలబడిపోయి—వెళ్ళబోయింది.

శేఖరం మళ్ళీ పిల్చేడు. "మీరా! నీతో మాట్లాడాలి...."

మీరా మాట్లాడలేదు—అక్కడ ఆగలేదు—వంటగదిలోకి వెళ్ళిపోయింది.


అక్కడ హార్లిక్స్—టీ కలిపిన గిన్నెలు సర్దసాగింది.

శేఖరం గుమ్మం దాటి రెండు మూడడుగులు వేసి అన్నాడు: "మీరా! నీతో మాట్లాడాలని చెప్తోంటే వినపడదా?"

మీరా తలెత్తలేదు కాని, చేస్తున్న పని ఆపి అంది. "నే నేమీ వినాలనుకోవటంలేదు."

"ఏం? ఎందుకని?"

"..............."



"ఎందుకు వినాలనుకోవడంలేదూ?"

"..............."

శేఖరం యింకో రెండడుగులు ముందుకువేసి మళ్ళీ అడిగాడు. "ఎందుకని వినాలనుకోవటంలేదూ? దయచేసి సమాధానం చెప్పు!"

"....కొన్నింటికి కారణాలుండవు—నేను వినాలనుకోవటంలేదు" అక్కడనుంచి గబగబా ఇవతలకి వచ్చేసింది మీరా.

కొన్ని క్షణాలు అలాగే నిలబడిపోయాడు శేఖరం మీరా వెళ్ళినవైపే చూస్తూ.

శేఖరం తల్లిదగ్గరికి వచ్చేసరికి అక్కడ మీరా వుంది.

"ఎలా వుంద"ని శాంతమ్మగారిని అడుగుతోంది.

శేఖరం హాల్లోకి వచ్చేడు.

అప్పటికే ఏడు గంటలు దాటిపోయింది.

మీరా గదిలోంచి యివతలకి రాగానే శేఖరం గదిలోకి వచ్చేడు. "ఇప్పుడెలా వుందమ్మా!" అని అడిగాడు. ఆవిడ కాస్త తేలిగ్గానే వుందని చెప్పింది.

"చీకటి పడిపోయింది—ఆవిణ్ని వెళ్ళిపొమ్మని చెప్పు...." అన్నాడు శేఖరం తల్లికేసి చూడకుండానే.

"మరి నీ భోజనం! నీ అంతట నువ్వు పెట్టుకోవాలంటే అసలే తినవు—" బాధగా అందావిడ.

"ఫరవాలేదు—తింటాలే! వెళ్ళమను" అన్నాడు.

శాంతమ్మగారు నీరసంగా "మీరా!" అని పిలిచింది.

శేఖరం లేచి "గంగులు అల్లుణ్ని రిక్షా తెమ్మంటాను" అంటూ అక్కడనించి వెళ్ళిపోయాడు.

శాంతమ్మగారి పిలుపు మీరా వరకూ వెళ్ళలేదు. ఆవిడ అలా పడుకుంటే తను వెళ్ళాలో

వద్దో అర్థంకాక ఆలోచిస్తూ నుంచుంది.

గంగులు అల్లుడు వెంకన్న రిక్షా తీసుకొచ్చేడు. శేఖరం అప్పిని వెళ్ళి మీరాని పిల్చుకు రమ్మన్నాడు. అప్పి వెళ్ళి రిక్షా వచ్చింది రమ్మని మీరాకి చెప్పింది.

"రిక్షా ఎందుకు?" తెల్లబోయింది మీరా.

"చీకటయింది కదండీ!" అందది సాగదీసుకుంటూ.

మీరా రిక్షాలో వెళ్ళదలుచుకోలేదు. శాంతమ్మగారితో చెప్పి వెళ్దామని వచ్చింది. "నేను వెళ్తున్నానమ్మా! మీకేమయినా కావాలా?" అని అడిగింది.

"ఏం వద్దు, మీరా! అబ్బాయి రిక్షా పిలిపిస్తున్నాడు...."

"ఎందుకండీ! వెన్నలేగా! నడిచి వెళ్తాను" అంది మధ్యలోనే.

"మీరా! పెద్దదాన్ని. ఎందుకు చెప్తున్నానో విను. వెన్నెలయినా సరే! ఆ రిక్షా అతను గంగులు అల్లుడే. వీలుగా వుంటే పొద్దున తొందరగా రా" అందావిడ.

తనే అనుకుంది రేపు తొందరగా రావాలని "సరే నమ్మా" అని వచ్చేసింది.

మీరా వచ్చేసరికి వరండా మెట్లదాకా తీసుకొచ్చేడు రిక్షాని వెంకన్న.

శేఖరం వరండాలోనే వున్నాడు. చేతులు కట్టుకుని—కొద్దిగా భుజం గోడకి ఆన్చుకుని మొక్కలకేసి చూస్తూ, నిలబడ్డాడు.

ఎటు వెళ్ళాలో అడిగాడు వెంకన్న—మీరా చెప్పింది.

రిక్షాని యింటివరకూ కాకుండా సందు దగరే ఆపించింది. రిక్షాలోంచి దిగి పర్సు తీస్తూ, "ఎంత?" అని అడిగింది. ఓ చిన్న పర్సులో రెండు రూపాయల చిల్లర దగ్గరుంచుకుంటుంది యెప్పుడూ.

"అయ్యగారు యిచ్చేస్తారండీ" అన్నాడు వెంకన్న.

"ఎంతో చెప్పు" విసుగ్గా అంది మీరా.

"అయ్యగారు తిడతారండి బాబూ! మీకాడ తీసుకోవద్దని చెప్పేరండి" మరో మాటకి అవకాశం యివ్వకుండా వెళ్ళిపోయాడు వెంకన్న.

మర్నాడు—ఏడు గంటలకే వచ్చేసింది మీరా. వస్తూనే శాంతమ్మగారి గదిలోకి వెళ్ళింది. "ఎలా వుందమ్మా?" అని అడిగింది.

"కులాసాగానే వుందమ్మా!". అందావిడ. ఒక అయిదు నిముషాలు అక్కడ నిలబడి వంటింట్లోకి వచ్చి పని చూసుకోసాగింది.

కాఫీ కాసి ఫ్లాస్కులో పోసింది. స్టవ్ చిన్నదిచేసి దానిమీద గ్లాసుడు నీళ్ళు పడేసి శాంతమ్మగారి గదిలోకి వచ్చింది. "మీరు మొహం కడుక్కుంటారా?" అని అడిగింది.

"అప్పిని రమ్మను" అందావిడ.

"అప్పి గిన్నెలు కడుగుతోంది....పోనీ ఇక్కడకి. నీళ్ళు తీసుకొస్తాను ఇక్కడే కడిగేసుకోండి" అంది మీరా.


"అబ్బే, వద్దు! అప్పిని రమ్మను మీరా! నువ్వెళ్ళి పని చూసుకో!"

"ఇప్పుడు నాకేం పనిలేదు. రండి నేను తీసుకెళ్తాను."

శాంతమ్మగారి చేయి పట్టుకుని నెమ్మదిగా దొడ్లోకి తీసుకెళ్తోంటే అప్పుడే లేచిన శేఖరం ఎదురుపడ్డాడు. అతను తల్లిని పలకరించేడు.

అతను తెల్లారగట్ల నాలుగు గంటలవరకూ తల్లి గదిలో పడకకుర్చీలోనే పడుకున్నాడు. శాంతమ్మగారు "వద్దు నాయనా వెళ్ళి పడుకో" అని ఎన్నివిధాల చెప్పినా అతను వెళ్ళలేదు.

మీరా తల్లిని చేయి పట్టుకుని జాగ్రత్తగా తీసుకెడుతోంటే చిత్రంగా చూస్తూ నిలబడ్డాడు.



తను వచ్చేకకూడా మీరాకి తల్లిమీద అభిమానం—గౌరవం ఏ మాత్రం తగ్గలేదని గ్రహించేడు. అంత చదువు చదువుకుని — ఎంతో ఓరిమితో అలసట అనేది లేకుండా పని చేసుకుపోతున్న మీరాని చూస్తే అతనికి చిత్రంగానే అనిపిస్తోంది.

శాంతమ్మగార్ని గదిలోకి తీసుకొచ్చింది మీరా. ఆవిడని కుర్చీలో కూర్చోపెట్టి పక్క దులిపి వేసింది.

తర్వాత హార్లిక్స్ కలిపి తీసుకొచ్చింది. అప్పటికి శేఖరంకూడా అక్కడకి వచ్చేడు. అతనికి కూడా కాఫీ అక్కడ పెట్టి వెళ్ళిపోయింది.

తొమ్మిది గంటలు అవుతోంది. వంట మినహా మిగతా పనులు అయినాయి మీరాకి. ఒకసారి శాంతమ్మగారి గదిలోకి వచ్చింది. ఆవిడ కళ్ళు మూసుకుని పడుకుంది. అక్కడ ఎవరూ లేరు. మీరా వెనక్కి తిరిగి వచ్చేసింది.

ఏవో కాగితాలు చూసుకుంటూ నిలబడ్డ శేఖరం సాలోచనగా కొద్దిగా గడ్డం పైకెత్తాడు. గుమ్మంలో మీరా నిలబడివుంది.

అతని కళ్ళల్లో ఆశ్చర్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

"ఏమిట"న్నట్లుగా చూశాడు.

శేఖరం కాగితాలమీంచి దృష్టి మళ్ళించగానే మీరా రెండడుగులు లోపలకి వేసి చేతిలో రూపాయి అక్కడ టేబుల్‌మీద పెట్టింది.

"ఏమిటి? ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు శేఖరం.

"నిన్న-రిక్షాకి" చాలా ముభావంగా అంది.

"నేను ఇచ్చేశాను."

"అందుకే."

"మీరా! తీసుకెళ్ళిపో. రిక్షాకి నిన్ననే యిచ్చేశాను" మీరా అలా తీసుకొచ్చి యివ్వడం అతనికి బాధనిపించింది.

"ఒకరినుండి డబ్బు తీసుకోవడం అలవాటులేదు-రెక్కల్లో శక్తివుంది" అప్పటికే గుమ్మం వరకూ వెళ్ళింది మీరా.

"మీరా!" అంటూ శేఖరం మీరా దగ్గరగా వెళ్ళి అన్నాడు. "నిన్న మా అవసరానికి వుండిపోయావు—ఇవ్వవలసిన బాధ్యత నాకుంది" అలా అంటూ టేబుల్‌మీద రూపాయి చేయి జాచి అందుకుని మీరాకి యివ్వబోయాడు.

మీరా తీసుకోలేదు. "ఒకరింట్లో పనికి ఒప్పుకున్నాక కాస్త అటూ ఇటూ ఆలస్యమయినా వుండాలి" అనేసి గబగబా అక్కడనించి వెళ్ళిపోయింది.

'నేనీ ఇంట్లో పనిమనిషిని' అనే భావం మీరా వ్యక్తం చేయడం శేఖరానికి చాలా బాధనిపించింది. మీరా మీద కించిత్ కోపం కూడా కలిగింది. మొదట మీరా వంటమనిషిగా-ఇలాంటి పరిస్థితికి కారణం ఏమిటా అని బాధపడినా మీరా ఇంత దగ్గరగా మసలడం ఆ బాధని మరిపించింది. మీరా విషయంలో అతనో అభిప్రాయానికి వచ్చేశాడు. అది అరుణ వస్తేకాని సానుకూలపడేటట్టు కనిపించలేదతనికి. మీరాని మాట్లాడించాలన్నా—తనేదన్నా చెప్పబోయినా మీరా ఇప్పుడు వినే మూడ్‌లోలేదు.

మీరా యిచ్చిన ఆ రూపాయి తన డైరీలో చాలా జాగ్రత్తగా దాచుకున్నాడు శేఖరం.

మీరా వంటపని అయిపోగానే శాంతమ్మగారు ఆదేశించిన ప్రకారం దేవుడికి తనకి చేతనయినట్టు పూజచేసి నైవేద్యం పెట్టింది. అలా అమ్మవారికి పూజ చేసేకా-తనకి నిగ్రహశక్తి-ధైర్యం ప్రసాదించమని మొదటిసారిగా అమ్మవారికి రెండు చేతులూ జోడించి వేడుకుంది మీరా.

మీరా శాంతమ్మగారి గదిలోకి వచ్చేసరికి శేఖరం అక్కడే వున్నాడు. మీరా ఇవతలకి రాబోతోంటే శాంతమ్మగారు అడిగింది "పూజ అయిందా మీరా!" అని. "అయిందమ్మా" అంది మెల్లగా.

"ప్రసాదం తీసుకురా" అంది.

'అరుణకంటే స్నేహితురాలు. అమ్మకి కూడా మీరా అంటే ప్రాణం. గంగులూ, అప్పి అందరూ చిన్నమ్మగారు చిన్నమ్మగారంటూ మీరాని అభిమానిస్తారు—అందరితో ఇంత తలలో నాలికలా అయిపోయిన మీరా తనని చాలా చెడ్డవాడిని చేసేసింది....'

"చినబాబూ! ప్రసాదం తీసుకో!" తల్లి హెచ్చరికతో ఉలికిపడ్డాడు శేఖరం.

మీరా స్టూలుమీద పెట్టబోయింది. అతను చేయిపట్టడం మూలాన చేతికివ్వక తప్పలేదు.

ఒకరోజు మీరా యిచ్చిన ప్రసాదం అరుణ ఇస్తే తను డ్రాయరు సొరుగులో పడేయడం గుర్తుకొచ్చిందతనికి. ఏదేనా—అతిచిన్నదయినా—పెద్దదయినా—అది తెలిసిచేసినా—తెలియక పొరపాటున జరిగినా—శిక్ష అనుభవించక తప్పదు. ఆ నాడు మీరా ఇచ్చినదని అసహ్యించుకుని పడేశాడు. ఇప్పుడు మీరా స్వయంగా యిస్తే తను చాలా భక్తిగా తీసుకున్నాడు. ఆ నాడు మీరా యిచ్చినదని అసహ్యించుకున్నట్లు—యిప్పుడు తనకివ్వడానికి మీరాకి అలాగే వుండివుంటుంది.

"టైము ఎంతయింది?" శాంతమ్మగారు అడిగింది.

వాచీ చూసుకుని చెప్పేడు "పన్నెండు అవుతోంది."

"నువు భోజనం చేసేయి. మీరా వెళ్తుంది" అందావిడ.

"నువు చేయవా?"

"ఈ పూటకి జావ తాగుతాను. వెళ్ళు పొద్దుపోతోంది."

"తర్వాత తింటాలేమ్మా! అవిణ్ని వెళ్ళిపోమను."

"అ! రాత్రి తిన్నావుగా! గిన్నెలో అన్నం అలాగే వుందట."

"ఎవరు చెప్పేరు?" ఆశ్చర్యంగా-కొంచెం కుతూహలంగా అడిగాడు. "మీరా చెప్పిందా?" అనుకుంటూ.

"అప్పి చెప్పింది 'రాత్రి చినబాబుగారు అన్నం తినలేదమ్మా' అంటూ. నువు పెట్టుకుని అసలే తినవు," కొడుకు మీరా పెడ్తే మొహమాట పడ్తున్నాడనుకుని, "పోనీ నేను వచ్చి అక్కడ కూర్చోనా?" అని అడిగింది.

"నువ్వా! ఓపలేదానివే—అంత నీరసంగా లేవలేకుండా వుండి."

"రాత్రి కూడా సరిగా చేయలేదు. పెట్టమని చెప్పనా?"

"నువు ముందు జావతాగు—అన్నీ టేబుల్‌మీద సర్ది వెళ్ళమను. నాకు ఆకలి వేసినప్పుడు తింటాను" అన్నాడు.

తనకి అలా వడ్డించడం మీరాకి యిష్టం వుండదనే—ఇష్టం లేనిపని చేయించి మీరాకి కష్టం కలిగించడం అతనికి యిష్టంలేదు.

"అ, నువు పెట్టుకు తింటావు. లే, నేనూ వస్తాను. అప్పిచేత టీ తెప్పించుకున్నావుటగా! నాతో చెప్తే పెట్టించనూ? నాకేమిటో మగతగా నిద్రపట్టేసింది" అంటూ లేవబోయింది.

శేఖరం వారించి తల్లిని లేవనీయలేదు. అప్పిని పిల్చేడు.

"ఏంటి బాబూ!" అంటూ వచ్చిందది.

"నా మీద అమ్మకి నేరాలు చెప్తున్నావటగా!" సీరియస్‌గా ముఖంపెట్టి అడిగాడు.

"నేనాండీ! ఏం చెప్పేనండీ!" తెల్లబోయిందది.

"ఉత్తదే, ఊరికే అంటున్నాడు" అంది శాంతమ్మగారు.

"వెళ్ళు! వెళ్ళి అమ్మకి జావ తీసుకురమ్మని చెప్పు!" అన్నాడు నవ్వుతూ.

శేఖరం మీరాని మాటిమాటికీ మాట్లాడిస్తే తను కావాలని పని వున్నట్లుగా మాట్లాడిస్తున్నాడని మీరా ఎక్కడనుకుంటుందోనని అప్పిచేత హోటల్‌నించి తెప్పించుకున్నాడు టీ. అది ఏమంత మంచి హోటల్‌కాదు. బస్టాండు దగ్గర హోటలంటే కాస్త ఫరవాలేదు. తీరా తెప్పించుకున్నాడేగాని తాగలేక పారబోశాడు.

మీరా జావ తీసుకొచ్చింది. శాంతమ్మగారు జావ తాగేవరకూ గుమ్మం ఇవతల నిలబడింది. ఆవిడ తాగగానే అవి తీయడానికి లోపలకొచ్చింది.

"అవి అప్పి తీస్తుందిలే! నువు అబ్బాయికి అన్నంపెట్టు" అంది శాంతమ్మగారు. శేఖరం ఏదో అనబోయాడు. "పన్నెండున్నర అయింది. ఇంకెప్పుడు తింటావ్! వెళ్ళి తినిరా" అంది.

మీరా వడ్డించి—కొద్దికొద్దిగా అన్నీ వేరే చిన్నచిన్న గిన్నెల్లోకి తీసి పక్కన ఉంచింది. నెయ్యి కరగబెట్టి పక్కన పెట్టింది.

అయిదు నిముషాలయింది—శేఖరం రాలేదు. వెళ్ళి శాంతమ్మగారికి చెప్దామని గుమ్మం వరకూ వెళ్ళింది. అప్పుడే శేఖరం వస్తున్నాడు.

మీరా వంటగదిలోకి వెళ్ళిపోయింది.

శేఖరం కూర కలుపుకున్నాక మారువేద్దామని వెళ్ళింది.

"నేను వేసుకుంటాను—ఇక్కడే వున్నాయిగా!" అన్నాడు.

మీరా వచ్చేద్దామని యిటు తిరగబోతోంటే అతను అడిగాడు. "మీ అమ్మగారికి ఏమిటి సుస్తీ?" అని. మీరా జవాబు చెప్పలేదు. వంటగదిలోకి వచ్చేసింది.

ఇంక శేఖరం ఏమీ అడగలేదు. (సశేషం)

బోనస్

శశిశ్వర్

చదువుతున్న పత్రికను విసిరికొట్టేడు ఆనందరావు.

"ఏమిటి....ఈ పత్రికలు ఇలా తయారవుతున్నాయి. కథల్లో విపరీతమైన శృంగార వర్ణనలు. ప్రజలను తప్పుదారి పట్టించే రాజకీయ వ్యాఖ్యలు. అసభ్యమైన సినిమాఫొటోలు.... ఈ పత్రికలు యిలా వస్తూవుంటే దేశం ఏమయ్యేట్టు" అని తనలో తను వాపోయాడు.

తనకోసం టీ తీసుకువచ్చిన జానకితో ఆ విషయమే చెప్పాడు ఆనందరావు.

"ఆ....మీదంతా చాదస్తం....అన్ని వార పత్రికల్లోకి యెక్కువ అమ్ముడుపోయేది ఇదే.. బాగోలేకపోతే, అందరూ ఎందుకు కొంటారు? ఐనా మీ కథలు యీ పత్రికలో చాలాసార్లు పడ్డాయి కదా....మీ కెందుకు ఆ పత్రికమీద అంత కోపం...." అన్నది జానకి.

ఆమె మాటలకు విస్తుపోయాడు ఆనందరావు. ఆమెతో యీ విషయం మాట్లాడడం అనవసరమనిపించి వూరుకున్నాడు.

పడగదిలోని పడక్కుర్చీలోంచి లేచి, బాల్కనీ దగ్గరకు వచ్చాడు. జానకి కూడా బాల్కనీ దగ్గరకు వచ్చి, కింద ఆడుకుంటున్న ముగ్గురు పిల్లల్ని టీకి పిలిచింది.

ఆ మేడకు ఎదురుగా వున్న గోడమీద కొత్త సినిమాపోస్టరు అంటిస్తూంటే, పిల్లలు చుట్టూ గుమికూడి చూస్తున్నారు.

అర్ధనగ్నంగా, గాలిలోకి ఎగురుతున్నట్లు, జనాన్ని వెక్కిరిస్తున్నట్లున్న అమ్మాయి బొమ్మ అది! ఆనందరావు బరువుగా నిట్టూర్చాడు.

దేశంలో ఏదీ సజావుగా జరగడంలేదన్న ఆలోచనలతోనే-ఆ ఆదివారం - ఆనందరావుకు వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయింది.

గ గ గ

మర్నాడు....

ఆనందరావు కలలో కూడా ఊహించని పరిణామాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఆఫీసు కాంపౌండ్‌లోకి అడుగు పెడుతుండగానే, కంపెనీని మూసివేయబోతున్నట్లు కొందరు అనుకుంటూ వుండడం విన్నాడు. ఐతే-ఆ సంగతి నమ్మడానికి అతని మనసు అంగీకరించలేదు.

ఆ మధ్యాహ్నం మేనేజింగ్ పార్ట్‌నర్ ఉద్యోగులందరినీ తన 'ఏర్ కండిషను' గదికి ఆహ్వానించి-'చావు కబురు' చల్లగా చెప్పాడు. తమ కంపెనీ యింతవరకు కొనుగోలు చేసి, విక్రయిస్తున్న సరకులపైగల 'లైసెన్సు'ను ప్రభుత్వం రద్దుచేసిందని, అంచేత కంపెనీని మూసివేయవలసి వస్తోందని, అందరికి రూల్సు ప్రకారం—ఇవ్వవలసినదంతా యిచ్చేస్తామనీ-ప్రకటించాడు.

ఆనందరావుకు—ఉన్నట్టుండి తనను ఓ అగాధంలోకి తోసేసినట్లయింది. మరు క్షణం —అప్పులవాళ్ళు, ఇల్లు గడిచే విధానం, పిల్లల భవిష్యత్తు—ఈ మూడు ప్రశ్నలు అతని ముందు పెనుభూతాల్లా నిలిచాయి.

ఆ సాయంత్రమే—కంపెనీవారు ముట్టజెప్పిన—మూడు వేల, ఐదువందల రూపాయల బరువుతో—బరువెక్కిన హృదయంతో—



ఇంటికి చేరుకున్నాడు ఆనందరావు.

అప్పటికే అతనికోసం ఎదురు చూస్తూ— వరండాలో కూర్చునివున్నారు ముగ్గురు అప్పుల వాళ్ళు.

"వాళ్ళ భయం వాళ్ళది .... ఉద్యోగం పోయాక, అప్పటికప్పుడు అప్పులు వసూలు చేసుకోవడం మంచిదని అనుకొని వుంటారు!"

ఆనందరావు విషాదంగా నవ్వుకొని, వాళ్ళ లెక్కలు చూసి, రెండువేల రూపాయల పైచిలుకు అప్పు—తీర్చేశాడు.

అంత డబ్బును భర్త ఒక్కసారిగా వాళ్ళకు యిచ్చేస్తుంటే—ఆశ్చర్యంతో అలా చూస్తూ వుండిపోయింది జానకి—'ఒకవేళ ఏదైనా 'లాటరీ' తగిలిందేమో'— అనుకుంటూ.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత, ఆ సంగతే ఉత్సాహంగా అడిగింది.

ఆనందరావు అసలు విషయం చెప్పగానే —ఆమె గుండె గుభేలుమంది. భర్త'మూడ్' చూసి, ఆ సమయంలో ఇంకేమీ మాట్లాడడానికి సాహసించలేకపోయింది.

గ గ గ

"జానకీ....భోజనాలయ్యాయా? మీ ఆయనగారు యేం చేస్తున్నారు?"—పక్క 'ఫ్లాట్' ఆవిడ గొంతు....

"ఆ....ఏం చేస్తారు....నిద్రపోతున్నారు.... అంతకు మించిన పనేమీ లేదుగా...."

"ఆ....ఇదిగో....ఈ నెక్లెస్ చూశావా.... మా ఆయన పాతది అమ్మేసి, పన్నెండు వందలు ఖర్చుపెట్టి, యిది చేయించారు...."

"అలాగా....బావుంది....'డిజైను' కూడా చాలా కొత్త రకంగా వుంది...."

"మా ఆయన సెలక్షన్ మరి....ఆయన ఇలాంటి విషయాల్లో భలే లౌక్యుడు. చేసేది కార్పొరేషను బిల్లు కలెక్టరు ఉద్యోగం అయినా పై డబ్బులు భలే తెలివిగా సంపాయిస్తారు.... అవునూ....మీ ఆయనదీ 'పర్చేజ్ డిపార్ట్

మెంట్'లో చాలా ముఖ్యమైన ఉద్యోగమే కదా ....కంపెనీ మూసేస్తే మూసేశారు....ఆయన ఏమైనా పై డబ్బులు వెనకేశారా?"

"అయ్యో .... అంత తెలివి కూడానా.... ఎంతసేపు ఆదర్శాలు వల్లించడంతోనే ఆయనకు సరిపోతుంది...."

అంతసేపు నిద్రపట్టక—అటు ఇటు దొర్లుతున్న ఆనందరావు—ఆ పైన జానకి మాటలు వినలేకపోయాడు.

తనను, తన ఆదర్శాలను మెచ్చుకొని, ప్రేమించి, పెళ్ళి చేసుకున్న జానకి....ఇప్పుడిలా మాట్లాడుతోంది!

గబ గబా—బట్టలు వేసుకుని, ఇంట్లోంచి బయటపడ్డాడు!

ర ర ర

ఆ పత్రిక—ఎడిటోరియల్ కార్యాలయం —పూర్తిగా 'ఏర్ కండిషన్డు' చెయ్యబడి వుంది! 'విజిటర్స్ రూమ్'లో ఆనందరావు ఒక్కడే కూర్చున్నాడు.


"ఆ వెధవ వుద్యోగం పోతే పోయింది. ఈ పత్రిక ఆఫీసులో అసిస్టెంట్ ఎడిటర్ ఉద్యోగం దొరికితే బావుణ్ను....తనకు నచ్చిన ఉద్యోగం....తన అభిరుచులకు అనుగుణంగా దేశానికి ఉపయోగపడే పని కొంతైనా చేయడానికి అవకాశం వుంటుంది...." రక రకాల ఆలోచనలతో-ఎడిటర్ రామనాథం పిలుపు కోసం ఎదురుచూడసాగాడు.

ఓ అరగంట తర్వాత—పిలుపు వచ్చింది. ఎడిటర్‌గారి గది మరింత చల్లగా వుంది. ఆయనకు నలభై ఐదేళ్ళ వయసు వుంటుందేమో. కాళ్ళజోడులోంచి—ఓరగా ఆనందరావువైపు చూసి, నమస్కారానికి—ప్రతినమస్కారం చేసి, కూర్చోమన్నాడు.

"చూడండి .... మిస్టర్ ఆనందరావ్.... మీకు ఉద్యోగం యిస్తే—అసిస్టెంట్ ఎడిటర్‌గా మీరు కొన్ని ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించవలసి వుంటుంది. పత్రిక సర్క్యులేషన్ పెరగడానికి మీరు చాలా కృషి చేయవలసి వుంటుంది. మా పత్రికను మీరు చూస్తూనే ఉన్నారుగా....మీ కథలు కొన్నిటిని మేము ప్రచురించాము కూడా....ఐతే రచయితకు, జర్నలిస్టుకు బాధ్యత విషయంలో కొన్ని తేడాలు వుంటాయి. ఆ సంగతి మీకు తెలిసే వుంటుంది....మీకు అవకాశం యిస్తే—పత్రికను అభివృద్ధి చేయడానికి మీరు యేం చేస్తారు?" అంతసేపు మాట్లాడినందుకు అలిసిపోయినట్లుగా, మంచినీళ్ళు తాగి, సిగరెట్ వెలిగించాడు రామనాథం.

ఆనందరావుకు ఎక్కడలేని ఉత్సాహం, ఆవేశం వచ్చాయి. తన ఆశయాలన్నిటినీ—క్లుప్తంగా వివరించాడు. ఆనందరావు చెప్పినదంతా విని, రామనాథం చిరునవ్వు నవ్వాడు.

"వెల్....వ్యక్తిగతంగా మీకున్న అభిరుచులు చెప్పారు. పర్సనల్‌గా నేను మిమ్మల్ని మెచ్చుకోగలను. కానీ, ఇది మన సంస్థ నిర్వహిస్తున్న పత్రిక. ప్రొప్రయిటరుగారు భారీగా పెట్టుబడిపెట్టి, కొన్ని ప్రయోజనాలకోసం—ఈ పత్రికను నడుపుతున్నారు. అంచేత—వారి ఉద్దేశాలకు తగినట్లుగానే మనం వ్యవహరించాలి. ఉదాహరణకు మన బాసానుబాసుడు ఒక పార్టీకి మద్దతు యిస్తే, అప్పుడు ఆ పార్టీకి అనుకూలంగానే, మనం అన్ని విషయాలు ప్రచురించాలి. ఒకవేళ ఆయన తన వుద్దేశాన్ని మార్చుకుని, మరో పార్టీకి మద్దతు యివ్వడం ఆరంభిస్తే—వెంటనే మనమూ పద్ధతిని మార్చుకోవాలి. పత్రిక అమ్మకాలు పెరగాలంటే కొన్ని కిటుకులున్నాయి. ఉదాహరణకు అప్పుడప్పుడు మనమే కొన్ని రచనలుచేస్తూ అక్కడక్కడా సెక్సు గుప్పించాలి. లేదా అలా రాసే రచయిత్రిని కాని, రచయితని గాని పట్టుకుని వాళ్ళకు ఎంతయినా పారితోషికం యిచ్చి, మాంచి మసాలా రచనను — సీరియల్‌గా ప్రారంభించాలి. మనకు యెలాంటి పోజులు కావలిస్తే అలాంటి పోజులు యిచ్చి, ఫొటోలు తీయించుకునే సినిమా అమ్మాయిలు బోలెడుమంది వున్నారు. వాళ్ళ బొమ్మలు అప్పుడప్పుడు



వేస్తూవుండాలి....ఇవన్నీ చేస్తుంటేనే అమ్మకాలు పెరుగుతాయి. మీరు బాగా రాస్తారని నాకు తెలుసు. అంచేత—మీ దరఖాస్తుకు యెక్కువ ప్రాధాన్యం చూపాను. మీరు ఈ పద్ధతులకు 'ఎడ్జస్టు' కాగలిగితే, వచ్చే నెల మొదటి తేదీనుంచి—ఉద్యోగంలోకి 'జాయిన్' కావచ్చు. ఏ సంగతీ మీరు ఓ వారం రోజుల్లో చెప్పండి!" అన్నాడు-రామనాథం-ఏదో 'ఫైల్' తిరగేస్తూ.

ఆనందరావు-ఆయనవైపు అదోలా చూసి సెలవు తీసుకుని, విజిటర్స్ రూమ్‌లోకి వచ్చి కూర్చున్నాడు. ఆ క్షణంలో ఎన్నెన్నో ప్రశ్నలు—అతన్ని చుట్టుముట్టి, బుర్రను వేడెక్కించాయి. కాని, ఆ గదిలోని చల్లదనం—అతన్ని మత్తులా ఆవరించింది. వెంటనే ఆ గదిని వదిలిపెట్టాలని అతనికి అనిపించలేదు!

పని అయిపోగానే వెళ్ళిపోకుండా, మళ్ళీ అక్కడికే వచ్చి కూర్చున్న ఆనందరావును ఆ ఆఫీసు ప్యూన్ వింతగా చూశాడు!

ర ర ర

"మిస్టర్ ఆనందరావ్ .... వచ్చిన ఒక్క సంవత్సరంలోనే మంచి రిజల్టు చూపించావ్... మన బాసానుబాసుడు చాలా సంతోషించాడు. నీకు మంచి 'ఇంక్రిమెంటు' కూడా వస్తుందిలే, ఊ....మరో పెగ్గు లాగించు...." ఆనందరావు వద్దంటున్నా విస్కీని గ్లాసులోకి వంపాడు రామనాథం.

"చూడు....ఆనందరావ్....జీవితంలో ఒకోసారి మనం రాజీ పడకలేకపోతే — మనకు యెవరూ విలువ యివ్వరు....చూడు మనకు 'బాసు' ఎలాంటి ట్రీట్‌మెంట్ యిస్తున్నాడో.. ఈరోజు 'బాసు' పుట్టినరోజు పార్టీకి మన ఆఫీసులో యెవరినైనా పిలిచాడా....మనల్ని మాత్రం ఆహ్వానించాడు .... అదే మన ప్రెస్టేజ్...." మత్తులోవున్నా సరిగ్గా మాట్లాడడానికి ప్రయత్నించసాగాడు రామనాథం.

ఆనందరావు—చిప్స్ తింటూ, విస్కీ సిప్ చేస్తూ ఆయన మాటలు శ్రద్ధగా వింటున్నాడు. లోలోపల ఏదో మేఘాలలో తేలుతున్నట్లుగా వుంది—అతని పరిస్థితి!

"మే ఐ హెల్ప్ యు—" రాకెట్‌లా వచ్చింది బాస్‌కు పెర్సనల్ సెక్రటరీ అయిన లిల్లీ. జవాబుకోసం ఎదురుచూడకుండా, విస్కీని గ్లాసుల్లోకి వంచసాగింది.

ఆమె వంపులు ఆ ఇద్దరి మెడలనూ వంచాయి.

"హెల్ప్ మిస్టర్ ఆనందరావ్" అని మెల్లగా కన్ను గీటాడు రామనాధం.

లిల్లీ నవ్వుతూ ఆనందరావువైపు చూసి నవ్వింది. "డోంట్ వర్రీ.... మిమ్మల్ని నేను మీ యింట్లో 'డ్రాప్' చేస్తాను....కారీ....ఆన్" అతని పక్కకు వచ్చి కూర్చుంది.

గుప్పుమన్న విదేశీ సెంటు పరిమళం— అతన్ని ఒక్కసారి కౌగలించుకుని, ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆనందరావుకు స్వర్గంలో వున్నట్లనిపించింది.

* * *

కారు వెనకసీట్లో- ఒళ్ళో పడుకున్న ఆనందరావు తన యిల్లు తొందరగా రాకుండా వుంటే బాగుండునని కోరుకోసాగాడు. లిలీ అతని పెదాలకు అద్దుకున్న లిప్‌స్టిక్ - జేబు రుమాలుతో తుడవడంలో నిమగ్నురాలయింది.

ఆ అర్ధరాత్రి-పడకగదిలో - తన పక్కనే పడుకునివున్న జానకిని మత్తుగా చూశాడు ఆనందరావు. నిద్రలో ఆమె నవ్వుకుంటూ వుంది .... బహుశా రేపు పక్కింటావిడకు చూపించబోయే-తన కొత్త నెక్లెస్ గురించి తలచుకుని వుంటుంది.

ఆనందరావుకు ఉన్నట్టుండి ఏడుపొచ్చింది. ఏడుస్తూనే-నిద్రపోయాడు.

* * *

ఆనందరావు పుణ్యాన కొత్త రంగులు సంతరించుకుంటూ-పాఠకులను వెర్రెక్కిస్తోన్న ఆ వార పత్రికను కోపంతో విసిరికొట్టాడు ఆ యువకుడు. కాస్సేపాగి, ఆ పత్రికను ముక్కలు ముక్కలుగా చింపి, అగ్గిపుల్ల వెలిగించి, తగలబెట్టాడు.

"అంతా మోసం....దగా....అన్నీ అబద్ధపు రాతలు....ప్రజల బలహీనతతో ఈ పత్రికల వాళ్ళు ఆడుకుంటున్నారు," ఆవేశంతో అతను అగ్నిపర్వతమే అయ్యాడు.

ఒక్క పుస్తకాన్నయితే, తను తగులబెట్టగలిగాడు....కాని ఇలాంటి పత్రికలు వేల సంఖ్యలో, పఠితల మస్తిష్కాలలో మత్తుమందును ఎక్కిస్తూ, ఎందరినో నిర్వీర్యులుగా చేస్తున్నాయి. వాళ్ళలో యెవరివల్లనైనా, ఏ కొద్దిమందికైనా హాని జరగవచ్చు. ఈ ప్రమాదం జరగకుండా వుండాలంటే, యేం చేయాలి?

చెయ్యాలి....ఏదో చెయ్యాలి....

ఉద్వేగంతో - తన గదికి తాళం వేసుకుని, బయలుదేరాడు.


అతను విద్యాధికుడు....నిరుద్యోగి....ఆలోచనలు....ఆవేశం....ఆదర్శభావాలూ వున్న యువకుడు.

అతను ఏం చేస్తాడు?

ఏమో....

చుట్టూ యెన్నో బోన్లు వున్నాయి....అతను ఏ బోనులో పడతాడో....లేక .... బోనులలో పడ్డవాళ్ళను కాపాడతాడో....చూడాలి. □

జ్యోతి నవలల పోటీలో
రెండవ బహుమతి పొందిన నవల
'ఆకాశానికి అటూ ఇటూ'
వచ్చే సంచిక నవలానుబంధంలో చదవండి !





అల్లావుద్దీన్ అభినవ దీపం

వాస్‌బాబు

అల్లావుద్దీన్ జ్వరం

అల్లావుద్దీన్ అదేపనిగా బల్బును రుద్దుతూ వుంటే మజ్జు ప్రత్యక్షమై—

"ఏం ముంచుకొచ్చిందని అలా తోమేస్తున్నావ్?" అడిగాడు. అందుకు అల్లావుద్దీన్ బుంగమూతిపెట్టి—

"మజ్జూ, రాత్రి నాకు జ్వరం తగిలింది. చాలా నీరసంగా వుంది. నాలుకంతా చేదయిపోయింది. ఏదన్నా ఆస్పత్రికి తీసుకెళ్ళి మందిప్పించు." అన్నాడు అల్లావుద్దీన్.

"జ్వరాలు, జబ్బులు తగలడానికి వీల్లేదయ్యా. ఇక్కడి ఆస్పత్రుల సంగతి నీకు తెలియదు," విసుక్కుంటూ అన్నాడు.

"అదేంటి మజ్జూ. అంత పెద్ద పెద్ద బిల్డింగులు కట్టారు కదా ఆస్పత్రులని....నాకు మందు దొరకదంటావేం?"

"అసలు సంగతి నీకు సరిగా తెలియదు కాబోలు! చూడు—ఇక్కడి బిల్డింగులు వేరు అందులో పనిజేసేవాళ్ళు వేరు. మనుషులకొచ్చే రోగాలు వేరు, వాళ్ళకిచ్చే మందులు వేరు. ఇందులోవున్న తిరకాసు నీ కర్థంకావాలంటే నీకు బోలెడంత చదువు చెప్పాలి! బిల్డింగుల భ్రమలో పడమాక." పోజుపెట్టి మజ్జూ ఉపన్యాసం దంచేస్తుంటే అల్లావుద్దీన్‌కి కోపం వచ్చింది.

"మజ్జూ. నాకు రోగమొచ్చి నే నేడుస్తుంటే నీ ఉపన్యాసమేంటి? నన్ను ఆస్పత్రిలోకి అర్జంటుగా తీసుకెళ్ళు—" ఆజ్ఞాపించాడు.


"అర్జంటుగా వచ్చే వాళ్ళందర్నీ ఎమర్జెన్సీ కేసులు అంటారు. పద. నీ కేసు అలాంటిదేమో చూద్దాం!"

అల్లావుద్దీన్‌కి ఆ మాటలు వెంటనే అర్థం కాలేదు. మజ్జూ వెనకాలే నడుస్తూ ఆస్పత్రిలో అడుగుపెట్టాడు. ఎదురుగా "విచారణ" బోర్డు కనిపిస్తే అక్కడకు వెళ్ళారు.

"ఇదేవిటి మజ్జూ....విచారణ అని వుందేవిటి? ఇక్కడికొచ్చిన వాళ్ళంతా విచారిస్తూ కూర్చోవాలా?" అల్లావుద్దీన్ అడిగాడు.

"అబ్బే అదికాదు; కొంత విచారం, మిగిలింది, విషాదం! ఆస్పత్రి అంటే రోగ నిలయం అని అర్థం. రోగ నిలయంలో విచారం కాక, ఉల్లాసముంటుందా సారూ! పద....ఆ విచారం దగ్గరకెళ్దాం" మజ్జూ దారి తీశాడు. అల్లావుద్దీన్ అతని వెనకాలే వెళ్ళాడు.

విచార బోనులో కునుకేస్తున్న గుమస్తా దగ్గరకెళ్ళి-సార్-సార్-గురో-అని మజ్జుకేకలు వేస్తే, అతను లేచి-చేతులు పైకెత్తి మూతి



ముందుకుపెట్టి ఆవులించి, ఏం కావాలి? అన్నట్టు కనుబొమ ఎగరవేశాడు.

"చూడు సార్. ఈయన మహావీర అల్లావుద్దీన్. జ్వరం తగిలింది. ఇక్కడ జ్వరం వార్డు ఎక్కడ? మందువార్డు యెక్కడ? యెటు వెళ్ళమంటారు మమ్మల్ని?" మజ్జు చాలా వినయంగా అడిగాడు. గుమస్తా ఇద్దర్నీ యెగాదిగా చూసి-ఒక్క పొడిదగ్గు దగ్గి—

"నేరుగా వెళ్ళి యెడమకు తిరిగి ముందుకెళ్ళి, కుడిపైపురు తిరిగితే ఇవతలపక్క కనిపించేదే జ్వరం వార్డు. ప్రతి వార్డులో డాక్టర్లకు కుర్చీలు, బల్లలూ వుంటాయికాని—అసలు డాక్టరు వార్డు క్యాంటీన్‌కు వెనుక, హాస్టల్‌కు ముందూ వుంటుంది. మందు వార్డు "సి" బ్లాకులో రెండో రోలో వుంటుంది. అయితే మీరు వెళ్ళవలసింది తిన్నగ గేటు బయటకు" అన్నాడు గుక్క తిప్పుకుంటూ.

"ఆదేంటిసార్, ఇంత చెప్పి గేటు బయటకంటారు?" మజ్జు కంగారుగా అడిగాడు.

"ఎటు వెళ్ళాలి అని అడిగావు కదయ్యా. ఇదేదారి. గేటుదారి." అన్నాడు మళ్ళీఆవులిస్తూ.

"మరి మా మందు మాటేమిటి?" అల్లావుద్దీన్ అమాయకంగా అడిగాడు.

"పైకెళ్ళి దేవున్నడుగు. ఇక్కడ మందులూ లెవ్వు, డాక్టర్లూ లేరు. సమ్మె. అంతా సమ్మె చేస్తున్నారు. మీకు గేటే గతి-పొండి. పది నిమిషాలు నిద్ర పోనివ్వరుగా" విసుక్కున్నాడు.

మజ్జూ నిక్కుతూ-

"సార్, చిన్న సందేహం, ఏవీ లేదు. మందూలేదు మాకూ లేదు అంటున్నారు.... మరి మీరిలా నిద్రపోవడానికి స్లీపింగ్ పిల్స్

యెవరిచ్చారు సార్-" అని గునగునామంటూ గేటుకేసి పరిగెత్తాడు. కాసేపు బిత్తపోయినట్టు చూసి అల్లావుద్దీన్ కూడ దౌడు లంకించుకున్నాడు గేటుకేసి.

గేట్లు బయట మజ్జూను కలుసుకొని

"ఏంటి మజ్జూ అందరితో గిల్లికజ్జాలు పెట్టుకుంటావు? నీ వెనకాతల పురకలేక చస్తున్నా" రొప్పుతూ అన్నాడు అల్లావుద్దీన్.

"ఉరికి చచ్చినా పర్వాలేదుగాని రోగంతో చావమాక. ఈ దేశంలో మందులూ లెవ్వు డాక్టర్లూ లేరు."

"మరెట్లా మజ్జూ జబ్బు పోయేది?"

"అదే చెప్పేది. అసలు రోగాలు రాడానికి వీల్లేదు. అదంతే. సమ్మె అని చెప్పలే. మూడు నెల్లు యే డాక్టరూ మందూ లేకుండా బతకలే? రోగాలు పేషంట్లతో యెంచక్కా కో ఆపరేటు చేశాయని! డాక్టర్ల సమ్మె అని తెలియగానే రోగాలు అలా సరుకుపోలే? నీ కసలు తెలియదు కాని అల్లావుద్దీన్ డాక్టర్లు ఓపికచేస ఒక్క సంవత్సరంపాటు సమ్మె చేస్తే చాలా రోగాలు రాకుండానే పోతాయి." అని కిలకిలా నవ్వాడు అల్లావుద్దీన్ ముఖం చిట్లించి.

"ఏవిటి మజ్జూ ఆ నవ్వు వికారంగా-సంగతేవిటో చెప్పకుండా చేతులెగరేస్తే సరి పోయిందా?" అడిగాడు.

"అదే-మనకు రోగాలు రాకపోతే వైద్యం సిబ్బందికి, బతుకులేక రోగంతో-" మళ్ళీ నవ్వాడు.

"ఆపు నీ నవ్వు. నా జ్వరానికి అర్జంటుగా మందు కావాలి. మాయాబలంతో మందు రప్పించు" ఆజ్ఞాపించాడు అల్లావుద్దీన్.

"చెప్పాగా-మాయచేసి మందు తెచ్చేదాని కన్నా నీ రోగాన్నే నయం చేస్తే పోలే. మాయలు పారడంలేదు. వుండు-అదృష్టం! సైకిలొస్తోంది!" మజ్జు కళ్ళు తళుక్కుమన్నాయి.

"సైకిలా? అదృష్టమా? దాన్ని మింగితే జ్వరం పోతుందా!" ఆశ్చర్యంలోనుంచి తేరుకునే లోగా సైకిల్ రానే వచ్చింది. మజ్జూ దాన్ని ఆపు చేశాడు. సైకిల్ వెనకాల కేరియర్ మీద కాస్త పొడుగ్గా సొరకాయలావున్న ముతక సంచి ఒకటుంది. సైకిలు సీటుమీద ఏమి చెయ్యడానికయినా సిద్ధంగా వున్నట్టున్న శాల్తీ ఒకటుంది. దీనికడ్డంగా మజ్జూ వెళ్ళి-"సైకిలా పండి భిషగ్వరా! అల్లావుద్దీన్ నాటుధేయుడితడు. నాటుమందుగ్గాని లొంగని రోగానికితడు తగిలాడు. సువర్ణలేహ్య చింతామణీ చిట్కాలో, గులేబకావళీ గుళికలో ప్రసాదించి రుగ్మతను రూపు మాపుడు!" వినయం వుట్టిపడుతూ పలికాడు. అబ్బ! మజ్జూకి యెన్ని మాటలు తేలుసో-అనుకున్నాడు అల్లావుద్దీన్.

ఇంతలో వైద్యశిఖామణి తేరుకుని, సైకిలుమీదనుంచి దిగి ఫ్రెంచికట్ మీసాల్ని దగ్గరకు వత్తుకుని, సైకిలు కట్టు పంచెను రెండంగుళాలు వదులుచేసి, గొంతుకు సవరించుకుని, "అబ్బాయి మరుగుజ్జూ అల్లావుద్దీనా నీ పేరు?" అని అడిగాడు.

పకపక మంటూ అసలు అల్లావుద్దీన్ నవ్వుతూ వుంటే - పాపం మజ్జు ముఖం గుళికంతయింది.

"పేర్లో యేముందిలే. ఏదీ చెయ్యిటివ్వు-" అని మజ్జూ చెయ్యిని లాక్కుని, చేతివేళ్ళను పటిక్ పటిక్‌మని విరిచి, మణికట్టు దగ్గర నాడి పట్టుకుని, కళ్ళు మూసుకుని మోర పైకెత్తాడు. అల్లావుద్దీన్‌కి నవ్వెక్కువైంది, మజ్జూకి కోపం ఎక్కువయింది. తనని మరుగుజ్జా అన్నందుకు మరీ మండిపడుతూ ఏమీ మాట్లాడకుండా చెయ్యిచ్చి - చిటపటమంటూ అలాగే వున్నాడు. అదంతా జ్వర తీవ్రత అనుకొన్నాడు పాపం వైద్యశ్రేష్ఠుడు. క్షణం గడిచాక—

"చూడు మరుగుజ్జబ్బాయి. నాడీ కప్పలాగా దూకుతోంది. కాని కంగారుపడమాక. నారసింహ లేహ్యం అని ఒకటుంది...." మజ్జూకి ఒళ్ళుమంటి. మధ్యలోనే అందుకుని-

"హిరణ్యకశిప ద్రావకం యేవీ లేదా?" అని అడిగాడు.

వైద్యశిఖామణి తెల్లబోయాడు. మజ్జూ చెయ్యి లాక్కున్నాడు.

"హిరణ్యకశిప ద్రావకమా? ఆ పేరు యెక్కడా ఆయుర్వేదంలో వినపడలేదే?"

"ఓహో. దీనిక్కూడా వేదాన్ని జోడించారా? మరణవేదంలో వుంటుందేమో వెదికి చూడలేకపోయారా!" మజ్జూ అడిగాడు.

"ఆగబ్బాయి. గట్టి పిండంలా వున్నావు. గైడుచూసి చెప్తా" అని సొరకాయ సంచిలోంచి తలగడంత పుస్తకాన్ని బయటకులాగి—

"నేనేది చేసినా గైడు ప్రకారమే చేస్తాను. ఏం, ఇంతలా వుందేమని తెల్లబోతున్నావా! ఇదేవిటనుకున్నావ్...."

"చిత్రగుప్తుడి డైరీలా వుంది. నీ నంబరొచ్చిందా యేం?" ఆ నాటువైద్యుడి తలమీద నాటు బాంబులా పడ్డాయా మాటలు. దాంతో ఆయన ముఖం లేహ్యంలా మారింది.

"వచ్చే వుంటుంది. లేకపోతే నాతో చెయ్యి కలపవు! చూడు రోగమొచ్చింది మా అల్లావుద్దీన్ జీకి, నాక్కాదు. ఆ గైడేదో మేమే కొనుక్కుంటాం. అన్నిటికీ సర్వరోగ నివారిణి రాంబాణం ఏ బీ సీ డీల తెల్లబిళ్ళలేవో వున్నాయిగా. అవే మింగెదము. మీరిక దయచేయుడు. చిత్రగుప్తుడు పిలుస్తున్నాడు—" అంటూ ముందుకు వంగి చటుక్కున సైకిల్ పైరుకున్న వాల్ ట్యూబ్‌ను ఊడబెరికి గునగునమంటూ పరిగెత్తాడు. అటూ ఇటూ చూసి అల్లావుద్దీన్ మజ్జూ వెనకాలే లగెత్తాడు.

చాలా దూరం వెళ్ళాక మజ్జు ఆగాడు. అల్లావుద్దీన్ కూడా అక్కడికి చేరుకున్నాడు. అయిదు నిమిషాలు కొలిమి తిత్తుల్లాగా రొప్పిం తర్వాత—

"మజ్జూ—వైద్యుడి సైకిలు చక్రం గాలెందుకు తీశావ్?" అల్లావుద్దీన్ ప్రశ్నించాడు.

లేకపోతే వాడు మనగాలి తీసేవాడు. ఒక జ్వరం స్పెషలిస్టువున్నాడు .... అక్కడికి?"

"వద్దు బాబోయ్. నాకు డాక్టర్లూ వద్దు—మందులూ వద్దు. అటు ఇటు పరుగెత్తలేక చస్తున్నా. మజ్జూ - ప్రమాణంచేసి చెప్తున్నా. ఈ దేశంలో వున్నంతకాలం ఇక జ్వరం తెచ్చుకోను. నిజం. నీ మీద ఒట్టు!" అని మజ్జూను ముట్టుకోగానే ఆంఫంట్ మని మజ్జు మాయమయ్యాడు.

ప్రేమిస్తే ఏమవుతుంది?

జి.ఎస్.సూరి

విజయవాడకు దగ్గర్లోనే ఉండటంచేత నాకు రామచంద్రమూర్తి గారింట్లోని పెళ్ళికి వెళ్ళటం తప్పనిసరైంది. పైగా వాళ్ళు రాజమండ్రీలో ఉండగా నాకు ఆ కుటుంబంతో ఎక్కువ సన్నిహితత్వం వుండేది. ముఖ్యంగా ఆయన భార్య రాజ్యలక్ష్మిగారికి నేనంటే అంతులేని అపేక్ష. నేనావిడ్ని "అక్కయ్యా" అని పిలుస్తూండేవాడ్ని.

పెళ్ళింట్లో అడుగు పెట్టగానే నాకు ఆదర పూర్వకమైన స్వాగతం లభించింది.

"రా....సూర్యం....రా....రా...." అంటూ రాజ్యలక్ష్మిగారు నవ్వుతూ ఎదురొచ్చారు. నా రాక ఆవిడకు ఆనందం కలిగించిందని స్పష్టంగా తెలుస్తోంది.

"మెత్తానికి జ్యోతి పెళ్ళికూతురైందన్న మాట!" అని "ఇంతకూ పెళ్ళికూతురేదీ?" అనడిగాను.

అంతలోకే రామచంద్రమూర్తి గారు రావటం నన్ను వాళ్ళిద్దరూ పెళ్ళికూతురు దగ్గరకు తీసుకొని వెళ్ళటం జరిగింది. ఒక గదిలో చాలా మంది ఆడవాళ్ళ మధ్యనున్న కూతుర్ని ఇవతలకు పిల్చారు రామచంద్రమూర్తి గారు.

"ఎవరో గుర్తుపట్టావా జ్యోతీ?....సూర్యం అంకుల్!" అన్నారాయన కూతురికి నన్ను చూపిస్తూ.

ఆ అమ్మాయి నావైపు తదేకంగా చూస్తూ జ్ఞప్తికి తెచ్చుకోటానికి ప్రయత్నించింది. నాకు తెలుసు జ్యోతికి నేను గుర్తుండనని. చాలా సంవత్సరాల క్రితం చూసింది. అప్పుడా అమ్మాయి వయసు ఎనిమిదేళ్ళుంటాయేమో!

"సారీ డాడీ.... ఐయామ్ అనేబుల్ టు రికలెక్ట్ హిమ్" అంది నొచ్చుకున్నట్లు మొహం పెట్టి తండ్రివైపు చూస్తూ జ్యోతి.

వెంటనే రాజ్యలక్ష్మిగారు "అదేమిటి జ్యోతీ! చిన్నప్పుడు నీకు కథలు చెప్పేవారూ .... ఆ అంకుల్" అన్నారు గుర్తుకు తేవటానికి ప్రయత్నిస్తూ.

జ్యోతి నా వైపు కనుబొమలు ముడిచి చూసింది.

ఆమె జ్ఞాపకాల తెరను కదల్చటానికి ప్రయత్నించింది. కాని ప్రయోజనం లేకపోయింది. ఆమె నిస్సహాయంగా తల్లితండ్రుల వైపు చూసింది.

నేను నవ్వేస్తూ—"అప్పటికి చాలా చిన్నపిల్ల కదూ?....మర్చిపోయుంటుంది లెండి" అన్నాను.

"ఆఁ....ఆఁ...."అంటూ మొహమాటంగా నవ్వేశారు వాళ్ళు కూడా. జ్యోతి మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయికి నేను కొంచెం కూడా గుర్తులేక పోవటం నాకు వింతగానే వుంది. ఎందుకంటే అప్పట్లో నేను రోజస్తమానూ వాళ్ళింట్లోనే గడిపేవాణ్ని.

అప్పటి జ్యోతికి ఇప్పటి జ్యోతికీ చాలా తేడా వుంది. చిన్న చిన్న ఫ్రాక్స్‌లో రబ్బరు బొమ్మలా వుండేది అప్పటి జ్యోతి. ఈ జ్యోతి పట్టుచీరలో పెళ్ళికూతురిగా రేఖా చిత్రంలా వుంది. నాకు మాత్రం కొన్ని క్షణాల క్రితం వరకూ చిన్నప్పటి జ్యోతే కళ్ళముందు వుండిపోయింది.

రామచంద్రమూర్తిగారు పనుందని చెప్పి ఇప్పుడే వస్తానంటూ వెళ్ళిపోయారు. రాజ్యలక్ష్మి గారు నన్ను వేరే గదిలోకి తీసుకుని వెళ్ళి టిఫిన్ అందిస్తూ-"కాఫీ పంపిస్తాను" అంటూ వెళ్ళారు.



నేను టిఫిన్ తినటం పూర్తిచేసి చేతులు కడుక్కొని ఆ ప్రక్కనే పెట్టెమీద పుస్తకం వుంటే చేతిలోకి తీసుకుని చూస్తూ కూర్చున్నాను.

"కాఫీ తీసుకుంటారా?" - ఎవరిదో కంఠం వినిపించి తలెత్తాను.

ఒక్కమాటు తృళ్లి పడినట్లయ్యాను. నా మనసులో ఏదో ఉద్వేగం....ఏదో ఆవేదన.... ఎన్నో రకాల అనుభూతులూ—జ్ఞాపకాలు ఉప్పెనగా విరుచుకుపడి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఎదురుగా కిరణ్మయి నిలబడి వుంది.

ఒకప్పుడూ ....ఇప్పుడూ .... ఇంకెప్పుడూ నేను అత్యధికంగా ప్రేమించే ప్రేమదేవత. ఏ క్రూరదైవమో కసికట్టి-పగబట్టి నానుంచి వేరు చేసిన నా ప్రియసఖి.

ఎన్నాళ్ళకూ—యెన్నేళ్ళకూ!

నా హృదయం మూగవోయింది.

అన్నేళ్ళ తర్వాత చూడటం జరుగుతోందేమో .... ఏం మాట్లాడాలో యెలా మాట్లాడాలో కూడా తెలియటం లేదు.

అలా ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాను.

చెరువుల్లాంటి కళ్ళతో సూటిగా నావైపే చూస్తోంది కిరణ్మయి. ఆ చూపుల్లో చురుకుదనం అలానే వుంది. కాకపోతే మనిషిలో పెద్దరికం—గాంభీర్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

"కాఫీ తీసుకోండి!" మళ్ళీ అంది కిరణ్మయి.

నేను మౌనంగా కాఫీ అందుకున్నాను.

కిరణ్మయిని అంత హఠాత్తుగాఅలా చూస్తానని—చూడగలననీ అనుకోలేదు నేను.

"బావున్నారా?" అడిగింది కిరణ్మయి.

"ఊఁ" అంతకంటే ఏమనాలో తోచలేదు.

"జ్యోతిని చేసుకుంటున్నది మా బంధువు లబ్బాయే!"తనక్కడకు రావటానికి గల కారణం చెప్పేటందుకు కాబోలు అంది.

"జ్యోతి చాలా పెద్దదయిపోయింది. నన్నసలు గుర్తుపట్టలేదు!" అన్నాను. నాకు తెలుసు ఆ మాట అక్కడ అనటం అసందర్భమేనని.

రెండు నిమిషాలు ఇబ్బంది కరమైన నిశ్శబ్దం అలుముకుంది.

"ఊఁ....చెప్పు!" అన్నాను. అలా అంటూ ఏదో జ్ఞాసకం వచ్చినట్లు కిరణ్మయి మొహంలోకి చూశాను. నా అంచనా తప్పు కాలేదు. కిరణ్మయి మెత్తగా నవ్వింది. ఇదివరలో మాటిమాటికీ ఆమె దగ్గర కూర్చుని కబుర్లు చెబుతూ అలా అంటూండేవాణ్ని.

అలా అన్నప్పుడల్లా కిరణ్మయి తమాషాగా కనుబొమలు ముడిచి - "ఏం చెప్పమంటారూ? ఏం మాట్లాడమంటారు?....చెప్పటం మాట్లాడటం కొందరి స్వంతం....నాకు వినటం మాత్రమే తెలుసు!" అనేది.

అది నిజమే. నేను కబుర్లు చెబుతున్నంతసేపూ గంటల తరబడి విసుగు లేకుండా ఆసక్తిగా వినేది.

అసలు కిరణ్మయితో నా పరిచయం వింతగా పెరిగి పెద్దదైంది. రామచంద్రమూర్తిగారి పిన తల్లిగారమ్మాయి కిరణ్మయి. రాజమండ్రీ కాలేజీలో చదువుకునేందుకు వాళ్ళింట్లో వుండేది. "వదినా....వదినా...." అంటూ రాజ్యలక్ష్మి గారి వెనుకే వుండే కిరణ్మయి చాలా చురుకైనదనీ—మాటకారనీ పరిచయం పెరిగాక కాని తెలియలేదు నాకు.

నా మనసూ—ఆలోచన్లూ గతంలోకి వెళ్ళిపోతూంటే కిరణ్మయి పలకరింపు నన్ను మళ్ళీ వర్తమానానికి తీసుకొచ్చి నిలబెట్టింది.

"మీరొక్కరే వచ్చారా?" కిరణ్మయి అడిగింది.

ఎదురుగా యింతసేపూ కనిపిస్తున్నది ఒక్కడ్నే అయినా కిరణ్మయి అలా యెందుకు అడిగిందో సులభంగానే గ్రహించాను. అయినా-

"అంటే?" అన్నాను ఆ ప్రశ్న అర్థం కానట్లు నటిస్తూ.

"అదే... అదే .... ఇంకెవర్నీ తీసుకు రాలేదా?" తటపటాయిస్తున్నట్లు అడిగింది.

నేను జీవంలేని నవ్వు నవ్వి- "తీసుకురాతగ్గ వాళ్ళెవరూ లేరు!" అన్నాను.

"అంటే....మీరు..?"ఆగిపోయింది. ఆమె మొహంలో యేదో సందేహం.

"అవును....అంతే!" అంతకంటే ఆమెకర్థం అయ్యేలా చెప్పలేకపోయాను. కిరణ్మయి జాలిగా చూసింది. బాధపడుతూ చూసింది. దిగులుగా చూసింది. ఆమె కళ్ళల్లో ఒకదాని తరువాత ఒకటి ఫీలింగ్స్ మారిపోతూ కనిపించాయి.

ఆమె పెదాలు నిశ్శబ్దంగా....అతి మెల్లగా విచ్చీ విచ్చుకున్నట్లు కదులుతున్నాయి. ఏదో అడగాలని ఆరాటం....ఏదో చెప్పాలని తాపత్రయం....ఆమెలో....ఆ పెదవుల కదలికలో ప్రస్ఫుటమౌతున్నాయి.

"ఏం సూర్యం....స్నానం చేయరాదూ?.. మళ్ళీ హడావిడై పోతుంది?" అంటూ రాజ్యలక్ష్మిగా రొచ్చారు.

అలాగే అన్నట్లు తలూపి లేచాను.


"కిరణ్మయీ! సూర్యానికి స్నానం ఏర్పాట్లు చూస్తావా?" రాజ్యలక్ష్మిగారు అడిగారు.

"అదేమిటీ. కిరణ్మయి మగపెళ్ళివారట కదూ .... తనకి పన్లు చెప్తున్నారేమిటీ?" నవ్వుతూ అడిగాను.

"నా నాయనే.... ఆలాంటివి జ్ఞాపకంచేసి చక్కగా పన్లు చేసిపెట్టేదాన్ని చెడగొట్టకు. ఏదో సగం ఇటూ చక్కబెట్టుకు వస్తోంది."అన్నారు రాజ్యలక్ష్మిగారు.

ముగ్గురం హాయిగా నవ్వుకున్నాం.

రాజ్యలక్ష్మిగారు పనుందంటూ వెళ్ళిపోయారు. నేను కిరణ్మయి వెనుక నడిచాను. నాకు బాత్‌రూమ్ చూపించి ఇప్పుడే వస్తా



నంటూ వెళ్ళింది. నేను స్నానం ముగించి బట్టలు మార్చుకుని గదిలో కూర్చున్నాను.

అక్కడున్న మంచంమీద వారి పుస్తకం చేత్తో పట్టుకున్నాను. పుస్తకంమీద ధ్యాస కుదరలేదు. పుస్తకం మూసి ప్రక్కనపెట్టేను.

కిరణ్మయి చాలా పొయిటిక్‌గా మాట్లాడేది. ఆమెకున్న అభిరుచులు చూస్తూంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుండేది. అవి చాలా వున్నతమైనవీ—చాలా వుత్తమమైనవీ. బహుశా అవే నన్ను ఆమెకు బాగా చేరువ చేసుంటాయి. ఎందుకంటే నాకు జీవితాన్ని యెంతో అందంగా ఊహించుకోవటం ఇష్టం. ప్రపంచంలో ప్రతీ అణువులోను సౌందర్యాన్ని వెదికి వేడుక చేసుకునేవాణ్ని.

అంతులేని అందాన్ని చూసినప్పుడు నాకు విపరీతంగా యేడుపొచ్చేది.

అతిమధురమైన సంగీతానికి నా హృదయం నీరై పోయేది.

అపురూపమైన పుస్తకాలు చదువుతూ ఆకలి దప్పులు మరచిపోయేవాణ్ని.

ఇంచుమించు ఇవే రకం లక్షణాలు కిరణ్మయిలో ఉండటంచేత నా మనసు ఆమె సాన్నిత్యంకోసం తపించిపోయేది. ఆమె స్నేహంకోసం ఉవ్విళ్ళూరిపోతుండేది.

"వెన్నెట్లో యేటివొడ్డున కూర్చుంటే ఎలా వుంటుంది?"

"పరుగునపోయే రైల్లో కిటికీ ప్రక్కన కూర్చుని నిరంతరం ప్రయాణం చేస్తూంటే తమాషాగా వుండదూ!"

"తెల్లారుఝామున మంచంమీద పడుకుని ఆరు బయట అరవిరిసిన పకృతిని చూస్తూ లతామంగేష్కర్ పాటలు వింటూంటే హాయిగా వుండదూ?"

ఈ రకంగా వుండేవి కిరణ్మయి మాటలు. అవును! కిరణ్మయికి బాహ్య సౌందర్యంతో పాటు ఆత్మ సౌందర్యంకూడా వుంది కనుకనే అంత అందమైన ఆలోచన్లూ, ఆశలూ వున్నాయి. మనసులోని విషయాలు దాపరికం లేకుండా చెప్పుకోవటం....ఆపైన....ఒకర్నొకరు జోక్ చేసుకోవటం .... అలా అలా అత్యంత సన్నిహితులమైపోయి .... చివరకు నేను ఒకరోజు సాయంకాలం యెవరూ లేని సమయంలో పెరటిలో పొగడచెట్టు క్రింద కిరణ్మయిని మెల్లగా....మృదువుగా దగ్గరకు

తీసుకుని బుగ్గలపై ముద్దుపెట్టుకోవడం వరమూ వచ్చింది.

ఒక కన్నెపిల్ల బుగ్గల్ని స్పృశించిన అనుభవం నేను జన్మ జన్మలకూ మర్చిపోలేను. ఆ తర్వాత చాలాసార్లు....అలాగే.... ఆ అందమైన అనుభవం చాలాసార్లు పొందాను. చూపుల్లో అమితమైన అభిమానాన్ని-అనురాగాన్ని కలగలిపి కిరణ్మయి నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని చెంపలకూ—మెడకూ తాకించుకుంటూ వుండిపోయేది.

కిరణ్మయి యిక నా స్వంతమయిపోయినట్లే భావించాను. కిరణ్మయితో గడపటంలో నాకు అంతులేని ప్రశాంతత లభించేది. నిరంతరం....నిత్యం నాకు కిరణ్మయి ధ్యానే.... కిరణ్మయి ఆలోచనే!

ఎవరో పిలిచినట్లయితే వులిక్కిపడి ఈ లోకానికి వచ్చాను.

"ఏమిటీ....ఈ లోకంలో లేరా?....నాలుగుసార్లు పిలిచాను." కిరణ్మయి అంది.

"ఆఁ?....ఆ!" అంటూ లేచి నిలబడ్డాను.

"పెళ్ళివారు భోజనాలకు వస్తున్నారు.... మిమ్మల్ని వదిన పిలుచుకు రమ్మంది." చెప్పింది.

నేను కిరణ్మయితో బయలుదేరాను.

"మీవారు రాలేదా?"-హఠాత్తుగా అడిగాను ఆమె ప్రక్కనే నడుస్తూ.

ఆమె మెడలో మంగళసూత్రాలు ధగ ధగ మెరుస్తున్నాయి.

"సెలవు దొరకలేదు" ముక్తసరిగా అంది.

మరో నాలుగడుగులు వేశాక- "మరి....పిల్లలూ?" అడిగాను. అలా అంటున్నప్పుడు నా కంఠం నాకే విచిత్రంగా వినిపించింది.

కిరణ్మయి నడుస్తూనే నా వైపు చూసింది.

నేను చూపులు తప్పించుకున్నాను.

"బేబీ వచ్చింది....బాబుకి స్కూలు!" కిరణ్మయి జవాబిచ్చింది.

"కిరణ్మయికి యిద్దరు పిల్లలన్నమాట!" మనసులోనే అనుకున్నాను. బాగానే వుంది. పిల్లలూ....భర్తా....సంసారం .... సుఖంగానే వుంది. అన్ని మర్చిపోయి....అందర్నీ మరచిపోయి తన మానాన్న తను హాయిగానే వుంటోంది.

"సాయంకాలం మీకేదైనా పనుందా?" అడిగింది.

ఎందుకన్నట్లు చూశాను.

"సాయంకాళం దుర్గ కొండకు వెళదాం.. మీతో చాలా మాట్లాడాలి. మీతో చాలా చెప్పాలి. మిమ్మల్ని యెన్నో అడగాలి...." గబ గబా అంటున్నట్లు అంది.

అలాగే అన్నట్లు తలూపాను.

అంత దూరంలో రామచంద్రమూర్తిగారు నిలబడివుండటంచేత మేం ఇంకేం మాట్లాడుకోలేదు.

రాజ్యలక్ష్మిగారు వద్దు వద్దంటున్నా వడ్డన చేస్తానంటూ దిగాను. కిరణ్మయికూడా వడ్డనకు తయారయ్యింది. అవి కావాలనేవాళ్ళూ-ఇవి కావాలనే వాళ్ళతో వడ్డన సరదాగా సాగింది. రెండు బ్యాచీలుగా మగపెళ్ళివారు భోజనాలయి లేచారు. అందరికీ భోజనాలయ్యేసరికి రెండు దాటింది.

కాసేపు విశ్రాంతి తీసుకుందుకు గదిలోకి వచ్చేశాను. మంచంమీద వాలి కిరణ్మయిని గురించి ఆలోచించటం మొదలుపెటాను.

సాయంకాలం ఏం మాట్లాడుతుంది కిరణ్మయి?....యేం చెప్తుంది? యేం అడుగుతుంది? అప్పట్లో తను కాదనుకోటానికి-కాదని ఎవర్నో చేసుకోటానికి గల కారణం చెప్పలేదు. అంతా కలలోలా జరిగిపోయింది. ఆనాడు జరిగిన దానికి ఈనాడు సంజాయిషీ యిచ్చుకుంటుందా? క్షమార్పణ కోరుకుంటుందా? సమర్థించుకుంటూ మాట్లాడుతుందా?

ఏమో!

కాని కిరణ్మయి నాకు కాకుండా పోయినందుకు కొన్నాళ్ళు పిచ్చివాణ్ణయిపోయాను. బతుకుమీద విరక్తి పెరిగి చివరకి జీవితాన్నే ముగించుకుందామా అనిపించేది. రాత్రులకు రాత్రులు అస్సలు నిద్ర పట్టేదికాదు. వంటరిగా కూర్చుని తనివితీరా యేడ్చేవాణ్ని.

ఏదో పనిమీద బెంగుళూరు వెళ్ళిన నేను నాలుగు రోజుల్లో తిరిగొచ్చేద్దామనుకున్నది నాలుగు నెలలు వుండిపోవల్సివచ్చింది. ఏవో బిజినెస్ వ్యవహారాల్లో ఈరోజూ-రేపూ అనుకుంటూ వుండిపోవటం జరిగింది.

ఎంత పనిలో వున్నా-యేం చేస్తున్నా కిరణ్మయిని మాత్రం మరిచిపోయిందిలేదు. అక్కడ అందమైన కబ్బన్ పార్కు-లాల్ బాగ్ గార్డెన్స్ చూస్తున్నప్పుడు ఆమే గుర్తుకు వచ్చేది. కిరణ్మయే కనుక వుంటే బెంగుళూరు సిటీ అందాలు చూసి మురిసిపోయేది.

అప్పుడే అనుకున్నాను కిరణ్మయిని పెళ్ళి చేసుకున్నాక-బెంగుళూరు హనీమూన్ రావాలని. హాయిగా స్వేచ్ఛావిహంగాలై ఆ పూలవనాల్లో విహరించాలని. కాని-ఆ ఊహలు కరిగిపోతాయనీ-ఆ కలలు భగ్నమైపోతాయనీ యెలా అనుకుంటాను? బెంగుళూరునుంచి కిరణ్మయికి రాసిన నాలుగైదు వుత్తరాలకూ ఒకదానికే జవాబొచ్చింది. మిగిలినవాటి కెందుకు రిప్లై ఇవ్వలేదో అర్థంకాలేదు నాకు.

ఊరునుంచి రాగానే రాజ్యలక్ష్మిగారింటికి వెళ్ళిన నాకు పిడుగులాంటి వార్త తెలిసింది. కిరణ్మయికి పెళ్ళి కుదిరిందట. ఆ విషయం చెబ్తూ-"మనం చాలా హడావిడి చేయాలోయ్ సూర్యం!....మగపెళ్ళివారి ఆటలు సాగనీయకూడదు" అన్నారు రాజ్యలక్ష్మిగారు.

నేనేం మాట్లాడలేదు. నా హృదయం మూగపోయింది. నా మనసు చెదిరిపోయింది. నేనేదో పీడకల కంటున్నట్లుంది.

"ఏమిటి సూర్యం మాట్లాడవ్?" రాజ్యలక్ష్మిగారు అడిగారు.

ఆవిడకు కిరణ్మయికీ నాకూ మధ్య నడిచిన ప్రేమ వ్యవహారం తెలియదు. తెలిసేలా మేం ప్రవర్తించనూలేదు. ఎందుకంటే ప్రతి వ్యవహారం బట్టబయలు కావటం నా కిష్టముండదు.

నేనూ లేస్తూ - "సాయంకాలం వస్తానక్కయ్యా!" అన్నాను. రాజ్యలక్ష్మిగారు అదోలా చూస్తూ-"ఏమిటలా వున్నావ్? .... వొంట్లో కులాసాగా లేదా?" అనడిగారు.

"ఉహు....అదేం కాదు....ప్రయాణం చేసొచ్చాను కదా? అదీ" అన్నాను వచ్చేస్తూ.

కిరణ్మయి యెందుకిలా చేసిందీ? .... నాతో యింత వ్యవహారం నడిపి ఇంతిలా మనస్సెందుకు మార్చుకున్నట్లూ? నా ప్రేమలో యేం లోపం కనిపించింది?....నా వలన యేం తప్పు జరిగిందీ?

నన్ను నేను యెంత శోధించుకున్నా-ఎన్ని విధాల ప్రశ్నించుకున్నా జవాబు దొరకలేదు. కిరణ్మయిని అడుగుదామంటే దూరదూరంగా తిరుగుతూ అందుకు అవకాశమే యివ్వటం లేదు. ఒకవేళ యేకాంతంగా దొరికినా సరైన సమాధానం యిచ్చేది కాదు.

"ఏమిటి కిరణ్మయీ .... యేమిటిది?"—అంటే నిశ్శబ్దంగా చూసేది.

ఆ చూపుల కర్థం నాకు అంతుపట్టలేదు.

"నా వలన యేదైనా తప్పు జరిగిందా?.... యెవరైనా యేదైనా అన్నారా? .... యెందుకిలాంటి నిర్ణయం తీసుకున్నావ్?....యెందుకు నన్నిలా శిక్షించాలనుకుంటున్నావ్?" రుద్ధమైన కంఠంతో అన్నాను.

"ప్లీజ్....నన్నేం అడక్కండి .... నేనేం చెప్పలేను. నేనేం చెప్పను!" కిరణ్మయి చూపులు తప్పించుకుంటూ అనేసింది.

నాకు కోపం ముంచుకువచ్చింది. జీవితం నాశనం అయిపోతూంటే ఇంకా అడగొద్దనటం యేమిటీ?

"చెప్పవా కిరణ్మయీ?"

సమాధానం లేదు.

"అంతేనా?"

దానికీ సమాధానం లేదు.

ప్రేమకోసం యింకెంత దేవిరించాలో నాకు అర్థం కాలేదు. నాకు పౌరుషం ముంచుకొచ్చింది. ఉడుకుమోత్తనం వచ్చింది.

"సరే కిరణ్మయీ....నీ యిష్టం వచ్చినట్లు నువ్వు చేయి. నా యిష్టం వచ్చినట్లు నేను చేస్తాను" ఉక్రోషంగా అన్నాను.

"అంటే-?" కిరణ్మయి అడిగింది.

"నీకు నేను అక్కర్లేనప్పుడు నాకూడా ఇంకెవరూ అక్కర్లేదు. జీవితాంతం ఒంటరిగా

వుండిపోతాను." బెదిరించాలని కాదు. బాధగా అన్నాను.

ఒకవేళ కిరణ్మయి హాస్యానికి యిలా చేయటంలేదు కదా? లేదు లేదంది రాజ్యలక్ష్మి గారిచ్చిన శుభలేఖ. మిగిలిన ఆశాదీపం కూడా ఆరిపోయింది.

కిరణ్మయి పెళ్ళి దగ్గరపడుతున్నకొద్దీ నాలో ఆవేశం ఆరాటం యెక్కువౌసాగాయి. కిరణ్మయిని పరాయిదాన్ని కాకుండా చేయగలనా? కిడ్నాప్‌చేసి తీసుకుపోతే?....కాని అందుకు ఆమె సహకరిస్తుందా?....ఊహు.... కుదరదు. అది జరగదు. ఈ పెళ్ళి కిరణ్మయికి ఇష్టంలేక పోతే కదా?

కిరణ్మయి పెళ్ళి దగ్గరపడుతున్నకొద్దీ నాకు వూళ్ళో వుండాలనిపించలేదు. ఏదో పని కల్పించుకుని విశాఖపట్నం వెళ్ళిపోయాను.

ఆ తర్వాత ఇన్నేళ్ళకి ఇప్పుడు ఈ పెళ్ళిలోనే చూడటం కిరణ్మయిని. ఇన్ని సంవత్సరాల్లోను నిజానికి నే నసలు కిరణ్మయిని మర్చిపోయింది లేదు. నా మనసులో పీఠం వేసుకుని వుండిపోయిన ప్రేమమూర్తిని యెలా చెరిపేసుకుంటాను? అది నాకు సాధ్యం కాలేదు.

కిరణ్మయితో చెప్పినట్లే నాకింకెవర్నీ పెళ్ళి చేసుకోవాలనిపించలేదు. ఆమె స్థానంలో ఇంకెవర్నీ ఊహించుకోలేకపోయేవాణ్ని. చాలా సార్లు నా పెళ్ళివిషయమై ఇంటా - బయటా వొత్తిడిలు వచ్చినా యెవరూ నన్ను ఒప్పించలేకపోయారు. ఒకలా హృదయపూర్వకంగా నాకు నేను విధించుకున్న శిక్షే అది.

"పడుకున్నారా?" అంటూ కిరణ్మయివచ్చి పిలుస్తూంటే చటుక్కున కళ్ళు తెరిచాను.

కిరణ్మయి మంచంప్రక్కన నిలబడివుంది.

"లేవండి....లేచి మొహం కడుక్కుంటే కాఫీ టిఫినూ తీసుకుని బయల్దేరొచ్చు." అంది.

"కాఫీ టిఫినూ బయట తీసుకుందాం.... మొహం కడుక్కుని వస్తాను" అన్నాను.

సరేనన్నట్లు తలూపింది. రాజ్యలక్ష్మి గారితో చెప్పి కిరణ్మయితో బయలుదేరాను. ఇద్దరం మాట్లాడుకుంటూ నడుస్తున్నాం. అప్పటికి యెండతగ్గి చల్లబడింది. షికారుకి వెళ్ళే వాళ్ళతోనూ - సినిమాలకు వెళ్ళేవాళ్ళతోనూ రోడ్డు సందడిగా వుంది. కాఫీ తీసుకోవటానికి మనోరమాకి వెళ్ళాము. సర్వర్‌కు టిఫిన్ ఆర్డర్ చేశాను నేను.

అయిదు నిమిషాల తర్వాత గొంతు విప్పుకుంటూ— "నన్ను సాధించటానికేనా మీరు పెళ్ళి చేసుకోకుండా వున్నది?" కిరణ్మయి అడిగింది.

నేను సూటిగా కిరణ్మయికళ్ళలోకి చూశాను. కిరణ్మయి క్షణంసేపు నా కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూసి మొహం దించుకుంది.

"నేను మీకు అన్యాయమే చేశాను....మీకు ద్రోహమే చేశాను....నా దంతా తెలివితక్కువ ఆలోచన....అదిప్పుడిప్పుడే తెలుస్తోంది. కాని యిప్పుడు నేనేం చేయగలనూ?" కిరణ్మయి కంఠం బొంగురుపోయింది.

ఆమె కళ్ళల్లోంచి రెండు నీటిబొట్లు రాలి టేబుల్‌మీద పడ్డాయి.

సర్వర్ టిఫిన్ తీసుకొచ్చాడు. "తీసుకో కిరణ్మయీ" అన్నాను ఆమెవైపు చూసి.

కిరణ్మయి వాష్‌బేసిన్‌దగ్గరకు వెళ్ళిమొహం కడుక్కుని వచ్చింది. ఇద్దరం టిఫిన్ తీసుకుంటున్నాం.

"నేనంటే మీకు అసహ్యం వేయటం లేదూ?" కిరణ్మయి అడిగింది.

లేదన్నట్లు తలూపాను.

"మీరు నన్ను ద్వేషించటం లేదూ?" మళ్ళీ అడిగింది.


"ఎందుకూ?" అడిగాను.

"మీ జీవితాన్ని పాడుచేసినందుకు!" కిరణ్మయి అంది.

నేను సమాధానం చెప్పలేదు.

"మీరు....మీరు....చాలా గొప్పవారు.... నేనే దురదృష్టవంతురాల్ని!" చిన్నగా నుదుటి మీద కొట్టుకుంది అరచేత్తో.

సర్వర్ కాఫీ తీసుకొచ్చాడు. ఇద్దరం కాఫీ త్రాగటం ముగించాం. బిల్లు ఇచ్చి కిరణ్మయితో బయటకు వచ్చాను.



"రిక్షా పిలవండి...." హోటల్ బయటకు రాగానే అంది.

నేను రెండు రిక్షాలు పిలవబోతుంటే వారించింది. "ఫర్వాలేదు. ఒకటిచాలు. అపవిత్రులం అయిపోం" కిరణ్మయి అంది.

నేనామెవైపు చూశాను.

"మీ కభ్యంతరమా?" అడిగింది.

నేను రిక్షా మాట్లాడాను. ఇద్దరం రిక్షా యెక్కాం. నేనొకప్రక్కకు వొదిగి కూర్చోబోతే చురుగ్గా చూసింది. అది చూసి నేను మామూలుగా కూర్చున్నాను.

ఆ రోజుల్లో గోదావరి గట్టుకి షికారు వెళ్ళే వాళ్ళం రిక్షాలో. అది జ్ఞాపకం వచ్చింది. తల తిప్పి కిర్మయివైపు చూశాను. తనుకూడా నావైపే చూస్తోంది. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి.

దుర్గకొండ దగ్గరికు రాగానే కొబ్బరికాయ అరటిపళ్ళు కొంది కిరణ్మయి. మెట్లెక్కుతూంటే-"ఇలా యెన్ని గుళ్ళు తిరిగితే నా పాపం పోతుందంటారూ?" అనడిగింది.

"పాపమా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. ఒక మనిషి మనసు కష్టపెట్టిన పాపం!" కిరణ్మయి అంది.

నేనేదో అనబోతూంటే తనే అంది- "నా పాపానికి ప్రాయశ్చిత్తం యేమిటి?" అని.

నేను చిన్నగా నవ్వి-"కిరణ్మయీ....నిన్ను నేను అసహ్యించుకుంటున్నాననీ ద్వేషిస్తున్నాననీ, శపిస్తున్నాననీ అనుకుంటున్నావా? లేదు కిరణ్మయీ అలాంటిదేం లేదు. నువ్వు సుఖంగా వుండాలనీ సంతోషంగా వుండాలనీ కోరుకుంటున్నాను. అలాంటప్పుడు ఈ ప్రాయశ్చిత్తాలూ-పశ్చాత్తాపాలూ అనవసరం. అవును కదూ?" అడిగాను.

కిరణ్మయి పెదవులు అదురుతున్నాయి.కళ్ళు చెమరుస్తున్నాయి.

"కాని నా మనసులో సందేహానికి సమాధానం దొరకలేదు కిరణ్మయీ. అందుకనే కాస్త అశాంతిగావుంది. మరికాస్త బాధగా కూడా వుంది. ఎందుకో తెల్సా? నిన్నింతంగా మనసిచ్చి ప్రేమించానే....నిష్కల్మషంగా కోరుకున్నానే? నా ఆరాధన-అభిమానం నీ పట్ల యెందుకు వ్యర్థమైపోయాయి? యెందుకు

ఫలించకుండాపోయాయి?....నీకు వాటిలో ఏం లోపం కనిపించింది?

ఆడదానికి మనసూ - మనువూ ఒకరితోనే అంటారు. అటువంటిది నువ్వు ప్రేమ ఒకరితో - పెళ్ళి ఒకరితో ఎలా వేరుచేసి చూడగలిగావ్? కథల్లోనూ నిజంలోనూ కూడా మగాడు తెలిసి తెలిసి ఆడదాన్ని అన్యాయం చేయటం వుంది కాని ఆడది మగాడిపట్ల ఇంత దయ లేకుండా ప్రవర్తించటం వుందా? ఇట్ సీమ్స్ వెరీమచ్ స్ట్రేంజ్....అఁ..చాలా కొత్తగా వుంది....చాలా వింతగా వుంది." ఆవేశంగా అన్నాను.

నా మాటల ధాటికి కిరణ్మయికి నిస్పృత్తువ వచ్చినట్లుంది. మెట్లమీద కూలబడిపోయింది. నన్ను నేను కూల్ చేసుకోవడానికి అయిదు నిముషాలు పట్టింది. కిరణ్మయి లేచి నిల బడింది.

"సారీ కిరణ్మయీ. వెరీసారీ!" అన్నాను నా ఆవేశానికి సిగ్గుపడుతూ.

ఇన్నేళ్ళల్లోనూ ఆమె నాకు దక్కకపోవటానికి నా దౌర్భాగ్యమే కారణం అనుకున్నాను కాని కిరణ్మయిని యెప్పుడూ నిందించలేదు మనసులో కూడా!

గుళ్ళోకి వెళ్ళాక దుర్గదర్శనం చేసుకుని మండపంలోకి వచ్చి కూర్చున్నాం. గుళ్ళో యెక్కువ జనం లేరు. ఉన్నవాళ్ళు యెవరి మానాన వాళ్ళు వున్నారు.

కిరణ్మయి కాసేపున్నాక - "మీకొకటి చెప్తాను. కాని విన్నాక మీరు నా తెలివి తక్కువతనానికి నవ్వుతున్నా...జాలిపడినా ఫర్వాలేదు కాని, నన్ను యేవగించుకోకండి. నన్ను తిట్టుకోకండి.

నేను హైస్కూలు దాటి కాలేజీకి వచ్చాక ప్రేమగురించితెలుసుకోవటం ప్రేమ కథలు చదవటం-వినటం మొదలుపెట్టాను. నాకు ప్రేమ అనే మాటలో తీయదనం ఏదో థ్రిల్ తోచేవి. ఆ థ్రిల్ గురించి మనసు పదే పదే ఆలోచించేది. అప్పుడే నాకు మొదటిసారిగా అనిపించింది ప్రేమిస్తే ఏమౌతుందీ? యెలా వుంటుంది? అని. ఏ ప్రేమకథ చదివినా, ఏ ప్రేమని గురించి విన్నా నాకు ప్రేమించుకోవడం వరకే బావుండేది. ఆ ప్రేమ పెళ్ళికి దారితీస్తే దాని అందం-దాని తీయదనం తగ్గిపోతాయేమో ననిపించేది. చివరకు ప్రేమ ప్రేమించుకోవటం వరకే బావుంటుందన్న అర్థంలేని నిర్ణయానికి వచ్చింది నా మనసు.

ఆ ప్రేమలోని థ్రిల్ చూసేందుకు మిమ్మల్ని ప్రేమలోకి దింపాను. ప్రేమపలుకుల్లోని తీయదనాన్ని చవి చూశాను. ప్రేమ లేఖలు అందుకోవటంలోని అనుభూతి చవి చూశాను. ఇంకా....ఇంకా....మీ సమక్షంలో ప్రేమ ప్రసాదించే అందాలు చాలా చూశాను.

ఒక్కొక్కసారి మీరు నా పట్ల కనపరిచే ప్రేమకు హృదయం పొంగిపోయేది. ఒకలా మనసుగా మీకు నేను పూర్తిగా అంకితం అయిపోయాను. మిమ్మల్ని చూడని క్షణం నా మనసు విలవిలలాడిపోయేది. అణువణువునా నాలో మీరే నిండిపోయారు.

మరైతే మరొకర్ని యెందుకు పెళ్ళిచేసుకున్నావ్ అని మీరడగొచ్చు. చెప్పాను నా మూర్ఖత్వం గురించీ....ప్రేమ పెళ్ళికి దారితీస్తే యెక్కడ యింకిపోతుందోననే భయం మిమల్ని పెళ్ళి చేసుకోకూడదు అనుకునేలా చేసింది. మీరు యెల్లకాలం ప్రియాతిప్రియమైన ప్రేమికుడిలాగే వుండిపోవాలి. సంసారమూ-పిల్లలూ-చికాకులూ వీటిమధ్య యిరుక్కుని మీపట్ల నా అరాధన నాశనం కాకూడదు. అదీ అప్పట్లో నా ఆలోచన.

చూశారా యెంత తెలివితక్కువతనమో? ప్రేమ పెళ్ళితో మరింత గట్టిపడుతుందీ, పిల్లల వలన ఇంకా వృద్ధి చెందుతుందీ అన్న సత్యం నాకు తెలియనే తెలియదు.

నూరేళ్ళ బంధంలోనూ - నూరేళ్ళ సహచర్యంలోనూ ప్రేమ ఇంకిపోవటం అంటూ వుంటుందా? అందుకే అలాంటి అవివేకానికి పాల్పడినందుకే యిప్పుడనుభవిస్తున్నాను.

ప్రేమించినదాన్ని పొందలేక పొందినదాన్ని ప్రేమించలేక నరకం అనుభవిస్తున్నాను.

ఈ కోరికలూ పిల్లలూ వారితో నా సంబం

ధాలూ అంతా యంత్రికం. అవన్నీ తప్పనిసరై తప్పించుకోలేనివై" చెప్పటం ముగించింది.

ఆమె చెప్పేదంతా ఆశ్చర్యంగా వింటూ వుండిపోయాను. ఆమె విపరీతమైన ఆలోచన్లకు మతిపోయింది.

"చేతులు కాలిపోయాయి. ఇప్పుడేమనుకుంటే లాభం యేమిటీ? తలుచుకు తలుచుకు యేడవడం తప్పించి చేసిన తప్పును దిద్దుకునే అవకాశం లేకుండా పోయింది. బ్రతుకంతా ఈ బాధ హృదయంలో గూడు కట్టుకుని వుండవల్సిందే! నేనిద్దరు మగాళ్ళపట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నాను. నేనిద్దరు మగాళ్ళకు తీవ్రమైన ద్రోహం చేస్తున్నాను. ప్రేమించి మీ పొందు దూరం చేసుకుని ఒక తప్పు చేశాను- ప్రేమలేని పొందు అనుభవిస్తూ మరొకరిపట్ల తప్పు చేస్తున్నాను. మనసుగా మీకూ - తనువుగా మరొకరికీ అంకితమైన వింత బ్రతుకు నాది. అతి నీచమైన జీవితం నాది... ఒకలా నేను అపవిత్రురాలిని, అపరాధిని. చెప్పండి! నా నేరానికి శిక్షేమిటీ? జీవితాంతం ఈ క్షోభ అనుభవించవల్సిందేనా? ఈ మానసిక సంఘర్షణలో నలిగిపోవటమేనా?....ఎలా....ఎలా!"

కిరణ్మయి మోకాళ్ళమీద తలవాల్చి వెక్కి-వెక్కి- యేడ్చేసింది.

నా కామెని ఏమని ఓదార్చాలో ఎలా సముదాయించాలో అర్థం కాలేదు. భగ్న ప్రేమికుడిగా నేను అనుభవిస్తున్న క్షోభకంటే ప్రేమని చేతులారా దూరం చేసుకున్న ఆమె స్థితి చాలా భయంకరంగా అనిపించింది. నాకైతే మనసారా యేడవటానికేనా అవకాశం వుంది. కాని కిరణ్మయి విషయంలో అలా కాదు. కన్నీళ్ళ బరువుని కూడా కళ్ళల్లో దాచుకోవాలి....బాధలతో బెంగలతో మౌనంగా నలిగిపోవాలి. నాకేదైనా అంతవరకూ ఆమెపట్ల కోపం-ద్వేషం వుండివుంటే అవన్నీ మంచులా కరిగిపోయాయి. కిరణ్మయి నా పట్ల అన్యాయంగా ప్రవర్తించి వుండవచ్చు. కాని - అది నా పట్ల ప్రేమని నిలుపుకోటానికే అనుకునేసరికి ఆమె పట్ల మనసంతా సానుభూతితో నిండిపోయింది.

చీకటిపడుతోంది. కొండక్రింద వూరంతా దీపాలతో వెలిగిపోతోంది. కిరణ్మయి మనస్సుకి ప్రశాంతి ప్రసాదించమని దేవతని వేడుకున్నాను. మరో జన్మంటూ వుంటే అప్పుడైనా కిరణ్మయిని నాకు దక్కేలా చేయమని కోరుకున్నాను.

కిరణ్మయి ఇంకా వెక్కుతూనే వుంది.

నా హృదయంలోంచి జాలీ....ప్రేమా.... ఆపేక్ష పెల్లుబికిపోయాయి. అమె తలమీద చేయివేసి-"కిరణ్మయీ లే....ఛ....ఛ....యేడుస్తున్నావా? వద్దువద్దు యేడవకు!నువ్వు నవ్వుతూ వుండాలి...." అన్నాను ఓదారుస్తూ.

కిరణ్మయి తలెత్తి చూసింది.

ఆమె కనుకొలకుల్లో నీటి బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. నా చేతినున్న వాచీ చూసుకున్నాను "ముహూర్తానికి వేళవుతోంది లేద్దామా?" అనడిగాను

తలూపి లేచింది కిరణ్మయి.

మెట్లు దిగుతూంటే కిరణ్మయి అడిగింది - "మీరిలా యెన్నాళ్ళుంటారూ?? మీరిలా వుంటే నేను సుఖపడగలనా? పెళ్ళి చేసుకోకూడదూ!"

నేను నవ్వాను. "ఇప్పుడు నా వయస్సెంత తెలుసా కిరణ్మయీ? ఇప్పుడు ఇంక పెళ్ళేమిటీ?....అయినా ప్రేమ ఒకచోట పెళ్ళి ఒకచోట తప్పు కదూ?" అడిగాను.

కిరణ్మయి దెబ్బతిన్నట్లు చూసింది.

నేనది గమనించనట్లు వుండిపోయాను.

కిరణ్మయి యేదో అనటానికి ప్రయత్నించి ఆగిపోయింది. నన్ను తనిక వొప్పించలేనని గ్రహించి వుంటుంది.

కిరణ్మయి మెట్లుదిగుతోంది.

ఆమె ప్రక్కనే అడుగులో అడుగు వేస్తుకుంటూ నేను మెట్లు దిగుతున్నాను. ఏడడుగులు కలిసి వేస్తే ఒకరి కొకరవుతారంటారు. మేమిద్దరం ఇప్పటికే కొన్ని వేల అడుగులు కలిసి వేసుంటాం .... అయినా మేం ఎవరికి వారయిపోయాం.

మౌనంగా నడుస్తున్నాం ఇద్దరం! □



II

గోపాలకృష్ణ ఎక్స్రేలే చేతిలో ఆ వుత్తరం వుంది. దాన్ని చూసి అతడు చాలా సేపు నవ్వుకొన్నాడు. ప్రధానమంత్రికి చాలా రకాలైన ఉత్తరాలు వస్తూంటాయి. కొన్ని తిడుతూ, కొన్ని దేశ సమస్యల గురించీ, కొన్ని పర్సనల్ ప్రాబ్లమ్స్, అభ్యర్థనలూ....యిలా. అప్పుడప్పుడు ప్రేమలేఖలు కూడా.

కానీ యిలాంటి ఉత్తరాలు రావటం మాత్రం చాలా తక్కువ.

అతడిముందు మూడు 'రాక్'లు వున్నాయి. ఒకటి ఫస్టు సెక్రటరీకి వెళ్ళాల్సిన ఉత్తరాలు. వాటిలో కొన్ని ఏరి, ఫస్టు సెక్రటరీ ప్రధాన మంత్రికి పంపుతాడు. రెండో రేక్‌లో తను జవాబు వ్రాయాల్సిన వుత్తరాలు పడేస్తాడు. మూడో రాక్‌లో వుత్తరాలమీద ఏ చర్యా తీసుకోవాల్సిన పని లేదు.

ప్రొఫెసర్ ఉత్తరం మూడో రాక్ చేరుకొంది.

మూడు 'రాక్స్'లోకి ఉత్తరాలు విడదీసిన తర్వాత మొత్తం మూడు ఫైళ్ళు ప్రధాన మంత్రికి వెళ్తాయి. మొగటి ఫైలు మాత్రం ఆయన చూస్తారు. మిగతా రెండూ కేవలం ఆయన చూడదల్చుకొంటే పరిశీలించటానికే.

ఈ ఉత్తరాలు చూడటానికి ఆయన దిన చర్యలో టైము ప్రొద్దున్న తొమ్మిది నుంచీ తొమ్మిదిన్నరవరకూ.

ఆగస్టు ఒకటో తారీఖు తొమ్మిదిన్నరకి ఆయనకి పార్టీ చీఫ్ అవినాష్‌తో అప్పాయింట్ మెంటుంది. అంటే ఉత్తరాలు చూడటం పూర్తయ్యేక.

తొమ్మిదిన్నరవరకూ మామూలుగానే ఆయన మొదటి ఫైలు నెట్టేసేడు.

అవినాష్ ఇంకా ఆలేదు.

సాధారణంగా ప్రైమ్మినిస్టర్ ప్రోగ్రాంలో రావల్సినవాళ్ళు ఆలస్యం వుండదు. ఒకవేళ అలాంటిదేదైనా వుంటే, ఇంకో విజిటర్‌ని పంపటం జరుగుతుంది. ఈ చిన్న చిన్న విజి

టర్లు రెండు మూడు నిముషాల వ్యవధిలో తమ సంభాషణ ముగించాల్సి వుంటుంది.

అయితే అవినాష్‌తో ఈ చర్చ దాదాపు గంటసేపు జరగాల్సి వుంది. ప్రతిపక్షం చాలా బలంగా వుంది. పార్టీ ఏ క్షణమైనా మెజారిటీ పోగొట్టుకొనేలా వుంది. అందుకే ఆ రోజు చాలా కీలకమైన చర్చ జరగబోతూ వుంది.

పార్టీ చీఫ్ యింకా రాలేదు.

తొమ్మిదీ ముప్పై అయిదు.

సాధారణంగా ఇలాటి పరిస్థితులు ఏర్పడినప్పుడు, ప్రజల ఆసక్తిని పక్కకి మళ్ళించే సంఘటనల్ని ప్రభుత్వం చేపట్టాలి. దాన్ని గురించి చర్చించటానికే చీఫ్ వస్తున్నది.

తొమ్మిదీ నలభై.

ప్రధానమంత్రి విసుగ్గా రెండో ఫైలు ముందుకు లాక్కొన్నాడు. సెకండ్ అసిస్టెంట్ ఆన్సర్ చెయ్యవలసిన ఉత్తరాలు. సావనీరుకి అభినందనలు పంపమనీ, ఫ్యాక్టరీ ప్రారంభోత్సవాలకి రమ్మనీ....ఇలాటివి.

ఫైలు పడేసి వెనక్కి వాలబోతూ, మూడో ఫైలు చూసేడు. ఓ కాగితం క్రిందికి జారి, చివర్లో పి. యస్. కనబడ్తూంది. ప్రధాన మంత్రికి పి. యస్. వ్రాసేదెవరా అని కుతూహలంతో వుత్తరాన్ని బైటకి లాగేడు...."ఆ నక్షత్రానికి ఆకర్షణ శక్తి వున్నట్టయితే భూమ్మీది వస్తువులు దానికి వెళ్ళి అతుక్కుంటాయి...."

చాలాసేపు దానివైపే తదేకంగా చూస్తూ వుండిపోయేడు ఆయన.

ప్రతీ వుత్తరానికి చివర్లో పి. యస్.లు వ్రాసే మతిలేని ప్రొఫెసర్ అలవాటు, ఈ కథని యింకో మలుపు తిప్పటానికి ఉపయోగపడింది. చాలా విషాదకరమైన మలుపు.

* * *

"ఇండియన్ టైమ్" అన్న దినపత్రిక ఆంధ్రదేశం నుంచి వెలువడుతుంది. చాలా తక్కువ కాలంలో అది ఎక్కువ అమ్మకాన్ని సాధించగలిగింది. దానికి కారణం అది ప్రచురించే అతిశయోక్తులు. మామూలు విషయాల్ని కూడా అందంగా, చదివేవారికి కుతూహలం కలిగించేలా ప్రకటిస్తూ వుంటుంది. నలుగురు చాకుల్లాంటి సబ్ ఎడిటర్లున్నారు. మిగతా దినపత్రికలకి అందని విషయాల్ని కూడా సేకరించి వీళ్ళు ప్రచురిస్తూ వుంటారు. వాళ్ళలో ఒకామె శైలజ.

రమణ ఆ రోజు మామూలుగా లంచ్ అవర్లో టీ తాగి వచ్చి, తన సీట్లో కూర్చొని పని చేసుకొంటున్నాడు.

అంతలో ప్యూన్ వచ్చి టైమ్ ఆఫీసులో ఎవరో అతడి గురించి వేచి వున్నారని చెప్పాడు.

సాధారణంగా పత్రికాఫీసుల్లో బైటవాళ్ళని లోపలికి రానివ్వరు. సెక్యూరిటీ దగ్గరే ఆపుచేసి, ఫోన్లో కావల్సినవాళ్ళని కనుక్కొని, అప్పుడు పంపిస్తారు పాస్ యిచ్చి.

'వచ్చిం దెవరూ' అని కనుక్కుంటే ప్రొఫెసర్.

"వెల్‌కమ్ టు మై ఆఫీస్" ఆనందంగా ఆహ్వానించేడు రమణ.

ప్రొఫెసర్ వచ్చి ఎదుటి సీట్లో కూర్చొని చుట్టూ చూసేడు. పెద్ద హాలు. ఎవరి పని వాళ్ళు తల వంచుకొని చేసుకుపోతున్నారు.

"టీ త్రాగుతారా?" అడిగేడు రమణ.

"టీ కాదు ముఖ్యం. నీతో ఓ విషయం చెప్పటానికి వచ్చేను" అన్నాడు.

"ఏమిటి?"

"మనం సాయంత్రం ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్తున్నాం."

III

శైలజకి జ్ఞాపకశక్తి యెక్కువ. చాలా సంవత్సరాల తర్వాత చూసిన విషయాల్ని కూడా జ్ఞాపకం పెట్టుకోగలదు. అందుకే ప్రొఫెసర్‌ని గుర్తుపట్టింది.

అతడీ ఆఫీసుకు ఎందుకొచ్చినట్టు?

రమణ ముందు కుర్చీలో కూర్చోవటం చూసి ఆమె అక్కడికి వచ్చింది. అక్కడికి ఆమె చేరుకొనే సమయానికి రమణా, ఆయనా ఘర్షణ పడుతున్నారు. శలవు దొరకదంటు



న్నాడు రమణ. ఎలాగైనా వీలుచూసుకొమ్మనీ తనకి అక్కడ అసలేమీ తెలియదని ప్రొఫెసరంటున్నాడు.

"హాల్లో!" అంటూ చేరుకున్నది ఆమె అక్కడికి. "మీరు ఆనందమార్గం కాదూ?" కుర్చీలో కూర్చొంటూ అడిగింది.

"కాదు. అయోమయం" అన్నాడు ప్రొఫెసర్.

ఆమె నవ్వి, "సరే, మీ మతిమరుపు చూస్తుంటేనే తెలుస్తూంది మీరు ప్రొఫెసర్ ఎ. యమ్. ఎ. యమ్. అని" అంది.

"మీకు తెలుసా?" రమణ అడిగేడు.

"చాలా కాలం క్రితం పేపర్లో ఫోటో చూసేను."

"నీ జ్ఞాపకశక్తి మెచ్చుకోదగిందమ్మాయ్" అన్నాడు ప్రొఫెసరు.

"ఇలా వచ్చారేమిటి?"

వచ్చిన పని చెప్పేడు ప్రొఫెసర్.

"నాకు శెలవు దొరకదు. చేరి నాలుగు రోజులు కాలేదు. అప్పుడే శలవంటే ఇంటికి పంపించేస్తారు" అన్నాడు రమణ.

"ఎందుకు ఢిల్లీ?" అడిగింది శైలజ.

"ప్రధాన మంత్రి స్వయంగా రమ్మన్నారు...."

అప్పటివరకూ కుర్చీలో వెనక్కి వాలి, కబుర్లు చెబ్తూన్నదల్లా ఈ మాటతో నిటారుగా అయి, "ప్రధాన మంత్రా?" అంది.

ప్రొఫెసర్ ఉత్తరం చూపించేడు.

దాంతో ఆమెకు కుతూహలం పెరిగింది. "అసలు విషయం ఏమిటి? మొత్తం అంతా వివరంగా చెప్పండి" అంది.

నక్షత్రం గురించీ—అది భూమిపై రావటం గురించీ అంతా చెప్పేడు. ఒక క్షణం ఆమె మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయింది.

తరువాత, "ఒక షరతుమీద రమణకి లీవు ఇస్తాం" అంది.

"ఏమిటి?"

"ఈ విషయాన్ని ఢిల్లీలో ఏ పత్రిక్కీ మీరు ముందు వెల్లడి చెయ్యకూడదు."

"సరే దానికేముంది" అన్నాడు ప్రొఫెసర్.

"ఒకవేళ వెల్లడిచేసినా ఎవరూ నమ్మరు. అసలు నేను వ్రాసిన ఓ పిచ్చి వుత్తరానికి యింత ప్రాముఖ్యత రావటమే నాకు ఆశ్చర్యంగా వుంది. నావన్నీ కాకుల లెక్కలు" అన్నాడు.

ఆమె నవ్వి, "మాకు కావలిసినవి అలాటి

వార్తలే. లోకులు కాకులు" అంది.

ఆ సాయంత్రం బోయింగ్‌లో ప్రొఫెసర్, రమణ ఢిల్లీ వెళ్ళారు.

IV

ఆ మరుసటిరోజు ఇండియన్ టైమ్స్ పత్రికలో ఒక మూల బాక్సు కట్టి ఒక వార్త పడింది ఇలా.

ఆగస్టు నాలుగు. అంతరిక్షం.

భూమిమీద సకల చరాచరాలూ నాశనం కాబోతున్నాయా? ప్రొఫెసర్ ఆనందమార్గం అంచనా నిజమయ్యే పక్షంలో ఆ రోజు ఎంతో దూరంలో లేదు. ప్రాక్సిమా సెంక్చువరీ అనే నక్షత్రం భూమికి దగ్గరగా దూసుకు వస్తోంది. కొన్ని వేల కోట్ల మైళ్ళ వేగంతో వస్తూన్న ఈ నక్షత్రం భూమి యొక్క పరిధిలోకి ఆగస్టు పదిహేడు ప్రొద్దున్న పదకొండు గంటలా పది నిముషాలకి ప్రవేశించి, మూడు సెకన్ల కాలంపాటు వుండి అనంత విశ్వంలోకి వెళ్ళిపోతుంది. అయితే భూమిలో వుండే పదార్థాలన్నీ పోటీపడి ఆ నక్షత్రాన్ని చేరుకోవటానికి తొందర పడటంతో భూమి పేలిపోతుంది. కాగితంలో పకోడీలు దట్టంగా కూరి నొక్కితే పేలినట్టు భూమి పేలిపోతుందా? పదిహేడో తారీఖువరకూ వేచి చూద్దాం. ప్రొఫెసర్ మాటలే గానీ యథార్థమైతే ఆ తర్వాత చూడటానికి మనం ఎలానూ వుండముగా.

—మా విలేఖరి.

ఇండియన్ టైమ్స్ పత్రిక అతి తొందర్లోనే పైకి రావటం చూసి ఓర్వలేని మరో దిన పత్రిక మధ్యాహ్నం ఎడిషన్‌లో ఇలా ప్రకటించింది.

"ఒక ప్రముఖ దినపత్రిక ప్రకటించిన అసత్య వార్తవల్ల నగరంలో అలజడి. 'ప్రళయం వస్తుంది' అని ఆ పత్రిక ప్రకటించటంవల్ల ప్రజలు భయకంపితులవుతున్నారు. గుండెజబ్బు వున్నవాళ్ళ పరిస్థితి మరింత ప్రమాదకరమైంది. ఈ వార్తమూలాన తన ఆరోగ్యం దెబ్బతిన్నదనీ, దానికి నష్ట పరిహారంగా యాభై వేల రూపాయలకి దావా వెయ్యబోతున్నాననీ హైకోర్టు న్యాయవాది ఒకరు ప్రకటించేరు."

ఈ వార్త చూసి, ఇండియన్ టైమ్స్ ఎడిటర్ కంగారు పడ్డాడు. అనవసరమైన చిక్కుల్లో యిరుక్కోవటం యిష్టం లేదు అతడికి. శైలజని పిలిచి చీవాట్లు పెట్టేడు.

మనిషి మనుగడమీద జూదం మొదలైంది.

ఆగస్టు నాలుగు ఢిల్లీ

పదకొండు గంటలకి అప్పాయిట్‌మెంట్.

తొమ్మిగంటలకు సెక్రటేరియట్‌కి చేరుకున్నారు ఇద్దరూ. రమణ గుండె వేగంగా కొట్టుకొంటోంది. ప్రధానమంత్రితో తను స్వయంగా మాట్లాడబోతున్నాడు. కలలోకూడా వూహించలేని విషయం అది.

పావుతక్కువ పదింటికి అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ వెరిఫికేషన్ జరిగింది. ప్రోగ్రామ్ షీట్‌లో పేరు వ్రాయబడింది.

పావుతక్కువ పదకొండుకి విజిటర్స్ ఛాంబర్స్‌లోకి ప్రవేశం లభించింది. ఆ ఛాంబర్‌లోకి వెళ్ళాలంటే కారిడార్‌లోంచి నడవాలి. అక్కడే విజిటర్లు యేమైనా ఆయుధాలు ధరించిందీ లేనిదీ పరీక్ష జరుగుతుంది.


పదకొండు కొట్టూవుండగా డ్రాయింగ్ రూమ్‌లోకి ప్రవేశించారు. జగదీష్‌చంద్ర వీళ్ళని చూసి విష్‌చేసి కూర్చోమన్నాడు. రమణ ఎగ్జైట్‌మెంట్‌తో వూపిరి బిగపట్టేడు.

వాళ్ళకి యివ్వబడిన సమయం అయిదు నిమిషాలు.

"మీరేనా ప్రొఫెసర్?"

తలూపేడు. నిమిషంపాటు మౌనం సంభాషణ.

"నక్షత్రం ఒకటి భూమివైపు వస్తుందని యెందుకు భావిస్తారు మీరు?" విషయం కదుపుతూ అన్నాడు.



"చూసేను కాబట్టి."

"ఎక్కడ?"

"నా టెలిస్కోప్‌లో."

"మీ దగ్గర టెలిస్కోప్ వుందా?"

"ఉంది."

"మనదేశంలోవున్న మిగతా అబ్జర్వేటరీస్ కనుక్కోలేని విషయాన్ని మీరు యెలా కనుక్కొన్నారు?"

"మన దేశంలో యెక్కడా నా దగ్గరున్నంత పెద్ద టెలిస్కోప్ లేదు. మన దేశంలోనేకాదు; ప్రపంచంలోనే లేదు."

జగదీష్‌చంద్ర అవినాష్ అతడివైపు చిత్రంగా చూసేరు. కొంచెంసేపు యెవరూ మాట్లాడలేదు.

"ఆ నక్షత్రం భూమివైపే వస్తుందని ఎందుకనుకొంటున్నారు? ఒకవేళ వచ్చినా అది పదిహేడో తేదీనాడే వస్తుందని నమ్మకం ఏమిటి?"

"లెక్కలు కట్టేను."

"మీదగ్గర కంప్యూటరుందా?"

"నా మెదడే కంప్యూటరు."

"ఎనభై యెనిది తొంభై మూళ్లెంత?" అవినాష్ నవ్వుతూ అడిగేడు.


"ఎనిమిదివేల నూట యనభైనాలుగు."

మళ్ళీ కొంచెం నిశ్శబ్దం.

"ప్రపంచంలో ఏ అస్ట్రానమిస్టూ కనుక్కోలేనిదాన్ని మీరు ఏ పరికరమూ లేకుండా కనుక్కున్నానంటారా?"

"నేను కనుక్కున్నది నిజమవనూవచ్చు. కాకపోనూ వచ్చు. ప్రపంచం సంగతి నాకు తెలీదు. యే అబ్జర్వేటరీ పనిచెయ్యటంలేదు."

జగదీష్ భృకుటి ముడివడింది. "పని చెయ్యటంలేదా?" సాలోచనగా అన్నాడు.



అయిదు నిముషాలై పోయినట్టు సంకేతం. మరికొంత పొడిగింపబడింది.

జగదీష్ అన్నాడు. "ఆ నక్షత్రానికి మీ రన్నట్టు ఆకర్షణశక్తిగానివుంటే, వస్తువులేకాదు అన్ని పదార్థాలూ దాన్ని చేరుకుంటాయి కదా."

"అది ఆ నక్షత్రపు ఆకర్షణశక్తిని బట్టి వుంటుంది."

"అంటే—"

"ఒక అయస్కాంతం ఇనపముక్కని ఆకర్షిస్తుంది. ఆ నక్షత్రంలో వుండే అయస్కాంతం బంగారంమీద యెక్కువ ప్రభావాన్ని చూపించగలిగితే—అన్నిటికన్న ముందు బంగారం భూమినుంచి వెలుపలికి వెళ్ళిపోవటానికి ప్రయత్నిస్తుంది."

"ఆ గ్రహపు ప్రభావం ఏయే లోహాలమీద యెక్కువగా వుంటుందని మీ రనుకుంటున్నారు?"

"క్షమించండి. నేను అస్ట్రొనమిస్ట్‌ని. జియాలజిస్ట్‌ని కాను." అన్నాడు ప్రొఫెసర్. "ఏది యేమైనా, పదిహేడో తారీకు పదకొండింటికి అది అత్యంత సమీపంగా వస్తుంది కదా, అప్పుడు అన్ని వస్తువులూ దానివైపు ఆకర్షితమవుతాయి."

"నా ప్రశ్నని మీరు సరిగ్గా అర్థం చేసుకోలేదు." అన్నాడు జగదీష్. "ఆ నక్షత్రం దేన్ని బాగా ఆకర్షించగలదో అది భూమిని వీడి తొందరగా అటువైపు వెళ్ళిపోతుంది. ఉదాహరణకి అది ఇనుముని బాగా ఆకర్షిస్తుందనుకోండి. పదకొండుగంటలా పది నిమిషాలకి ముందే భూమి యొక్క లితోస్ఫియర్‌లో వుండే 1.9% ఇనుము అటు వెళ్ళిపోతుంది. అంటే భూమీ బ్రద్దలవటం ప్రారంభిస్తుందన్న మాట. అవునా."

ప్రొఫెసరు ఒకక్షణం ఆలోచించాడు. "అలా అనటం సాధ్యమైవుంటే ఆ కదలిక ఏదో ఒక పదార్థంలో తొందర్లో మొదలవుతుంది" అన్నాడు.

"తొందర్లో అవటం కాదు. అయింది." నెమ్మదిగా స్ఫుటంగా అన్నాడు జగదీష్. శ్రోతలు వులిక్కిపడ్డారు. గదిలో సూది పడ్తే వినపడేటంత నిశ్శబ్దం.

"....నేను స్వయంగా చూసేను. నెలరోజుల క్రితం ఒక పెద్ద రాయి గాలిలో ఎవరో లేపినట్టు పైకిలేచి క్రిందకి పడిపోయింది. నా వుద్దేశం ఆ రాతిలో వున్న పదార్థం ఆరోజు ముందుగా ఆకర్షణశక్తికి లోనవుతుందన్న మాట" అంటూ లేచేడు. "ఆ పదార్థం ఏమిటో కనుక్కోండి. దానివల్ల మీ థియరీకి ఏదైనా లాభం కలుగుతుందేమో చూడండి. మీ రిపోర్టు నాకు పంపండి—"

ఇద్దరూ షేక్ హ్యాండిచ్చి బైటకొచ్చారు.

"ఏమిటిదంతా" అవినాష్ అడిగేడు. వాళ్ళు వెళ్ళేక.

"మానవుడి జీవితానికి ఆఖరురోజు వచ్చిందని ఈ ప్రొఫెసర్ అంటున్నాడు. అది ఎంతవరకు నిజమో తెలీదు. అదే నిజమై ఈ మానవజాతి అంతరించిపోతే .... అంతరించిపోతే .... అప్పుడు ఈ రాజకీయాలుండవు, మనిషీ మనిషీ డబ్బుకోసం, కీర్తికోసం, పదవికోసం కొట్టుకొని చావటం వుండదు. ఒకవేళ అది నిజం కాకపోతే-అదీ మనకి లాభమే. ప్రజల దృష్టి అటు మళ్ళుతుంది. మనిషికి ప్రాణంకన్నా తీపి యింకొకటి లేదు. నెలరోజులపాటూ దేశంలో యే నోటవిన్నా అదే సమస్య వినిపిస్తుంది. ప్రతీ పేపరునూ యెక్కువ స్థలాన్ని ఆ విషయం రాయడానికే కేటాయిస్తాయి. ఈ లోపులో మనం బలం పుంజుకోవచ్చు. మన స్థానాన్ని సుస్థిరపర్చుకోవటానికి ఈ పదిహేను రోజులూ చాలు. ప్రజల దృష్టి డైవర్ట్ చెయ్యటానికి ఇంతకన్నా మంచి విషయం ఇప్పట్లో ఇంకొకటి వుంటుందని నేను అనుకోను."

పార్టీ చీఫ్ నవ్వేడు. మనిషి మనుగడమీద రాజకీయ చదరంగం ప్రారంభమైంది.

II

చంద్రుడు లేని పున్నమి రేయి!

ఢిల్లీ. ఆగస్టు నాలుగు రాత్రి.

చేతులు రెండూ తలక్రింద పెట్టుకొని వెల్ల

కితలా పడుకొని ఆకాశంకేసి చూస్తున్నాడు ప్రొఫెసరు.

పక్కనే ఇంకో పక్కమీద రమణ.

టైమ్ తొమ్మిదయింది. ప్రధానిని కలుసుకొని అప్పటికి పది గంటలు కావొస్తూంది.

"రాయి గాలిలో లేవటం చిత్రంగా వుంది." అన్నాడు రమణ.

"అందులో చిత్రం యేముంది? అందులోని ఒక పదార్థం ఏదో ఆకర్షణకి లోనైవుంటుంది."

"ఆ విషయం ప్రధాని యెందుకు ఆ రోజే వెల్లడి చేయలేదు?"

"ఏమని వెల్లడి చేస్తారు? అర్ధరాత్రి తాను ఓ రాయి గాలిలోకి లేవటం చూశానని? అలా చేస్తే ప్రతిపక్షం వాళ్ళు బ్రతకనిస్తారా? ప్రధానికి మతిపోయిందని ప్రచారం చెయ్యరూ?"

నిజమేనన్నట్టు రమణ మాట్లాడలేదు.

"ఏ లెవల్లో వుండే కష్టాలు ఆ లెవల్లో వుంటాయి. బైదిబై నీకు పెళ్ళయిందా?"

రమణ నవ్వేడు. "కాలేదు."

"మరి ప్రపంచం ఆఖరయిపోతే యేం చేస్తావ్?"

"బ్యాచెలర్‌గానే చచ్చిపోతాను."

"లేదు లేదు. విషయం అంతవరకూ వస్తే ఈ పది రోజులూ బాగా యెంజాయ్ చెయ్యి. రేపే పెళ్ళి చేసుకో."

రమణ మాటాడలేదు.

"ఎలాటి అమ్మాయి కావాలి నీకు?"

"పదిరోజులకోసం యెలాటి అమ్మాయి అయితేనేం? అమ్మాయి అయితే చాలు."

"అలా అనకు. కళ్ళు తామర పూలల్లా వుండాలి."

"మెడ శంఖంలా వుండాలి" నవ్వాడు. అతడికి మాలతి జ్ఞాపకం వచ్చింది.

"పెదవులు తమలపాకుల్లా వుండాలి,"

"మీకూ కవిత్వం వచ్చే...."

"చెక్కిళ్ళు దానిమ్మపళ్ళలా వుండాలి."

"పలువరస బియ్యపు గింజల్లా వుండాలి."

"ముక్కు సంపెంగ...."

"జడ మిన్నాగు?"

"బొట్టు, దోసగింజంత సింగారం,"

"కట్టు, పోతపోసిన బంగారం."

"అన్నీ కలిసిన మొహం చంద్రబింబం.."

"మామూలు చంద్రబింబం కాదు. పౌర్ణమి నాటి బింబం."

"అహా-నిండు ఆకాశంలో____అలా__"

"ఈ రోజు అమావాశ్య" అన్నాడు రమణ.

"అస్ట్రానమిస్ట్‌కి అమావాశ్య యేదో పౌర్ణమేదో చెప్తున్నావా. ఆగస్టు నాలుగు. ఈరోజు పౌర్ణమి."

"మరి చంద్రుడేడీ?"

ప్రొఫెసరు ఆకాశం వైపు చూసేడు.

నక్షత్రాలు మిల మిల మెరుస్తున్నాయి. ఎక్కడా చిన్న మబ్బు తునక కూడా లేదు. ఆకాశం నిర్మలంగా వుంది. చంద్రుడు మాత్రం లేడు.

ఇద్దరూ మొహా మొహాలు చూసుకొన్నారు.

"ఆరింటికి రావలసిన శశాంకుడు ఏ తారతో సరసమాడటానికి వెళ్ళేడు?" ప్రొఫెసరు నవ్వుతూ అన్నాడు.

రమణ నవ్వలేదు.

ప్రొఫెసరు అంచనా నిజమవబోతూందా?

ఇప్పటివరకూ అంతా నవ్వులాటగా .... ఏదో కలలోలా జరిగిపోయిందికానీ ఒక్కొక్క విపరీతమే చూస్తూవుంటే జరుగుతున్నదంతా నిజమేనన్న నమ్మకం కలుగుతోంది. ఒక్కసారి ఆ భావన వచ్చేసరికి వళ్ళు గగుర్పొడిచింది. సన్నగా వణికేడు.

"చం....చంద్రుడేమయ్యేడు?"

"చూద్దాం" అంటూ కళ్ళు మూసుకొన్నాడు. అతడి పెదవులు అస్పష్టంగా కదలసాగాయి. రెండు నిమిషాల తర్వాత కళ్ళు తెరిచి, "పదిన్నర" అన్నాడు. "....నా లెక్క కరక్టయితే ఈ రాత్రి పదిన్నరవరకూ చంద్రుడు రాడు."

ఇంతలో కింద చప్పుడయింది.

ఫోను.

భూగర్భశాస్త్రజ్ఞుడు ఖట్ ఫోన్ చేసేడు.

"హల్లో ప్రొఫెసర్?"

"యస్ ఖట్."



"మీరు అర్జంటుగా రాగలరా?"

"ఆ రాయి పరీక్ష చేసేరా?"

"అ విషయమే మాట్లాడాలి. వస్తారా?"

"ఇప్పుడే వస్తున్నాను."

రమణా, ప్రొఫెసర్ లాబ్‌కు వెళ్ళేసరికి పది అయింది.

ఖట్ వాళ్ళకోసమే యెదురుచూస్తున్నాడు. వాళ్ళని లోపలికి తీసుకెళ్ళేడు.

"ఏ యే యెలిమెంట్స్ వున్నాయి ఆ రాతిలో"

"చాలా చిత్రం...."

"చెప్పండి."

"భూమ్మీదవున్న ఎలిమెంట్స్ - ఇనుము రాగి, ఇత్తడి....ఇలాటివేమీ అందులో లేవు. యే లోహమూ లేదు. అందులో వున్న పదార్థం...."

"ఊఁ, పదార్థ?...."

"క్షమించండి. నా ముప్పై సంవత్సరాల అనుభవంలో ఆ పదార్థం యేమిటో నేను కనుక్కోలేకపోయేను. భూమ్మీద దొరికే అన్ని రకాల యెలిమెంట్స్‌తోనూ, లోహాలతోనూ పరిశీలించి చూసేను. నాకు అంతుపట్టలేదు."

ఎవరూ మాట్లాడలేదు చాలా సేపు.

ప్రొఫెసర్ బలంగా శ్వాస వదిలి, "టిటానియమ్ యేమో చూశారా." అన్నాడు.

"సారీ ప్రొఫెసర్. కాదు." అన్నాడు ఖట్.

"పరిశీలించండి. నేనూ ఆలోచిస్తాను." బైటికి వస్తూ అన్నాడు.

మళ్ళీ వెనక్కి వచ్చేసేరు ఇద్దరూ.

మెట్లెక్కి పైకి వస్తూంటే "టైమెంతయింది." అడిగేడు ప్రొఫెసర్.

"పదిన్నర."

"వచ్చేడా చంద్రుడు?"

చప్పున తలెత్తి చూసేడు రమణ.

........ఆకాశం నిర్మలంగా వుంది. నక్షత్రాలు మిల మిలా మెరుస్తున్నాయి. ఒకమూల నుంచి నెమ్మదిగా వస్తున్నాడు చంద్రుడు.

ఏదో ఆలోచన స్ఫురించి ప్రొఫెసర్ సన్నగా వణికేడు.

III

ఆ మరునటిరోజు తెల్లవారుఝామున అయిదింటికి మెలకువ వచ్చింది రమణకి. కళ్ళు విప్పగానే పచార్లు చేస్తున్న ప్రొఫెసరు కనిపించాడు. పక్కనిండా గాలికి చెల్లాచెదురైన కాగితాలు. కాగితాల్నిండా లెక్కలు.

రమణ లేవటం చూసి, అతడు ఆగి, "ఈ రోజు మనమో దొంగతనం చెయ్యాలి," అన్నాడు.

"ప్రొద్దున్నే మాట్లాడటానికి ఇంతకంటే

మంచి కబుర్లు దొరకలేదా?'' అన్నాడు రమణ అతన్ని తేరిపార చూస్తూ.

"జోకు కాదు నిజమే."

"ఏం దొంగతనం చెయ్యాలి?"

"చంద్రశిల"

రమణ తల విదిలించేడు.

ప్రొఫెసర్ అన్నాడు "నీకు జ్ఞాపకంవుందా? చాలా రోజులక్రితం—ఐమీన్ కొన్ని సంవత్సరాల క్రితం ఆర్మ్‌స్ట్రాంగ్ అనే అతను చంద్రుడి రాళ్ళను తెచ్చేడు. ఆ తెచ్చిన రాళ్ళలో ఒక్కో దేశానికి ఒక్కో పౌండు బరువున్న శిలని అమెరికా బహుమతిగా యిచ్చింది...."

తెలుసన్నట్టు తలూపాడు రమణ.

"చంద్రుడినుంచి తెచ్చిన ఆ శిలల్లో భూమికి వినాశకరమైనదేమన్నా వుందేమోనని చాలా భద్రంగా వుంచింది ప్రతి దేశమూ దాన్ని. మనం దాన్ని సంపాదించాలి."

"ఎందుకు?"

"ప్రశ్నలెయ్యకు. నిజానికి ఎందుకో నాకూ తెలీదు."

....

ఆరోజు పదింటికి ఇద్దరూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియాలజీ మ్యూజియంలో వున్నారు. ప్రధాని తాలూకు అతిధులుగా వాళ్ళకి ప్రత్యేక స్వాగతం లభించింది. తిరిగొచ్చేటప్పుడుప్రొఫెసర్ పొడవాటి తన కోటు వెనుకనుంచి చంద్రశిల తాలూకు ఓ చిన్న ముక్క తీసుకు వచ్చాడు.

పదకొండింటికి ఇద్దరూ జియాలజిస్ట్ భట్ లేబరేటరీలో వున్నారు.

"ఇదిగో ఇది చూడండి" అంటూ శిలని అందించేడు ప్రొఫెసరు.

"ఎక్కడిదీరాయి"అందుకొంటూ అడిగేడు భట్.

"మా ఇంటి పెరట్లోది. దీన్ని పరీక్షించి ఇదీ, ఆ రాయిలో ఉన్నదీ ఒకే లోహం అవునో కాదో చెప్పండి—'' అన్నాడు ప్రొఫెసర్. భట్ లోపలికి వెళ్ళేడు.

"ఏమిటిదంతా?" అడిగేడు రమణ.

"చంద్రుడి శిలనుండి తెచ్చిన శిలల్లో ఒక కొత్తరకం పదార్థం వుంది. ఆ పదార్థం భూమ్మీద లేదు. మన సైంటిస్టులు దానికి "ఆర్మాల్ కొలైట్'' అని పేరు పెట్టేరు. అంటే యేమిటో తెలుసా:"

"ఉహూఁ...."

"చంద్రుడి నుంచి శిలల్ని తెచ్చిన వాళ్ళెవరు?''

"నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, అల్‌డ్రిన్, కొలిన్స్. ముగ్గురు."

"వాళ్ళ పేర్లు కలిసొచ్చేలా ఆ కొత్త పదార్థానికి ఆ పేరు పెట్టేరు. ఈ రాయిలోగానీ ఆ పదార్థం వుంటే...."

"ఉంటే" అర్థంకాక అడిగేడు రమణ.

ప్రొఫెసర్ మొహం వాడిపోయింది. "రేపు రాత్రే చంద్రుడికి ఆఖరిరోజు. యెల్లుండి రాత్రి పన్నెండు గంటలకి ఆ నక్షత్రం వైపు వెళ్ళి 'స్మాష్' అయిపోతాడు."

"ఎలా?''

"ఎంతో దూరంనుంచే ఆ నక్షత్రం భూమ్మీద వున్న ఈ రాయిని ఆకర్షించింది. అయితే ఆర్మాల్‌కొలైట్ ఆ రాతిలో తప్ప ఇంకెక్కడా లేదు కాబట్టి ఎల్లుండి భూమికేమీ ఫర్వాలేదు. కానీ ఆ పదార్థం—ఐమీన్—ఆర్మాల్‌కొలైట్ చంద్రుడిలో వుంది కాబట్టి....—" ప్రొఫెసర్ ఆగేడు.


"............ఎల్లుండే చంద్రుడికి ఆఖరి రోజు. మనం తేల్చుకోవల్సిందల్లా ఆ రాతిలోనూ చంద్రుడిలోనూ వున్నది ఒకే పదార్థమా అని. అలాగానీ అయితే ఎల్లుండి చంద్రుడికి చివరిరోజు. అదే ప్రళయానికి నాంది."

ఇంతలో, లోపల చప్పుడైంది. భట్ బైట కొచ్చేడు. అతడి మొహం ఆనందంతో వెలిగిపోతూంది.

"రెండు శిలల్లోనూ లోహం ఒకటే ప్రొఫెసర్'' అన్నాడు ఉత్సాహంగా.

IV

ఇండియన్ టైమ్స్ పత్రికలో పడిన ఆ చిన్న వార్త చాలా సంచలనాన్ని కలిగించింది.



భూమి ఆఖరవుతుందా అన్న వుత్తరాలూ, "చివరి రోజు" మీద వ్యాసాలూ మరుసటి రోజుకే పత్రిక కార్యాలయానికి వచ్చి చేరుకున్నాయి.

ప్రాణంమీద మనిషికెంత తీపో తెలిపేటందుకు నిదర్శనంగా ఆ వార్త నిజానిజాలడుగుతూ ఫోన్ కాల్స్.

ఈ వార్తని వెల్లడించిన ప్రొఫెసరు క్వాలిఫికేషన్లు సామాన్యమైనవి కావు. ఈ విషయం ఎంక్వయిరీ చేసిన ఎడిటరు, శైలజని వెంటనే ఢిల్లీ పంపేడు.

ఇలాటి వార్తలే పత్రికల సర్క్యులేషన్ పెంచేవి. అందులోనూ యే పత్రికా వెయ్యని వార్త అది.

తను కనుక్కొన్న దాన్నిమీద ఎడిటర్ ఉత్సాహం చూపించటంతో శైలజ సంతోషం పట్టశక్యం కాలేదు. ఆరోజే ఆమె ఢిల్లీ వచ్చేసింది.

ఆమె ప్రొఫెసర్‌ని కలుసుకొనే సమయానికి భూమియొక్క ఆఖరిక్షణం ఎప్పుడూ అన్నది, ప్రొఫెసరు కరెక్టుగా లెక్క కట్టేడు. అలాగే చంద్రుడు తన పరిధినుంచి తెచ్చుకొని ఎప్పుడు స్మాష్ అయిపోతాడూ అన్నవిషయం కూడా.

మొదటిది ఆగస్టు పదిహేడు రాత్రి పదకొండు గంటలా పన్నెండు సెకన్లకి.

రెండోది ఆగస్టు ఆరోతారీఖు రాత్రి పన్నెండు గంటలా మూడు నిమిషాల అయిదు సెకన్లకి.

ప్రధానమంత్రికి అందించటంకోసం రిపోర్టు తయారు చేస్తూవుండగా, శైలజ ఆ గదిలోకి అడుగు పెట్టింది.

రమణ సంభ్రమాశ్చర్యాల్లో "ఇదేమిటి మీరిక్కడికి వచ్చేరు?''అంటూ ఆహ్వానించేడు.

ఆమె నవ్వి వూరుకొంది.

ప్రొఫెసర్ కళ్ళు ఎర్రగా వున్నాయి. రాత్రంతా నిద్రలేదతనికి. ఆ రాతిలో వున్న లోహమూ, చంద్రశిలలో వున్న లోహమూ ఒకటేనని తెలిసినదగ్గర్నుంచీ అతడిమొహంలో నవ్వు మాయమైంది. అయితే అది ప్రాణభయం కాదు. అతడికి తెలుసు భూమి నాశనం కాబోతోందనీ, దేవుడనేవాడే వుంటే, వాడు కూడా దాన్ని రక్షించలేడనీ.

కొత్త విషయాన్ని కనుక్కొనే ఉత్సా

మంచి కబుర్లు దొరకలేదా?'' అన్నాడు రమణ అతన్ని తేరిపార చూస్తూ.

"జోకు కాదు నిజమే."

"ఏం దొంగతనం చెయ్యాలి?"

"చంద్రశిల''

రమణ తల విదిలించేడు.

ప్రొఫెసర్ అన్నాడు "నీకు జ్ఞాపకంవుందా? చాలా రోజులక్రితం—ఐమీన్ కొన్ని సంవత్సరాల క్రితం ఆర్మ్‌స్ట్రాంగ్ అనే అతను చంద్రుడి రాళ్ళను తెచ్చేడు. ఆ తెచ్చిన రాళ్ళలో ఒక్కో దేశానికి ఒక్కో పొందు బరువున్న శిలని అమెరికా బహుమతిగా యిచ్చింది...."

తెలుసన్నట్టు తలూపాడు రమణ.

"చంద్రుడినుంచి తెచ్చిన ఆ శిలల్లో భూమికి వినాశకరమైనదేమన్నా వుందేమోనని చాలా భద్రంగా వుంచింది ప్రతి దేశమూ దాన్ని. మనం దాన్ని సంపాదించాలి."

"ఎందుకు?''

"ప్రశ్నలెయ్యకు. నిజానికి ఎందుకో నాకూ తెలీదు."

....

ఆరోజు పదింటికి ఇద్దరూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియాలజీ మ్యూజియంలో వున్నారు. ప్రధాని తాలూకు అతిధులుగా వాళ్ళకి ప్రత్యేక స్వాగతం లభించింది. తిరిగొచ్చేటప్పుడుప్రొఫెసర్ పొడవాటి తన కోటు వెనుకనుంచి చంద్రశిల తాలూకు ఓ చిన్న ముక్క తీసుకు వచ్చాడు.

పదకొండింటికి ఇద్దరూ జియాలజిస్ట్ భట్ లేబరేటరీలో వున్నారు.

"ఇదిగో ఇది చూడండి" అంటూ శిలని అందించేడు ప్రొఫెసరు.

"ఎక్కడిదీరాయి"అందుకొంటూ అడిగేడు భట్.

"మా ఇంటి పెరట్లోది. దీన్ని పరీక్షించి ఇదీ, ఆ రాయిలో ఉన్నదీ ఒకే లోహం అవునో కాదో చెప్పండి—'' అన్నాడు ప్రొఫెసర్. భట్ లోపలికి వెళ్ళేడు.

"ఏమిటిదంతా?" అడిగేడు రమణ.

"చంద్రుడి శిలనుండి తెచ్చిన శిలల్లో ఒక కొత్తరకం పదార్థం వుంది. ఆ పదార్థం భూమ్మీద లేదు. మన సైంటిస్టులు దానికి "ఆర్మాల్ కొలైట్'' అని పేరు పెట్టేరు. అంటే యేమిటో తెలుసా:"

"ఉహూఁ...."

"చంద్రుడి నుంచి శిలల్ని తెచ్చిన వాళ్ళెవరు?''

"నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఆల్డ్రిన్, కొలిన్స్. ముగ్గురు."

"వాళ్ళ పేర్లు కలిసొచ్చేలా ఆ కొత్త పదార్థానికి ఆ పేరు పెట్టేరు. ఈ రాయిలోగానీ ఆ పదార్థం వుంటే...."

"ఉంటే" అర్థంకాక అడిగేడు రమణ.

ప్రొఫెసర్ మొహం వాడిపోయింది. "రేపు రాత్రే చంద్రుడికి ఆఖరిరోజు. యెల్లుండి రాత్రి పన్నెండు గంటలకి ఆ నక్షత్రం వైపు వెళ్ళి 'స్మాష్' అయిపోతాడు."

"ఎలా?''

"ఎంతో దూరంనుంచే ఆ నక్షత్రం భూమ్మీద వున్న ఈ రాయిని ఆకర్షించింది. అయితే ఆర్మాల్‌కొలైట్ ఆ రాతిలో తప్ప ఇంకెక్కడా లేదు కాబట్టి ఎల్లుండి భూమికేమీ పర్వాలేదు. కానీ ఆ పదార్థం—ఐమీన్—ఆర్మాల్‌కొలైట్ చంద్రుడిలో వుంది కాబట్టి....—" ప్రొఫెసర్ ఆగేడు.


"............ఎల్లుండే చంద్రుడికి ఆఖరి రోజు. మనం తేల్చుకోవల్సిందల్లా ఆ రాతిలోనూ చంద్రుడిలోనూ వున్నది ఒకే పదార్థమా అని. అలాగానీ అయితే ఎల్లుండి చంద్రుడికి చివరిరోజు. అదే ప్రళయానికి నాంది."

ఇంతలో, లోపల చప్పుడైంది. భట్ బైటకొచ్చేడు. అతడి మొహం ఆనందంతో వెలిగిపోతూంది.

"రెండు శిలల్లోనూ లోహం ఒకటే ప్రొఫెసర్'' అన్నాడు ఉత్సాహంగా.

IV

ఇండియన్ టైమ్స్ పత్రికలో పడిన ఆ చిన్న వార్త చాలా సంచలనాన్ని కలిగించింది.



భూమి ఆఖరవుతుందా అన్న వుత్తరాలూ, "చివరి రోజు" మీద వ్యాసాలూ మరుసటి రోజుకే పత్రిక కార్యాలయానికి వచ్చి చేరుకున్నాయి.

ప్రాణంమీద మనిషికెంత తీపో తెలిపేటందుకు నిదర్శనంగా ఆ వార్త నిజానిజాలడుగుతూ ఫోన్ కాల్స్.

ఈ వార్తని వెల్లడించిన ప్రొఫెసరు క్వాలిఫికేషన్లు సామాన్యమైనవి కావు. ఈ విషయం ఎంక్వయిరీ చేసిన ఎడిటరు, శైలజని వెంటనే ఢిల్లీ పంపేడు.

ఇలాటి వార్తలే పత్రికల సర్క్యులేషన్ పెంచేవి. అందులోనూ యే పత్రికా వెయ్యని వార్త అది:

తను కనుక్కొన్న దాన్నిమీద ఎడిటర్ ఉత్సాహం చూపించటంతో శైలజ సంతోషం పట్టశక్యం కాలేదు. ఆరోజే ఆమె ఢిల్లీ వచ్చేసింది.

ఆమె ప్రొఫెసర్‌ని కలుసుకొనే సమయానికి భూమియొక్క ఆఖరిక్షణం ఎప్పుడూ అన్నది, ప్రొఫెసరు కరెక్టుగా లెక్క కట్టేడు. అలాగే చంద్రుడు తన పరిధినుంచి తెచ్చుకొని ఎప్పుడు స్మాష్ అయిపోతాడూ అన్నవిషయం కూడా.

మొదటిది ఆగస్టు పదిహేడు రాత్రి పదకొండు గంటలా పన్నెండు సెకన్లకి.

రెండోది ఆగస్టు ఆరోతారీఖు రాత్రి పన్నెండు గంటలా మూడు నిమిషాల అయిదు సెకన్లకి.

ప్రధానమంత్రికి అందించటంకోసం రిపోర్టు తయారు చేస్తూవుండగా, శైలజ ఆ గదిలోకి అడుగు పెట్టింది.

రమణ సంభ్రమాశ్చర్యాల్లో "ఇదేమిటి మీరిక్కడికి వచ్చేరు?''అంటూ ఆహ్వానించేడు.

ఆమె నవ్వి వూరుకొంది.

ప్రొఫెసర్ కళ్ళు ఎర్రగా వున్నాయి. రాత్రంతా నిద్రలేదతనికి. ఆ రాతిలో వున్న లోహమూ, చంద్రశిలలో వున్న లోహమూ ఒకటేనని తెలిసినదగ్గర్నుంచీ అతడిమొహంలో నవ్వు మాయమైంది. అయితే అది ప్రాణభయం కాదు. అతడికి తెలుసు భూమి నాశనం కాబోతోందనీ, దేవుడనేవాడే వుంటే, వాడు కూడా దాన్ని రక్షించలేడనీ.

కొత్త విషయాన్ని కనుక్కొనే ఉత్సా

హంలో ఇంతవరకూ ముందుకు సాగేడు. కానీ చివరికి, అంతా కనుక్కొని, వెనుదిరిగి చూసుకొంటే....తను సాధించిందేమిటి?

డిస్ట్రక్షన్! సర్వనాశనం!!

అతడికి నవ్వూ యేడుపూ ఒకేసారి వచ్చినయ్. అన్ని ఫీలింగులకూ అతీతుడైన ఆ వృద్ధుడి మనసులో కలవరం మొదలైంది.

"ఏం కనుక్కొన్నారు?" శైలజ అడిగింది.

"చాలా గొప్పవిషయాన్ని కనుక్కొన్నాం" అన్నాడు రమణ ఉరకలేస్తున్న ఉత్సాహంతో. "రేపు రాత్రితో...."

"ఆగు" అరిచేడు ప్రొఫెసరు.

రమణ చప్పున చెబుతున్నది ఆపి, చిత్రంగా అతడివైపు చూసేడు. "ఈ విషయం వెల్లడి కావటానికి వీల్లేదు" అన్నాడు. అతడి ముడతలుపడ్డ చెక్కిళ్ళు ఆవేశంతో బిగుసుకున్నాయి. కళ్ళు తీక్షణంగా వెలుగుతున్నాయి. మనిషి ఆవేశంతో ఊగిపోతున్నాడు. పిడికిళ్ళు బిగించి "ఈ విషయం వెల్లడి కావడానికి వీల్లేదు. ముఖ్యంగా పత్రికల వాళ్ళకి —" అన్నాడు. ఇన్నాళ్ళూ మిగతా అబ్జర్వేటరీస్ అన్నీ ఈ విషయాన్ని ఎందుకు వెల్లడి చెయ్యలేదు? అమెరికా, రష్యాలు యెందుకు చెప్పలేదు? ప్రొఫెసర్‌కి అప్పుడు అర్థమయింది....ఈ విషయం వెల్లడి చెయ్యటంవల్ల వచ్చే లాభం ఏమిటి? కేవలం ప్రజల్లో భయోత్పాతం తప్ప! చావు ఎలానూ తప్పనప్పుడు అది తెలియకుండా కావటమే మంచిది. అంతా నిశ్శబ్దంగా జరిగిపోవాలి. తమ పరిశోధన తమతోనే అంతం అయిపోవాలి. ఈ ఆలోచనతోనే అతడు చెప్పొద్దన్నాడు.

రమణ అతని వైపు నిదానంగా చూసేడు.

రమణ ఆలోచన్లు వేరు. ఇంకోలా అర్థం చేసుకొన్నాడు.

ప్రపంచం ఇక పన్నెండు రోజుల్లో అంతం కవబోతూంది. ఆ విషయం అందరికీ తెలిస్తే —దీన్ని ఈ విపత్కర పరిస్థితినుంచి రక్షించటానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు. ప్రతీ సైంటిస్టూ ప్రాణాలు ధారబోసి దీన్ని ఆపటానికి పరిశోధనలు మొదలుపెడ్తాడు. ఈ వృద్ధుడు ఎందుకు తనని చెప్పొద్దంటున్నాడు?

అతడికి చప్పున ఓ విషయం అర్థమయింది.

నోబుల్‌ప్రైజ్!

అవును. నోబుల్‌ప్రైజ్.

ఈ పదిరోజులూ ఏదైనా కృషిచేసి, దీన్ని తనే సాధించాలని ఈ ప్రొఫెసర్ ప్రయత్నం. ఒకవేళ తను సాధించలేకపోతే ఈ ప్రపంచం నాశనమైపోయినా దానికి సిద్ధపడ్తాడు కానీ, ఈ అవకాశం మరొకరికి దక్కనివ్వడు.

'మనిషెంత స్వార్థపరుడు!' అనుకొన్నాడు రమణ.

ఒకవైపు కొంప అంటుకు పోతూవుంటే, ఇంకోవైపు అందులో తనకేం దొరుకుతుందా అని వెతుకుతున్నాడు ప్రొఫెసర్.

అతడో నిర్ణయానికి వచ్చేడు. ప్రొఫెసరు వైపు సూటిగా చూసి "నేను చెప్పాలి. చెప్పకుండా నన్నెవరూ ఆపుచెయ్యలేరు" అన్నాడు. అని, ఆమెవైపు తిరిగి, "రేపు రాత్రి పన్నెండుగంటలకి...." అంటూ యేదో అనబోయాడు.

ప్రొఫెసరు కదిలేడు. నరనరాల్లో వున్న బలం అంతా చేతుల్లోకి తెచ్చుకొని, రమణ నోరు మూయ్యటానికి ప్రయత్నించేడు. కానీ అతడి బలం చాల్లేదు. ఒక్క విసురుతో పడిపోయేడు.

రమణ ఆమెవైపు తిరిగి, "మన పత్రికకి ఒక న్యూస్! ఎవరూ నమ్మలేనిది. కానీ పచ్చి నిజం. ఎవరూ నమ్మలేకపోయినా అది నిజం!! ఈ ప్రొఫెసర్ యెంత గొప్పవాడో నాకు తెలుసు. కేవలం స్వార్థంవల్ల ఇలా అయ్యేడు. కానీ నిజంగా గొప్పవాడు. అతడి లెక్క తప్పటానికి వీల్లేదు. శైలజగారూ వినండి. రేపు రాత్రి చంద్రుడికి ఆఖరు రాత్రి. స్మాష్. చంద్రుడు స్మాష్ అవబోతున్నాడు. ప్రకటించండి. మన పత్రికలో పెద్ద అక్షరాల్తో ప్రకటించండి. ప్రపంచపు భవితవ్యం రేపు రాత్రి పన్నెండుగంటలకి తేలిపోతుంది. అందర్నీ చూడమనండి. ప్రపంచాన్ని రక్షించటానికి అందర్నీ నడుం కట్టుకోమనండి...."

(ఇంకా వుంది)

మినీ కథ

తాయెత్తు మహిమ

కె. వి. యస్. వర్మ

పన్నెండేళ్ళ నరసింహరాజుకు కన్నీళ్లొచ్చాయి. అతని చుట్టూ నలుగురు కుర్రాళ్ళు మూగారు. సైకిలికి తగిలించిన కారియర్ వుంది. సైకిల్ మాత్రం లేదు. స్కూలు విడిచిపెట్టి, అప్పుడే అరగంటయ్యింది.

ఏడుపుమొహంతో నరసింహరాజు హెడ్ మాస్టారి దగ్గరి కెళ్ళాడు. తన సైకిల్ పోయిందని చెప్పాడు. పెద్దవాళ్ళను తీసుకునివెళ్ళి, పోలీసు రిపోర్టివ్వమని హెడ్‌మాస్టరు సలహా యిచ్చాడు.

నరసింహరాజు బుర్రూపి, స్నేహితుని సైకిల్‌మీద యింటికెళ్ళాడు. ఏడుస్తూ, సైకిల్ పోయిందని తండ్రికి చెప్పాడు.

"ఫర్వాలేదు. యేడవకు. రేపు రిపోర్టిద్దాం. ఆ సైకిలు దొరక్కపోతే, కొత్తది కొంటాను, సరేనా" అని తండ్రి బుజ్జగించాడు.

నరసింహరాజు పడుకున్నాడు. రెండు రోజుల క్రితమే సైకిల్ సీటుకు వేయించిన వచ్చకవరు కల్లో కొచ్చింది.

మర్నాడు, నరసింహరాజును తీసుకుని పోలీసుస్టేషన్‌కు వెళ్ళాడు అతని తండ్రి. అక్కడ హెడ్ కానిస్టేబుల్, మరికొందరు పోలీసులూ వున్నారు. హెడ్ కానిస్టేబుల్‌కు నరసింహరాజు తండ్రి సైకిల్ పోయిన విషయం చెప్పాడు.

"అలాగా" అని గంభీరంగా తలూపి, "అనుమానం వచ్చి నిన్నో సైకిలు పట్టుకున్నాం. అదేనేమో చూడండి" అన్నాడు హెడ్ కానిస్టేబుల్. నరసింహరాజు పరుగున వెళ్ళి చూశాడు. సైకిలు తనదే. అతనికి హెడ్ కానిస్టేబుల్ దేవుడిలా కనిపించాడు. అంతా గమ్మత్తుగా వుందతనికి. తండ్రి థాంక్స్‌చెప్పి వచ్చేయబోతుంటే "అదేమండీ. రెండొందల రూపాయల సైకిలు దొరికితే...." అన్నాడు హెడ్ కానిస్టేబుల్. తండ్రి నవ్వి, రెండువదులు అతని చేతిలో పెట్టి, సైకిలు తీసుకుని బయటకు వచ్చేశాడు.

"నాన్నా, సైకిలు బలే పట్టుకున్నారు కదూ...."

"యేడ్చేరు. అంతా నాటకం" అన్నాడు తండ్రి కోపంగా.

నరసింహరాజుకు అర్థం కాలేదు. అతనికా మాయ అర్థం కావడానికి యిరవైయేళ్ళు పట్టింది. ఇప్పుడతను సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. □

చలి

బి. నరసింగరావు

రాత్రి.

వర్షం చినుకులు మొదలయ్యాయి.

రానురాను వర్షం యెక్కువవుతోంది. ఇప్పుడు వర్షం జోరుగా కురుస్తుంది. చినుకులు వాడి బాణాల్లా భూమిమీదికి విసురుతున్నాయ్! "బోయ్-" మనే చప్పుడు చెవులు గింగుర్లెత్తేలా వినిపిస్తుంది.

మెరుపులు ఉరుములు.

కళ్ళు మిరుమిట్లుగొల్పే మెరుపులు. చెవులు చిల్లులుపడే ఉరుములు.

హైదరాబాద్ మేడల తలుపులు కిటికీలు మూసుకున్నాయ్. ఏ కొద్ది హోటల్లో తెరవబడి వున్నాయ్.

ఆ సమయాన పోచమ్మ రెండు కళ్ళూ తెరుచుకునే ఉన్నాయి. మరో చిన్న ప్రాణి రెండుకళ్ళు మూతబడి లోలోపల కలలు కంటున్నాయి.

నర్సయ్య తన నొదిలి నేటికి నలభై రోజులు.

నర్సయ్య మరొకతిని తీసుకొని తెలియకుండా వెళ్ళిపోయికూడా సరిగ్గా నలభై రోజులే!

పోచమ్మ వీధిన పడింది కూడా నలభై రోజుల క్రితమే!

ఈ నలభై రోజులనుండి ఆ పనీ ఈ పనీ చేసుకుంటూ పొట్ట పోసుకోవడంతో గడిచిపోయింది.

ఈ రోజుతో తనకు ప్రపంచంతో పని తీరిపోయింది.

ఈ వర్షంనుండి-ఈ భయంకర వాతావరణం నుండి బ్రతికి బయటపడ్తే ఏ పల్లెపట్టుకో పోయి తలదాచుకోవాలి.

ఏణ్ణర్థంకింద నర్సయ్య పోచమ్మను పెళ్ళి చేసుకున్నాడు. ఏడాది తిరిగేలోపుగా మూడ్నెల్ల క్రితం పట్నం తీసుకవచ్చాడు. నెల ఇరవై రోజులు ఆ కూలి ఈ కూలీ చేస్తూ గడిపారు. నలభైరోజులక్రితం ఎవత్తినో ఎత్తుకొని మాయమయ్యాడు.

ముక్కు మొకం యెరుగని పట్నంలో పోచమ్మ ఒక్కత్తయింది.

చంకలో ఆర్నెల్లు తిరగని బిడ్డ.

దేశంకాని దేశమొచ్చి బజార్న పడ్తిని కదా!

ఇదేం వాన: ఇక నా గతేంకాను?

వర్షం జోరు ఇంకా యెక్కువయింది.

పోచమ్మ తడిసి ముద్దయిపోయింది. బిడ్డను యెదకు హత్తుకొని కొంగుతో చుట్టేసింది.

వర్షం గుండుసూదుల్లా గుచ్చుకుంటుంది.

ఏం చేద్దు! బిడ్డ ముద్దయిపోయింది. ఏ పంచ కిందో తలదాచుకోకపోతే బిడ్డ ఉసూరుమంట ప్రాణం విడుస్తుంది. పైగా మూడు రోజుల్నుంచి ఒళ్ళు వెచ్చబడ్డది. కక్కుతుంటోంది.

పోచమ్మ పరిగెత్తుతూనే వున్నది. పక్కన పెద్ద హోటలు కనపడింది.

పెద్ద పెద్ద లైట్లు వెలుగుతున్నాయ్.


పోచమ్మ కళ్ళు మెరిశాయి. వాన వెలిసేదాక తల దాచుకోవచ్చు.

గబ గబ హోటలు మెట్లు యెక్కింది. పంచకింద ఓ మూలన నిల్చుంది.

ఎవరూ మనుషులున్నట్లు లేదు.

పోచమ్మ గాలి పీల్చుకున్నది.

బిడ్డ గజగజ వణుకుతున్నది. పోచమ్మ



కొంగుతీసి గట్టిగా పిండింది. అంగి కూడా పిండింది. మళ్ళీ కప్పింది. పోచమ్మ పళ్ళు గజ గజ వణుకుతున్నాయ్.

ఇదేమి మాయదారి వాననో! ఇంక రెండు దినాలు ఓపికపడ్తే ఊరికి బోయేదాన్ని! ఇంతలోనే ఏం ముంచుకొచ్చిందో ఏం పాడో. ఇంతటి వాన ఎప్పుడు జూసింది కాదు. నాకే ఇంత చలివేస్తే పసిగుడ్డు బిడ్డకెంత వొణుకుడు పట్టిందో! నా తల్లి! బతుకు బతుకు!

వర్షం మరీ యెక్కువవుతుంది. ఇప్పుడు వీధుల్లో మనుషులు కూడా కనబడడం లేదు. ముందు ఏమున్నదో తెలవడంలేదు.

మాయదారి వాన యెవరి పానాలకు దాపురించిందో: ఏ అయ్య కట్టించిందో ఈ బంగ్ల. ధర్మాత్ముడు. ఇంత పంచకు తలదాచుకోని బిడ్డను కాపాడుకుంటున్న!

రిక్షాలన్నీ ఆగిపోయాయి! సైకిళ్ళు నడవడంలేదు. మనుషులు అసలు లేరు. పోచమ్మ బిడ్డ కదులుతుంది.

అయ్యో! కడుపు కరకరలాడిందా! పాలు తాగుతదేమో: మూడు దినాలనుండి నాకు కూడే లేకపోయె. నీకు పాలాడికెల్లొస్తయే తల్లీ! అయ్యోరామ ఇదెక్కడి పట్నం! బుక్కెడు బువ్వ దొరకని పట్నం. పసికూనకు పక్తెడు పాలు దొరకని పట్నం.

పోచమ్మ కొంగుదీని రవికదీసి చన్ను బిడ్డ నోట్లో పెట్టింది. వొణుకుతూనే బిడ్డ చన్ను చీకుతోంది.

దాంట్లో ఏమున్నయే తల్లీ! పాలా మన్నా! చీకు చీకు. చీకన్నా జేరంత ఇదైతవు. నా కడుపుల మెతుకు లేదు. నీ నోటికి పాలేడ అందుతయి బిడ్డా. నా బిడ్డ. నా తల్లి. యెల్లమ్మ పేరు పెట్టుకుంటిని గదనే. తల్లికేమన్నా పాపం జేస్తినా! తల్లీ! బతికి బట్టగడ్తె ముడుపుజెల్లిస్త!

ఎంతకూ పాలురాక బిడ్డ మెసులుతోంది. చలికి వొణుకుతోంది.

చీకమ్మా! చీకుబిడ్డా! పాలు లెవ్వు.

బిడ్డ తలను యెదకేసి అదుముకున్నది.

ఇంతలో—

ఒక లావాటి ఎర్రగా ఉగ్రంగా వున్న మనిషి వచ్చాడు.

కౌన్ హై-గరీబ్-హట్ జావ్-బాహర్ జావ్ హూ....

చెలో—

ఏమో అంటున్నాడు. తనకి తెలియని భాషలో, అర్థంకావడంలేదు.

చల్ బాహర్-సునే నహీ, అరా....!కౌన్ హై అందర్. ఇదరావ్—లోపల్నించి ఎవరో వచ్చారు.

పో: పో: అవుతలికి పో!

పొమ్మంటుంటే: నిన్నేనే! చెప్తుంటే మనిషివా గాడిదవా?

నీ తాత జాగీరనుకున్నావా! పో! నడువు!

పోచమ్మ ఇక చేసేదిలేక మెట్లు దిగింది. బిడ్డను యెదకు అదుముకొని వెనక్కి తిరిగి చూసింది. మెట్లదగ్గర వాడు యముడిలా నిలబడ్డాడు. పోచమ్మ వర్షంలోకి నడిచింది.

వర్షం ఏమాత్రం తగ్గలేదు.

ఉరుములు మెరుపులు ఇంకా యెక్కువైనాయి.

కళ్ళు జిగేల్‌మని మెరుస్తున్నాయ్ మెరుపులకు.

గుండె గజ గజలాడుతుంది ఉరుములకు.

తోవ కనబడదు. ముందర అంతా నల్లగా యేమున్నదో కనబడదు. దూరంగా అక్కడక్కడా తెల్లగా మబ్బుల్లాగా కనబడుతున్నయ్ దుకాణాలు. కట్టెతో పొడిచినట్టు వాన శరీరాన్ని బాదుతోంది. పిల్ల యేడుస్తోంది.

పోచమ్మ పరిగెత్తుతోంది. నీళ్ళు మడమలు దాటిపోయాయి.

పోచమ్మ కాలు తీసి కాలు వేస్తున్నది.

అతి కష్టంగా కొంతదూరం నడిచింది.

బిడ్డ గుక్క తిప్పుకోకుండా ఏడుస్తోంది.

పోచమ్మ తనకున్న శక్తినంతా కూడగట్టుకొని కాస్త యెత్తయిన స్థలానికి వచ్చింది. ఇప్పుడు నడవడానికి కాళ్ళు ఇబ్బంది పెట్టడంలేదు. ఒక చిన్న చెట్టు కనబడింది. ఆశతో అటువైపు పరిగెత్తింది.

సర్రున ఒక పొడవాటి కారు ఒకటి దూసుకొని వచ్చింది. హెడ్‌లైట్ల కాంతితో—

వచ్చి సరాసరి ఆ చెట్టుకింద ఆగింది.

ఆ చెట్టుకింద ఆగగానే, చివ్వున చిమ్మిన వర్షపు నీరు కారు టైర్ల కిందనుండి పోచమ్మపై చిమ్మింది. పోచమ్మ ఒక చేత్తో ముఖం తుడుచుకుంది.

పోచమ్మ బిడ్డను గుండెలకు అదుముకుంది. చెట్టుకింద నిలబడ్డా వర్షం పైన పడుతూనే వుంది. బిడ్డ వొణుకుడు మరీ యెక్కువయింది.

పళ్ళు గజ గజ వణుకుతున్నాయ్. కాళ్ళు గజ గజ వణుకుతున్నాయ్! శరీరం మొత్తం గజ గజ వణుకుతున్నది. పోచమ్మ బిడ్డను ఇంకా గట్టిగా కౌగిలించుకున్నది.

చలి. చలి. చలి. యెముకలు కొరికే చలి.

పోచమ్మ ఆకాశంకేసి చూసింది. ఏమీ కనబడలేదు.

అంతా యెగపోతగా వాన:

కారులో లైటు వెలిగింది. లోపల చలిలో ఏవో ఆకారాలు కదులుతున్నాయ్.

అన్నీ అద్దాలు బిగించి వున్నాయ్.

పోచమ్మ!

బిడ్డ! ఇదేం చలి! అయ్యో....

చలికి ఇద్దరు గడ్డకట్టుకు పోతున్నారు. పోచమ్మ పోచమ్మ బిడ్డ. కాళ్ళు కొంకర్లు పోతున్నాయ్. కళ్ళు బైర్లుకమ్మాయి. తల తిరుగుతోంది. బిడ్డ ఏమయిందో! ఏమీ కనబడదు! చలి చంపివేసే చలి! చెట్టుకింద చలికి ఇద్దరూ గిల గిల లాడుతున్నారు. కారులో చలికి ఆ యిద్దరూ వెచ్చదనం రాజేసుకుంటున్నారు. ఏమి చలి ఇది! ద్వంద్వార్థాల చలి! □

బానిసలు

ఈ రోజు
నాలో చెలరేగుతున్న భాష
కలానికి బానిస—
నన్ను ముట్టడిస్తున్న ఆలోచనలు
మెదడుకు బానిసలు—
చైతన్యంతో తిరిగే యంత్రం
చేతికి బానిస—
శత్రువుపై ఎక్కుపెట్టిన తుపాకి
ట్రిగ్గర్‌కు బానిస—
వెన్నెల ప్రసాదించే చంద్రుడు
సూర్యుడికి బానిస—
కాని, రేపు
మొత్తం సమాజమే
కష్టజీవులకు బానిస.

—శైలకుమార్



విశాలాంధ్ర బహుమతులు గెలుచుకున్న

మూడు మంచి నవలలు

కృత్రిమమైన కథా కథనంతో, బుర్ర బద్దలు కొట్టే అనవసరమైన అసహజమైన సస్పెన్సులతో, ఎడబాట్లనూ, ఏడుపు సన్నివేశాలనూ అక్కడక్కడ ఊరగాయల్లా అద్దుతూ పాఠకులను నిద్రపుచ్చి స్వప్న ప్రపంచంలోకి తీసుకువెళ్ళే నవలలు పుంఖాను పుంఖంగా వెలువడుతున్న దశలో వుంది నేటి తెలుగు నవలా సాహిత్యం. ఈ పరిస్థితులలో, కొందరు రచయితలు, రచయిత్రులు, ప్రచురణకర్తలు, పత్రికల వారూ, స్వాప్నిక జగత్తులో పడివున్న సగటు పాఠకుణ్ని తట్టి లేపి వారిలో ఎక్కడో అణిగివున్న సంస్కారాన్ని మేల్కొలిపి, పదును పెట్టి, 'చుట్టూవున్న అసలు సిసలైన జీవితాన్ని చూపిస్తో'—ఈ సమస్యలకు పరిష్కారం గురించి ఆలోచించమని చెప్పి, వాళ్ళను చైతన్యవంతం చేయడానికి చూస్తున్నారు.

పాఠకులలో అటు వంటి మనోవికాసం రావాలని ఆశిస్తూ, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ వారు—తమ మూడవ ప్రయత్నంగా 1979లో నవలల పోటీ నిర్వహించారు.

ఆ పోటీలో 'మనిషికీ మనిషికీ మధ్య' వుండే మహత్తరమైన అనుబంధం గురించిన నవల (వెల: ఐదురూపాయలు. ప్రతులకు విశాలాంధ్ర పబ్లిషింగ్స్ హౌస—చంద్రం బిల్డింగ్స్, విజయవాడ - 520 004) రాసి, ప్రథమబహుమతిని గెల్చుకొన్నారు వి. రాజా రామమోహనరావుగారు.

ఈ నవలలో రంగారావు, లక్ష్మీపతి దోపిడీ వర్గానికి ప్రతీకలు. శ్రామికుల హక్కులకు సమాధులు కట్టి, వాటిపై అందమైన భవంతులు నిర్మించుకోడానికి తహ తహలాడే వ్యక్తులు. వాళ్ళకు విశ్వాసపాత్రుడుగా వుంటూ జీవితాన్ని వెళ్ళబుచ్చాలని ఆశించే అప్పారావు, అతనివంటి వ్యక్తుల ఆధారంతో జీవించే మల్లీశ్వరి, అప్పారావు దయతో బ్రతికే నారాయణ వంటివాళ్ళు—నిజ జీవితంలో అప్పుడప్పుడు తటస్థపడుతుంటారు. జీవితం అంటే తమ అవసరాలు మాత్రమే చూసుకోవడం కాదని, జీవితానికి మరో అర్థంకూడా వుందనీ చెప్పే సత్యంతో—అసలు కథ ప్రారంభం అవుతుంది. సత్యం ఒక్కసారిగా విప్లవ నినాదాలు చెయ్యడు. సమస్యలను ఆకళింపు చేసుకొని, శ్రమజీవులకు ఏ విషయం, ఎలా, ఎప్పుడు చెప్పాలో తెలుసుకొని, అప్పుడు తాను చెప్పదలచుకొన్నది చెప్పి, వాళ్లకు తన మాటల్లో గురి కుదిరేలా చేస్తాడు. 'సారా మత్తు.... బూతు సాహిత్యం.... దానికి తగినట్లున్న డాన్సుల మత్తు.... చాలామంది వొళ్ళు మరిచి పోయినవాళ్ళ కళ్ళు' తెరిపిస్తాడు.

కథకు ఆలంబన చేసుకొన్న వాతావరణంలోని కొత్తదనంవల్ల, 'మూగ' పాత్రలు కూడా కూడా జీవం వున్న పాత్రలలాగే కనిపిస్తాయి. సహజత్వం కంటే, 'ఆదర్శవాదం' పాళ్ళు ఎక్కువగా వున్నా, పాత్రల చిత్రీకరణలో రచయిత ప్రదర్శించిన ప్రతిభవల్ల, ఆ అంశం మరుగుపడింది. నవల ముగింపు ఆశావాదాన్ని ప్రతిబింబించింది.

కొత్త పుస్తకం

రెండవ బహుమతి పొందిన నవల డా॥ కేశవరెడ్డిగారు రాసిన 'స్మశానం దున్నేరు' (వెల ఆరు రూపాయలు.)

కొన్ని మంచి నవలలు—తాపీగా చదివించి మనల్ని ఆలోచింపజేస్తాయి. మరికొన్ని మనసును చిందరవందర చేసి, మనకు 'షాక్ ట్రీట్‌మెంట్' యిచ్చిన అనుభూతి కలుగజేస్తాయి. 'స్మశానం దున్నేరు' సరిగ్గా యిటువంటి నవలే!

కులాల్లో ఎన్నో రకాలు వున్నాయిట. కొన్నిటిని పై తరగతి కులాలంటారు. మరి కొన్నిటిని కింది తరగతి కులాలంటారు. కాని కింద తరగతిగా చెప్పబడేవాళ్ళు, తమ వారిలోనే కొందరిని తమకంటే 'తక్కువ' వాళ్ళుగా, ఈసడింపుగా చూస్తారు. అలాంటి ఒక 'తక్కువ' మనిషి వీరభద్రుడు. ఇటువంటి వీరభద్రులే — వారానికి దాదాపు నాలుగు సార్లయినా—మన దేశంలో ఎక్కడో ఒక చోట—ఏదో రకమైన 'చావు'తో పత్రికల వార్తల్లో కనిపిస్తూ వుంటారు.

మన దేశంలో పేదవారికి న్యాయం లభిస్తుందా? చట్టాలు ఏం చేస్తున్నాయి? ప్రభుత్వాధికారులు దుర్మార్గులను అణగద్రొక్కి, సన్మార్గులకు న్యాయం కలిగిస్తున్నారా? ప్రభుత్వాలు వున్నది ఎందుకు? ప్రజలను రక్షించడానికా? భక్షించడానికా?........ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు—ఈ నవల చదివిన తర్వాత మనల్ని కలచివేస్తాయి.

"నిన్ను కొట్టినోడు పీపైన కాంటు (పగ) పెట్టుకోనుండి కొట్టలేదు. సావకార్లను సంతోసపెట్టేదానికి కొట్టుంటారు. నాకు తెల్సు....పై వాళ్ళను మెప్పించేదానికి పోలీసోల్లు అన్నెం పున్నెం తెలవనోళ్ళను తీసుకపోయి, తుపాకుల్తో కాల్చి సంపతా ఉంట్లేదా? అట్టనే."

"పోలీసోళ్ళు గూడా అంతేనంటావా?"

"పోలీసోల్లూ అంతే....వాకీల్లూ అంతే. అందరూ అంతే."

ఇద్దరు దగాపడిన తమ్ముళ్ళ మధ్య సాగిన సంభాషణ యిది. ఉన్నవాడు, లేనివాడి శ్రమశక్తిని దోచుకోవడమే కథావస్తువు. ఈ నవలలో ప్రతి పాత్ర, ఆ పాత్ర ప్రతి కదలికా, సజీవంగా కనిపిస్తుంది.

దోపిడీ వర్గం అభివృద్ధికి కొమ్ముకాసే వెంకటాద్రివంటి మధ్య తరగతి వ్యక్తులు యెలాంటి పరిణామాన్ని యెదుర్కోవలసి వస్తుందో, తమకు జరిగిన ఘోరాలకు-ప్రతీకారం తీర్చుకోవాలని అనుకున్నప్పుడు సంఘటిత శ్రామికశక్తి ఏ విధంగా విజృంభిస్తుందో-అద్భుతంగా చిత్రీకరించిన నవల యిది. శ్రమజీవులకు వాళ్ళ హక్కులు, బాధ్యతలు గురించి 'ఎడ్యుకేట్' చేస్తూ, వారిని శ్రమశిక్షణాయుతమైన విప్లవపథంవైపు నడిపించే—'రాజకీయ నాయకత్వం' లేనప్పుడు — ఎలాంటి తీవ్రమైన పరిణామాలు ఏర్పడతాయో పరోక్షంగా నిరూపిస్తున్నది ఈ నవల.

మూడవ బహుమతిపొందిన నవల—(వెల: ఏడు రూపాయలు) దశరధ్‌గారి 'శతాబ్దాల నిశ్శబ్దం' ఈ నవలలోనూ పల్లె ప్రజల సమస్యలు—వాళ్ళలో వున్న మూఢ నమ్మకాలు-వాళ్ళ తెలివితేటలు అభివృద్ధి చెందితే—తమ ఉనికికి ఎక్కడ ప్రమాదం ఏర్పడుతోందో అని కంగారుపడే జమీందారు కుటిలనీతి, అతని చెప్పుచేతల్లో వుండే జనం ఆలోచనలు-కనిపిస్తాయి. వెనుకబడిన వర్గాల అభివృద్ధిని కాంక్షించే ఉపాధ్యాయుడు యావగిరి, పార్టీ వర్కరు మల్లయ్య హత్య కావింపబడడం—వాస్తవ జీవితంలో సంభవమే అయినప్పటికీ, ముఖ్యమైన పాత్రలను అలా చిత్రించడంవల్ల ఆ ధోరణిలో ఆలోచించేవారు కొంత నిరాశావాద ధోరణికి లోనయ్యే అవకాశం వుంది. ఆ విధంగా 'పోజిటివ్' ప్రయోజనంకంటే, 'నెగిటివ్' ప్రయోజనం కలిగే ప్రమాదం వుంది! 'దొర' బిడ్డ పద్మ,వ్యవసాయకూలీ గంటయ్య కొడుకు సీరన్న—పెళ్ళి చేసుకోవడం కూడా కొంత అసహజంగానే వుంది. ఇది రచయిత తొలి నవల. ఐనప్పటికీ—నవలలో పల్లె వాతావరణాన్ని సమగ్రంగా చిత్రీకరించడంలో రచయిత పూర్తిగా కృతకృత్యులయ్యారు.

ఈ నవలలు మూడూ చదివిన తర్వాత ఇతివృత్తాలలో ప్రధానాంశం దాదాపు ఒకేలా కనిపించినా, అది కాకతాళీయంగానే జరిగిందని భావించవచ్చును. ఐతే—ఇవి ఒకేసారి చదివిన తర్వాత అభ్యుదయ రచనలు అనగానే— 'భూస్వాములు పేదలను పీడించటం—వాళ్ళు తిరగబడడమే' ప్రధాన కథావస్తువుగా కొందరు అర్థం చేసుకొంటే, అది పొరబాటే అవుతుంది. (అదే అభ్యుదయ రచన అని భావించే వారికి, జీవితంలోని యితర అంశాల ప్రాతిపదికపై కూడా అభ్యుదయ దృక్పథాన్ని ఎలా ప్రతిబింబింపవచ్చునో తెలియజెప్పే — సాహిత్య విమర్శలు—మన పత్రికలలో చోటు చేసుకోకపోవడం కూడా విచారకరమైన అంశం!) ధనస్వామ్య వ్యవస్థలో జరిగే అన్యాయాలను రచనలలో చిత్రీకరించడానికి అనువుగా ఎన్నో రకాల సమస్యలు, భిన్న విభిన్న స్వభావాలుగల వ్యక్తుల ధోరణులు నిత్య జీవితంలో కనిపిస్తూనే వుంటాయి. ఆ జీవితాలను సమగ్రంగా రచనలలో చూడగలిగినప్పుడు—కథావస్తువులలో వైవిధ్యం వుంటుంది.

మంచి అభిరుచితో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌వారు నవలల పోటీ ఏర్పాటు చేసి, ఉత్తమమైన నవలలను ఎన్నుకుని, తక్కువ ధరలలో పాఠకులకు అందుబాటులో వుండేట్టు ప్రచురించారు. ఈ విషయమై విశాలాంధ్ర ప్రచురణాలయంవారిని అభినందించక తప్పదు.

—సత్యాపతి

'జ్యోతి' యాజమాన్యం — తదితర వివరాలు

ఫారం 4 (8వ నిబంధన ప్రకారం)

ప్రచురణ స్థలం		మద్రాసు
ఎంత కాలాని కొకసారి	:	నెలకొకసారి
ముద్రాపకుని పేరు	:	శ్రీ డి. హనుమంతరావు
జాతి	:	భారతీయుడు
విలాసం	:	2, ఫ్రాన్సిస్ జోసెఫ్ స్ట్రీట్,
	:	మద్రాసు-1.
ప్రకాశకుని పేరు,	:	శ్రీమతి వి. లీలావతి
జాతి	:	భారతీయురాలు
విలాసం	:	17 బి, రాజారాం కాలనీ, మద్రాసు-600 024
సంపాదకుని పేరు	:	శ్రీమతి వి. లీలావతి
జాతి	:	భారతీయురాలు
విలాసం	:	17బి, రాజారాం కాలనీ, మద్రాసు-600 024
పత్రిక యజమానురాలు	:	శ్రీమతి వి. లీలావతి

పై విషయములు నాకు తెలిసినంతవరకు వాస్తవమైనవని తెలియజేస్తున్నాను.


మద్రాసు 600 024 }

(సం) వి. లీలావతి

అర్ధరాత్రి వాన

ఎన్. గోపి

• భయపడ్డ ఒంటరి ఆడపిల్ల వెంట
పరిగెత్తే గూండాలా
మెరుపు వెనక వురుము
ఎంతటి నియాన్ లైట్లైనా
ఏడుపు మొగాలు వేసుకుంటే
చెక్కిళ్ళమీద ప్రతిఫలించే వెచ్చటి చినుకులు!
"ఏ అనాథ వీథుల్లో నడుస్తున్నాడో
అతడింకా రాలేదు కాస్సేపాగు వానా!" అంటూ
వానకన్న ముందే కురుస్తున్న
కిటికీకి వేలాడగట్టిన కళ్లు!!
తలమీద నీడలేని
తల పండిన బిచ్చగాళ్లు గోడవారన ముడుచుకుంటే
నాగుబాముల్లా నడిచొచ్చే కాలువలు...
ఈ పట్టపగటి చీకటిలో
ఈ ఏడేడు మేడల శాలసీల కారడవుల్లో
ఈ అనాథ అసహాయ
క్షుధామయ నిశీథిలో
ఈ వాన ఇంత ఒంటరిగా
ఎవరికోసం వెతుకుతూంది?
పిచ్చెక్కి ఏ దిక్కున పరుగెత్తుతూంది?
కాని
దాని రాక్షస తడి పాదాల కింద
అది విసిరిపోయిన ఇనప దుప్పటి కింద
బతుకు నలిగిన
తొడిమె లేని మూగ మూగ పూలను
రేపటి కిరణాలు లెక్కిస్తాయి.



విజయీభవ

శంకరాభరణం విజయవంతంగా నడుస్తోంది. భారీ తారా చిత్రాల ఫార్ములాకి భిన్నంగా తీసిన సినిమాలని జనం చూడరేమోనన్న భయాన్ని పటాపంచలు చేస్తూ, యూనివర్శిటీ రీడర్ నుంచి రిక్షావాలా వరకు అన్ని తరగతుల ప్రేక్షకులూ 'శంకరాభరణం' చూస్తున్నారు. తారా తోరణాలు కట్టని సినిమాలు కూడా డబ్బు చేసుకొంటాయనే విశ్వాసం నిర్మాతలలో కలుగుతోంది. తారలు లేకపోవడమే శంకరాభరణం విజయానికి కారణంకాదు. కె. విశ్వనాథ్, బాలూమహేంద్ర, కె. వి. మహదేవన్ వంటి అపురూప సృష్టికర్తల సమ్మేళనం, సోమయాజులు, మంజుభార్గవి వంటి రసగంగలు పొంగించగల నటనావైదుష్యం, శంకరాభరణాన్ని సామాన్య భాషలో రాసిన మహాకావ్యంగా మలచి ప్రేక్షకుల హృదయాలను

'శంకరాభరణం' విజయోత్సవ సందర్భంగా నిర్మాత శ్రీ ఆకాశం శ్రీరాములును అభినందిస్తున్న లక్ష్మీ ఫిలిమ్స్ రాఘవేంద్రరావుగారు.





'తల్లిదండ్రులూ జాగ్రత్త'లో సత్యచిత్ర, మాస్టర్ వంశీ

చెరువ చేశాయి. శంకరాభరణం, సీతవంటి చిత్రాల విజయం కొత్తదారి తొక్కాలని చూస్తున్న వారికి నైతికబలాన్నిచ్చే టానిక్‌గా కొంతమేరకు పనిచేసింది.

'జాతర' విడుదల

సౌమ్య ఫిలిం ఆర్ట్స్ వారు నవదర్శకుడు ధవళసత్యం దర్శకత్వంలో నిర్మించిన, జీవిత వివర్ణదృశ్యాలను చూపే వర్ణచిత్రం 'జాతర' మార్చిలో విడుదల కానుంది. నాగభూషణం, శ్రీధర్, చిరంజీవి, సువర్ణ, మాడా, పి. ఎల్. నారాయణ వంటి ప్రతిభావంతులైన నటీనటులతో, పూర్తిగా ఒక కోనసీమ పల్లెలో నిర్మించిన యీ చిత్రం యీ నాటి గ్రామీణ ఆర్థిక, సాంఘిక జీవితం మీద కళాత్మకమైన, ఆలోచనాత్మకమైన వ్యాఖ్యానంలా వుంది. ఇటువంటి చిత్రాలు విజయవంతమైతే తెలుగు సినిమా నడకలో కొంతలో కొంత మార్పుకు అవకాశం వుంటుంది. చెరుకూరి జనార్దనరావు సమర్పిస్తున్న ఈ చిత్రం నిర్మాత ఆర్.ఎస్. రామరాజు.

'మా భూమి'

చైతన్య చిత్ర ఇంటర్నేషనల్ పతాకంతో

'మాయదారి కృష్ణుడు'లో రతి





విపంచీ ఇంటర్నేషనల్ వారి 'డాక్టర్ మధు' చిత్రంలో హల్లో బాచురల్ బోయ్ పాటను పాడిన జానకితో సంగీత స్వరబ్రహ్మ, వైణిక సార్వభౌమ చిట్టిబాబు.

బి. నరసింగరావు, జి. రవీంద్రనాథ్ బెంగాలీ దర్శకుడు గౌతమ్‌ఘోష్ దర్శకత్వంలో నిర్మించిన 'మా భూమి' కూడా మార్చిలో విడుదల కాబోతోంది. ఇందులో ప్రముఖనటుడు కాకరాల తప్ప, మిగిలిన వారందరూ కొత్తవారే. కీ. శే. గోపీచంద్‌గారి అబ్బాయి సాయిచంద్ కథానాయకుడుగా నటించిన 'మా భూమి' వెలుగుతెరమీద మొట్టమొదటి సంపూర్ణ రాజకీయ చిత్రమవుతుందని, యిటీవల బెంగుళూరులో ఫిల్మోత్సవ్‌లో ఈ చిత్రం ప్రదర్శించినప్పుడు విమర్శకులన్నారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా 1947-48 ప్రాంతాలలో తెలంగాణా ప్రజలు జరిపిన వీరోచిత పోరాటం ఈ చిత్రాని కథ. శంకరాభరణం చిత్రాన్ని విడుదల చేసిన లక్ష్మీఫిలింస్‌వారే 'మా భూమి' 'జాతర' చిత్రాలను ఆంధ్రలో విడుదల చేయడం విశేషం.

'వి. కె.' వెంకట్రావుగారి చిత్రం

విజయవాడలోని ప్రముఖ సినిమా పబ్లిసిటీ సంస్థ వి. కె. అడ్వర్టయిజర్స్ సారథి వి. వెంకట్రావుగారు సాయిబాబా మూవీస్ పేరిట ఒక నిర్మాణ సంస్థను ప్రారంభించారు. వీరి తొలి చిత్రానికి కథ, మాటలు, దర్శకత్వం దాసరి నారాయణరావు. సంగీతం: కె.వి. మహాదేవన్. ఫిబ్రవరి 14 న పాటల రికార్డింగ్‌తో నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సినిమా పేరు 'కేటుగాడు'. మోహన్‌బాబు, రావు గోపాలరావు, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, సీమ, సుభాషిణి, నిర్మల ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

రచయితల చిత్రం

పాఠక ప్రపంచంలో మంచి రచయితగా గుర్తింపువున్న కొమ్మూరి వేణుగోపాలరావు సినిమారంగంలోకి యండమూరి వీరేంద్రనాథ్ 'తాండవ కృష్ణా తారంగం' చిత్రనిర్మాణం వెనుకనిలిచి, సినిమారంగ ప్రవేశం చేశారీ మధ్య. ఈ చిత్రానికి ఆయనే కథ రాశారు. మరొక కథారచయితగా మంచిపేరున్న మరొక రచయిత డి. ప్రభాకర్ 'తాండవ కృష్ణా తారంగం' మాటల రచయిత. కొంత ఆలస్యంగా ప్రారంభమైనా, పత్రికలకీ, పుస్తకాలకీ, రేడియోకీ మాత్రమే పరిమితమైపోతున్న రచయితలు సినీమారంగంవైపు దృష్టి మరల్చే ఈ ధోరణి ఆహ్వానించదగింది. చంద్రమోహన్, ప్రభ, సత్యేంద్రకుమార్, అనిత రెండు జంటలుగా నటిస్తున్న యీ సినిమాకి సంగీతం తాతినేని చలపతిరావు, దర్శకుడు రాజ్‌కుమార్ నిర్మాత: మునునూరు కోటయ్య చౌదరి, సహ నిర్మాత: ఎం. ఏ ఖలీల్.

కుక్క

ఆవునిది సినిమా పేరే. మనకి అలవాటైన సినిమా పేర్లకీ దీనికీ యెంత తేడా! యండమూరి వీరేంద్రనాథ్‌గారి నాటిక 'కుక్క'

శ్రీ సాయిబాబా మూవీస్ 'కేటుగాడు' చిత్ర ప్రారంభోత్సవం సందర్భంలో దర్శకుడు దాసరిని సత్కరిస్తున్న నిర్మాత వి. వెంకట్రావు మధ్యన వున్నది శ్రీ కె. వి. మహాదేవన్





'కత్తు'లో శోభన్ బాబు, జయచిత్ర

ఆయన యితర నాటికలంత విస్తృతంగా ప్రదర్శించబడకపోయినా జీవమున్న మంచి నాటికగా ప్రశంసించబడింది. 'కుక్క' యిప్పుడు సినీమాగా రాబోతోంది. రచయితే చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఫిబ్రవరి 12 నుంచి హైదరాబాదులో నిర్మాణం ప్రారంభమైన ఈ జీవితచిత్రంలో నారాయణరావు, పి.ఎల్. నారాయణ, గీత, శ్రీనివాసరావు, మాస్టర్ దిలీప్ ముఖ్యపాత్రలు ధరిస్తున్నారు. నిర్మాతలు: పి. ఆర్. వెనిదండ్ల, డాక్టర్ చౌదరి, పతాకం: అంత్యోదయా ఆర్ట్స్.

రాజుగారి తోటలో రాజాధిరాజు

తేది: ఫిబ్రవరి 18, సమయం: ఉదయం పదకొండు గంటల ముప్పయి నిముషాలు. స్థలం: మద్రాసు. ఏ. వి. ఎమ్. స్టూడియో అవతల వున్న రాజాతోపు (రాజాగారి తోట) అనబడే మామిడి తోపు. ఎండ చిటపటలాడుతూ వుంది. మామిడిచెట్టు నీడలో, ముతకఖద్దరు అరచేతుల చొక్కా, చిక్కటి టీ రంగు ప్యాంటూ, చేతిలో పైపూ, కళ్ళజోడు వెనకవెన్న కళ్ళలో రసమయ చలనచిత్ర కావ్యాలకైపూ వున్న ఒక మనిషి— ఆయన బాపు. కెమెరా వెనక ఆజానుబాహుడైన ఒక యువకుడు. ఆయన ఛాయాగ్రహణ దర్శకుడు బాబా అజ్మీ (ప్రఖ్యాత కవి కైఫీ అజ్మీ కొడుకు, నటి షబ్నాఅజ్మీ సోదరుడు) కెమేరా కంటి ముందు విలాసపురుషుడైన రాబిన్ హుడ్ లాంటి వేషంలో విజయచందర్, మేకప్ వేసుకున్న చెంచులక్ష్మిలావున్న నర్తకి రాజేశ్వరి. "తాగు భాయ్ తాగు" అని పాట. బృందగానం. నర్తకులు చాలామందున్నారు. ఆడా, మగా. ఆ మామిడితోటలో బాపుగారిది. వరకు కూడా షూటింగ్ చేశారు. గోరంత దీపంలో కూడా ఆ తోటని వాడుకున్నారుప. అతిసామాన్యంగా వున్న ఆ మామిడితోట ఆయన చిత్రీకరణలో అపురూపవనంగా మారుతోంది. ఆయన మాంత్రికుడు. ఆ కాగితాల మీద బొమ్మలకే కాదు, సెల్యులాయిడ్ మీద ఛాయలకి కూడా ఆయన చేయి తగిలితే ప్రాణమొస్తుంది. బాపు మార్గ దర్శకత్వంలో (అనితర సాధ్యం ఆయన మార్గం) 'రాజాధిరాజు' మనోజ్ఞంగా రూపుదిద్దుకొంటోంది. ఫిబ్రవరి చివరి



'బుచ్చిబాబు'లో నాగేశ్వరరావు, జయప్రద

వరకు (ఫిబ్రవరి 6 న ప్రారంభమైంది షెడ్యూలు) జరిగే ఈ షెడ్యూలుతో షూటింగ్ పని పూర్తవుతుంది.

వీణ చిట్టిబాబుగారి 'డాక్టర్ మధు'

వీణ చిట్టిబాబుగారి పేరు విననివారు సంగీత ప్రియుల్లో వుండరు. ఆయన చేతిలో వీణ ఆధునిక రాగామాలికలను అలంకరించుకొంది. చిట్టిబాబు గారిప్పుడు 'డాక్టర్ మధు' అనే సినీమాని తీస్తున్నారు. అనంతనాగ్, ఇంకా రమణమూర్తి, పి. ఎల్. నారాయణ మొదలైన వారు నటిస్తున్నారు. ఈ చిత్రానికి పేటూరి [illegible] యిత. నిర్మాత సి. [illegible]దేవి.

125 రోజులు పండిన గోరింటాకు

'మంచి సినిమాలు తీస్తే పదేపదే చూసి, నిర్మాతలకి అభయమిచ్చే మంచి ప్రేక్షకులు కూడ అధికంగానే వున్నారని నిరూపించింది' గోరింటాకు, శంకరాభరణం చిత్రాల ఘన విజయం అన్నారు లక్ష్మీఫిలింస్ అధినేత, ప్రముఖ వాణిజ్యవేత్త, రాజ్యసభ సభ్యుడు శ్రీ కె. ఎల్. ఎన్. ప్రసాద్, గోరింటాకు విజయోత్సవ సభలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ. దాసరి నారాయణరావు దర్శకత్వం [illegible] గోరింటాకు 125 రోజులు ఎగ్రేగా [illegible] సందర్భంగా మర్నాడు తాజ్ కోర[illegible] హోటల్లో నిర్మాతలు పండుగ జరి[illegible] భారత చలనచిత్ర సమాఖ్య అధ్యక్షుడు



‘శంకరాభరణం’ రాష్ట్రపతి ప్రత్యేక ప్రదర్శన సందర్భంగా శ్రీ శంకరశాస్త్రి పాత్రకు జీవంపోసిన శ్రీ జె. వి. సోమయాజులును అభినందిస్తున్న రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి మధ్యన ఉన్నవారు దర్శకులు శ్రీ కె. విశ్వనాథ్


శ్రీ డి. వి. ఎస్. రాజు అధ్యక్షత వహించారు. కె.వి. మహదేవన్ సతీనటులకు మెమెంటోలు బహూకరించారు. సాంఘిక ప్రయోజనం గల చిత్రాలు నిర్మించవలసిన అవసరం ఎంతైనా వున్నదని, చెపుతూ, సినిమారంగం యెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవసరమైతే, తమ పలుకుబడిని తప్పకుండా వినియోగిస్తామని శ్రీ కె. ఎల్. ఎన్. ప్రసాద్ వాగ్దానం చేశారు.

—దేవీదాసు

‘మాభూమి’లో సాయిచంద్



శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు ఏప్రెల్’ 80

అడ్డం:

1. [illegible] నోట్లు
3. "[illegible]" [illegible]
5. [illegible]
7. [illegible]
9. [illegible]
10. [illegible]
12. [illegible]
13. [illegible]
15. [illegible]
16. కవి సమర్థుడు
17. డెబిట్ పద్దుకాదు
18. జంతువుకీ చెట్టుకీ సహజం
20. చిరం...18 పిలుపు
22. [illegible]
23. [illegible]
24. [illegible]

నిలువు:

1. ప్రసిద్ధ సోదరి
2. దీన్ని తిప్పితేదాహం
3. గోముఖ వ్యాఘ్రపు ముఖవికాసం
4. మిథున వాంఛ
5. కాచినపాలు ఈవాలు
6. పైసలు (అపూర్వం)
7. తెలిసినవాడు నాటితే ఫలిస్తుంది
8. వికారం ఉన్నా లేకున్నా సమూహం
11. నోరు పెట్టుకు బతికేవాడు
14. 2
15. చాచా నెహ్రూ
18. నక్కకు చుట్టం?
19. కాబట్టి
21. పంతులు కుందదా? (మధురవాణి ప్రశ్న?)
22. KKK
23. 13
24. ఆమ్రేడిత విభక్తి ప్రత్యయం
26. తెలుగు కవి ప్రత్యేకత
28. ముగ్ధ గోదావరి
30. పోలీసు సంజ్ఞ

మార్చి పదబంధ ప్రహేళికకు సమాధానాలు:

అడ్డం : 1. పార 3. శంక 5. అనుమతి 7. ఉపన్యాసం 9. లగం 10. గటుక్కు 12. శుచి 13. టితే 15. వెల్కం 16. నీతి 17. సందు 18. ఊరు 20. చుకా 22. టీక 23. విరసం 25. శవి 27. కాదంబరి 29. జటాయువు 31. పుల్ల 32. పంక్తి.

నిలువు : 1. పానుగంటి 2. రమ 3. శంప 4. కన్యాశుల్కం 5. అల 6. తిగ 7. ఉక్కు 8. సంచి 11. టువ్వ 14. తేనీరు 15. వెదురు 18. ఊకదంపు 19. కూర 21. కాశయుక్తి 22. టీకా 23. విరి 24. సంజ 26. పీపు 28. బల్ల 30. టాపం.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి మార్చి 25 వ తేదీలోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపేవారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

మార్చి ప్రహేళిక విజేతలు:

1. బి. ఉదయిని—నెల్లూరు. 2. కొల్లూరి లక్ష్మి—అమలాపురం. 3. మొవ్వ విశాలాక్ష—కడప. 4. పి. వి. రామారావు — వరామిశ్కిగూడెం. 5. ఆర్. శ్రీమన్నారాయణ శర్మ—నల్లగొండ 6. ఇటికాల నీలకంఠరావు—ఖమ్మం 7. వి. కె. మోహన్—నగరం. 8. జి. సాయిగీత—నగరం. 9. యస్. గోపాల్—కావలి. 10. జె. వి. రాజగోపాల్—కావలి. 11. పిన్నక నాగేశ్వరరావు—లేజండ్ల 12. అలపర్తి లక్ష్మీతులసి—నందివెలుగు. 13. జి. వి. ఆర్. మూర్తి—విశాఖ. 14. వి. శ్యామల—మచిలీపట్నం. 15. కె. యల్. నరసింహమూర్తి & యం. కృష్ణమాచార్య—అంజన పల్లి.

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony, Kodambakkam, Madras-600024 & Printed by D. Hanumantha Rao at Kranti Press, 12, Francis Joseph Street, Madras 600001.


JYOTI,
APRIL,80 Rs/3 REGD No M:8669
దాసరి నారాయణరావు
అక్కినేని నాగేశ్వరరావు
బుచ్చిబాబు
వెంకట్ అక్కినేని, నాగార్జున అక్కినేని